www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 173
గురువారం | 19-9-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 12.40 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 8.04, రేవతి తె. 5.15 వరకు; వర్జ్యం: రా.6.39-8.04; దుర్ముహూర్తం: ఉ.10.08-10.56, మ.2.57-3.45; అమృతఘడియలు: తె.3.07-4.32; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.10
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భూమి కంపించేలా దాడి

రష్యా క్షిపణులు-ఆయుధాల డిపోపై ఉక్రెయిన్ డ్రోన్ల పిడుగు

- పేలిన 240 టన్నుల ఆయుధాలు
- తీవ్రతకు 6 కి.మీ. మేర భూకంపం
- 14 కిలోమీటర్ల దాకా రేడియేషన్
- క్షిపణి దాడులను తట్టుకునేలా డిపోను నిర్మించిన రష్యా
- దాడికి 50కి పైగా డ్రోన్లు
- కొన్నింటినే నిలువరించిన రష్యా

కీవ్, సెప్టెంబరు 18: రష్యా క్షిపణులు, ఆయుధాల డిపోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి జరిపిన డ్రోన్ దాడులతో.. ఆయుధ డిపోను నేల మట్టం చేసింది. ఈ డిపోలో అణ్వాయుధాలను మోసుకెళ్లే క్షిపణులు, స్వల్పశ్రేణి ఇస్కందర్ మిసైల్స్, టోచ్కా-యూ బాలిస్టిక్ క్షిపణులు, గైడెడ్ ఏరియల్ బాంబులు, ఆర్టిలరీ షెల్స్ ఉన్నట్లు ఉక్రెయిన్ వర్గాలు

మిగతా 14వ పేజీలో...



నిన్న పేజర్లు..

నేడు వాకీటాకీలు

లెబనాన్‌లో మళ్లీ పేలుళ్లు



- ఇళ్లలో గృహోపకరణాల విస్ఫోటం
- 14 మంది దుర్మరణం.. 450 మందికి గాయాలు
- దాడి జరిపిందెవరు? అన్నివేళ్లూ ఇజ్రాయెల్ వైపు

ఇజ్రాయెల్ మూల్యం చెల్లించక తప్పదు: ఇరాన్.. ప్రతీకారం తీర్చుకుంటాం: హిజ్బుల్లా

- పేజర్లలో లిథియం అయాన్‌తోపాటు..
- పీఈటీఎన్ పేలుడు పదార్థం వినియోగం
- పేజర్ మైక్రోచిప్‌లో పీఈటీఎన్ ఆనవాళ్లు
- మొస్సాద్ ఎక్కువగా వాడేది పీఈటీఎనే??
- పేజర్లను తయారు చేసింది తైవాన్ కంపెనీ
- పేలుళ్లకు పది సెకన్ల ముందు బల్క్ సందేశాలు
- చదివే క్రమంలో హిజ్బుల్లా వర్గాలకు గాయాలు
- ఒక కంటిని కోల్పోయిన ఇరాన్ రాయబారి



బీరుట్, సెప్టెంబరు 18: పేజర్ల విస్ఫోటాలతో కల్లోలంగా మారిన లెబనాన్‌లో.. మరోమారు ఏకకాలంలో పేలుళ్లు సంభవించాయి. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో.. వాకీటాకీలు పేలిపోయాయి. ఈ పరికరాలన్నీ అయిదారు నెలల ముందు కొనుగోలు చేసినవే..! మంగళవారం నాటి ఘటనల్లో మృతి చెందిన హిజ్బుల్లా నేతల అంత్యక్రియల్లో కూడా పేలుళ్లు సంభవించాయి. లెబనాన్ వ్యాప్తంగా జరిగిన వాకీటాకీ విస్ఫోటాల్లో 14 మంది

మిగతా 14వ పేజీలో...

జమిలికి సై





కేంద్రం కీలక నిర్ణయం.. కోవింద్ కమిటీ సిఫారసులకు క్యాబినెట్ ఓకే

- విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహిస్తాం
- ఏకాభిప్రాయ సాధనతో ముందుకు వెళ్తాం
- వ్యతిరేకించే పార్టీలూ వైఖరి మార్చుకుంటాయి
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఈ నిర్ణయంతో దేశ ప్రజాస్వామ్యం మరింత చైతన్యవంతం: ప్రధాని మోదీ
- పంట ఉత్పత్తులకు మెరుగైన ధరలు
- 35 వేల కోట్లతో పీఎం-ఆశ కొనసాగింపు
- ఫాస్ఫేట్, పొటాష్‌పై 24 వేల కోట్ల సబ్సిడీ
- గిరిజనుల అభ్యున్నతికి 79,156 కోట్లు
- చంద్రయాన్-4, వీనస్ మిషన్‌కు ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు దశల వారీగా జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సులను ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఏకాభిప్రాయాన్ని సాధించి, దీనిని అమలు చేయాలని తీర్మానించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్రం క్యాబినెట్ సమావేశమైంది. జమిలి ఎన్నికలతోపాటు పలు ఇతర నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రైతులకు పంట ఉత్పత్తులకు ప్రోత్సాహకర ధరలు అందించటానికి వీలుగా పీఎం-ఆశ పథకాన్ని రూ.35,000 కోట్లతో కొనసాగించాలని నిర్ణయించింది. చంద్రుడి మీదికి భారతీయ వ్యోమగాములను తీసుకెళ్లే చంద్రయాన్-4 మిషన్‌కు అంగీకారం తెలిపింది. క్యాబినెట్ సమావేశం వివరాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లకు వెల్లడించారు. జమిలి ఎన్నికలకు పలు రాజకీయ పార్టీలు ఇప్పటికే మద్దతు తెలిపాయని.. దీనిని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందనతో ఒత్తిడికి గురై వైఖరి

మిగతా 2వ పేజీలో...

ఆచరణాత్మకం కాదు

- కేంద్రం నిర్ణయంపై విపక్షాల ఫైర్
- ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం
- ప్రజల దృష్టి మరల్చడానికే..: ఖర్గే
- చౌకబారు ఎత్తుగడ: టీఎంసీ
- సమాఖ్య విధానం ధ్వంసమవుతుంది: మజ్లిస్

జమిలి అమలైతే..

- తొలుత లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు
- ఆ తర్వాత 100 రోజులకు పంచాయతీ, మునిసిపల్! 2
- మధ్యంతరం వచ్చినా.. మిగిలిన కాలానికే ఆ ప్రభుత్వం

సవాళ్లెన్నో!

- రాజ్యాంగానికి 18 సవరణలు
- పార్లమెంటు ఆమోదం తప్పనిసరి
- కొన్ని సవరణలకు 2/3 మెజారిటీ అవసరం 2
- అంత సంఖ్యాబలం లేని ఎన్డీఏ
- మరికొన్నింటికి సగం కంటే ఎక్కువ రాష్ట్రాలు అంగీకరించాలి
- విపక్ష పాలిత రాష్ట్రాలు ఒప్పుకోవడం అనుమానమే

జమ్ము, కశ్మీర్‌లో 59% పోలింగ్

ప్రశాంతంగా తొలి దశ ఎన్నికలు

శ్రీనగర్/జమ్ము, సెప్టెంబరు 18 : జమ్ము, కశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 59 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. జమ్ము, కశ్మీర్‌లో జరిగిన గత ఏడు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఇదే అత్యధిక పోలింగ్ అని జమ్ము, కశ్మీర్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పీకే పోలే తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, మారుమూల ప్రాంతాల పోలింగ్ వివరాలు కూడా అందితే ఈ పోలింగ్ శాతం మరింత పెరగవచ్చని ఆయన చెప్పారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయిన పోలింగ్ రోజంతా స్థిరంగా కొనసాగింది. మహిళలు, పురుషులు, యువత, వృద్ధులు, నడవలేని వారు కూడా రాష్ట్రమంతటా పోలింగ్ బూత్‌ల వద్ద ఓపిగ్గా వేచి ఉండడం కనిపించింది. ఈ రాష్ట్రంలోని మొత్తం 90 అసెంబ్లీ సీట్లకు తొలిదశలో 24 సీట్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 16 కశ్మీర్ లోయలో ఉండగా.. 8 జమ్ము ప్రాంతంలో ఉన్నాయి. మొత్తం 23 లక్షల మందికిపైగా ఓటర్లు ఈ ఎన్నికల్లో 219



మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రతా దళాలతో విస్తృతంగా బందోబస్తు కల్పించారు. బిజ్‌బెహరా, డీహెచ్ పోరా వంటి ఒకటి రెండు చోట్ల రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు తప్ప ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. సెప్టెంబరు 25, అక్టోబరు ఒకటవ తేదీన మరో రెండు దశల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షించాలి

- 1960 నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరు 2
- నిబంధనలను సవరించాలి.. పాక్‌కు మోదీ సర్కారు నోటీసు



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని 15 రోజుల్లోగా కూల్చేయండి

- అనుమతి లేకుండా ఎలా నిర్మిస్తారు?
- నల్లగొండలో పార్టీ ఆఫీసు అక్రమ కట్టడం
- రూ.లక్ష జరిమానా చెల్లించండి: హైకోర్టు
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం: కంచర్ల
- చట్టం తనపని తాను చేస్తుంది: కోమటిరెడ్డి

హైదరాబాద్/నల్లగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నల్లగొండలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం అక్రమ నిర్మాణమని హైకోర్టు స్పష్టం చేసింది. దాన్ని 15 రోజుల్లో కూల్చేయాలని ఆదేశించింది. మునిసిపాలిటీ అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపట్టినందుకు రూ.లక్ష జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని నల్లగొండ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి నాలుగు వారాల్లో జమచేసి ఆధారాలు సమర్పించాలని తెలిపింది. ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి

మిగతా 14వ పేజీలో...

భద్రాచలం ప్రధాన అర్చకుడిపై వేటు 14

అర్చకుడైన ఆయన కుమారుడిపై కూడా..



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాలసీని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

రైతులూ.. వ్యాపారాలు చేయండి!

కుటుంబమంతా వ్యవసాయంలోనే ఉండొద్దు.. ఉద్యోగాలపైనా దృష్టి పెట్టాలి

- నాలుగేళ్లలో రాష్ట్ర బడ్జెట్ రూ.7 లక్షల కోట్లు!
- చైనా ప్లస్1కి తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానం
- ఎన్నారైల పెట్టుబడులతోనే రియల్ ఎస్టేట్ వృద్ధి
- ఎంఎస్ఎంఈ పాలసీ విడుదల సభలో సీఎం రేవంత్
- గత ప్రభుత్వం గొప్పలు చెప్పి, పైసలివ్వలేదు: భట్టి
- కాగితాల్లో కాదు అమలు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇక్కడ అన్ని రకాల వనరులు అందుబాటులో ఉండడంతో కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు. ఫలితంగా ఇక్కడి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) వ్యాపారం కూడా బాగా పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రూ.3 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ 2028కల్లా రూ.7 లక్షల కోట్లకు చేరుతుందని బలంగా

మిగతా 13వ పేజీలో...

చిన్న పరిశ్రమలకు అండ

13

- 6 గ్యారంటీలతో ఆదుకుంటామన్న ప్రభుత్వం
- నూతన ఎంఎస్ఎంఈ విధానం ఆవిష్కరణ
- ఓఆర్ఆర్-ట్రిపుల్ఆర్ మధ్య 10 'పార్కులు'
- 5% మహిళలు, 15% ఎస్సీ, ఎస్టీ వర్గాలకు
- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.కోటి, ఇతరులకు రూ.30 లక్షల పెట్టుబడి రాయితీ

ఫిక్స్‌డ్ చార్జీల పెంపు!



- నెలకు 300 యూనిట్ల విద్యుత్ దాటిన గృహ వినియోగదారులకు వర్తింపు
- ప్రస్తుతం ఎల్టీ కేటగిరీలో ఫిక్స్‌డ్ చార్జీ రూ.30
- కొత్త ప్రతిపాదనలు అమల్లోకి వస్తే రూ.150
- హెచ్‌టీ కేటగిరీలో విద్యుత్ చార్జీలూ పెంపు
- 33కేవీ కనెక్షన్లకు యూనిట్‌కు 50 పైసలు, 132/ఆపై కనెక్షన్లకు రూపాయి వరకు భారం
- ఈఆర్‌సీకి వార్షికాదాయ అవసరాల నివేదికలో డిస్కమ్‌ల ప్రతిపాదనలు 12
- రూ.1200 కోట్ల అదనపు ఆదాయం కోసం

మదర్సాలతో దేశ భద్రతకు ముప్పు

- శిశుమందిరాలకు నిధులెందుకు ఇవ్వడం లేదు?
- రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర మంత్రి బండి ధ్వజం
- రవంతరెడ్డి, ట్విట్టర్ టిల్లులతో ప్రమాదం 3
- రేవంత్, కేటీఆర్‌పై రఘునందనరావు వ్యాఖ్యలు

మంత్రుల్లో ఎవరో ఒకరు బుధ, శుక్రవారాల్లో గాంధీభవన్‌కు



- రేపు గాంధీభవన్‌కు మంత్రి పొంగులేటి?
- షెడ్యూల్ రూపకల్పనకు టీపీసీసీ చీఫ్ ఆదేశం
- కార్యకర్తల సమస్యలపై వినతుల స్వీకరణ

జమిలి అమలైతే..

తొలుత లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు

అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు కార్డు, ఒకే ఓటరు జాబితా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికను కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదించడంతో.. ఈ అంశంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. 2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే అందుకు తగిన సన్నాహాలు ఇప్పటి నుంచే జరపాలని భావిస్తున్న మోదీ ప్రభుత్వం.. శీతాకాల సమావేశాల్లోనే ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కొత్త విధానం ప్రకారం.. ఒక ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే పడిపోయి, ఎన్నికలు జరపాల్సి వస్తే.. అప్పుడు ఏర్పడే ప్రభుత్వం అయిదేళ్లలో మిగిలిన మూడేళ్ల కాలం వరకే కొనసాగుతుంది. దీనివల్ల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలకు అంత ఆసక్తి ఉండదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జమిలి ఎన్నికలు రెండు దశలుగా అమలవుతాయి. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి. రెండవ దశలో.. అంటే సార్వత్రిక ఎన్నికలు జరిగిన 100 రోజుల్లోనే పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయి. అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉంటుంది.

వేటిని సవరించాలి?

లోక్‌సభ పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 83, అసెంబ్లీల పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 172లో.. మూడేసి సెక్షన్లను ప్రధానంగా సవరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అయితే.. ఈ విషయంలో ప్రభుత్వం ఉభయసభల్లోనూ తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆమోదం పొందలేకపోతే జమిలి ఎన్నికల ప్రతిపాదన బుట్టదాఖలు కావడమే కాక.. ప్రభుత్వం నైతికంగా పార్లమెంట్ విశ్వాసాన్ని కోల్పోయినట్లవుతుంది. ఆమోదం పొందితే.. చాలా రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం కుదించుకుపోతుంది! కాగా.. 83, 172 అధికరణలకు చేసే రాజ్యాంగ సవరణలకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అవసరం లేదని కోవింద్ కమిటీ పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించిన తర్వాత వంద రోజులకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అమలు చేయాలంటే మాత్రం.. ఆ మేరకు చేసే రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది.

మరో ఐదు అధికరణలనూ..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల పర్యవేక్షణ, నిర్దేశకత్వం, నియంత్రణ ఎన్నికల కమిషన్ చేతుల్లోనే ఉంటుంది కనుక ఈ ఆర్టికల్‌ను కూడా జమిలి ఎన్నికల కోసం సవరించాల్సి ఉంటుంది. మునిసిపాలిటీలు, పంచాయితీలకు ఎన్నికలను ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(ఏ)ను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒకే ఓటరు జాబితాను, ఒకే ఫొటో గుర్తింపు కార్డును కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించేందుకు ఆర్టికల్ 325ను సవరించాల్సి ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనతో పాటు జమిలి ఎన్నికలు అనే పదాలను చేర్చేందుకు, శాసనసభల ఎన్నికలకు సంబంధించి పార్లమెంట్ అధికారాలను నిర్దేశించేందుకు ఆర్టికల్ 327ను సవరించాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లతో సంప్రదించి దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు జాబితాను రూపొందించాలంటే.. రాజ్యాంగంలోని 243కె, 243జడ్‌ఏలను కూడా సవరించాల్సి ఉంటుంది. ఈ సవరణలు (324 ఏ, 325, 243కె, 243జడ్‌ఏ) రాజ్యాంగంలోని షెడ్యూలు 7 కింద రాష్ట్రాల జాబితాలను ప్రభావితం చేస్తున్నందున.. 368(2) కింద వాటిని రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇక.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం ఒకే రకంగా ఉండాలంటే ఆర్టికల్ '82ఏ'ను రాజ్యాంగంలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీల తొలి సమావేశపు రోజును నిర్ణయించేందుకు, రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేసేందుకు, వాటి పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుక 82వ అధికరణలో అయిదు సెక్షన్లకు సవరణలు చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు.. జమ్మూకశ్మీర్ సహా శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కనీసం మూడు సవరణలు చేయాల్సి ఉంటుంది.

పీఎఫ్ ఉపసంహరణ పరిమితి లక్ష..!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్‌వో)కి సంబంధించి కేంద్ర కార్మిక శాఖ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భవిష్య నిధి(పీఎఫ్) ఉపసంహరణ పరిమితిని రూ.లక్షకు పెంచడంతోపాటు వేతనం పెంపునకు అడ్డంకిగా ఉన్న సీలింగ్‌ను కూడా సవరించింది. అదేవిధంగా ఈపీఎఫ్‌వో కార్యకలాపాలను మరింత సరళీకరించింది. మరింత అధునాతన డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఉద్యోగుల వ్యక్తిగత ఆర్థిక అవసరాల రీత్యా ప్రస్తుతం ఉన్న పీఎఫ్ ఉపసంహరణ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతున్నట్టు చెప్పారు. అదేవిధంగా కొత్తగా ఉద్యోగంలో చేరి ఆరు మాసాలు పూర్తికాని వారు కూడా తమ పీఎఫ్ నిధులను ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

పిల్లల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: పెన్షన్ ఖాతాలో పెట్టుబడి పెట్టడం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసేందుకు వీలు కల్పించే నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)-వాత్సల్యను బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. తల్లిదండ్రులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను ఆన్‌లైన్ లేదా బ్యాంకు లేదా పోస్టాఫీసులో తెరవొచ్చు. కనీసం రూ.1,000తో వాత్సల్య ఖాతాను ప్రారంభించవచ్చు. వార్షికంగా కనీసం రూ.1,000 జమచేయవచ్చు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు. ఎన్‌పీఎస్ ఖాతాల నుంచి ఉపసంహరించుకోవడానికి సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు అవుతున్నాయి. 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను తెరవవచ్చు. 18 ఏళ్లు నిండాక ఆ ఖాతా రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాగా మారిపోతుంది. 60 ఏళ్ల వయసు వచ్చిన తర్వాతి నుంచి ఖాతా నుంచి పెన్షన్ అందుతుంది.

అధికారిక నివాసాన్ని ఖాళీ చేయనున్న కేజ్రీవాల్


» 21న ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ ప్రమాణస్వీకారం?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన ఆప్ అధినేత కేజ్రీవాల్ తన అధికారిక నివాసం, వాహనాలు తదితర వసతులన్నిటిని 15 రోజుల్లో వదులుకోనునట్లు ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం వెల్లడించింది. అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి కేజ్రీవాల్ సాధారణ వ్యక్తిగా జీవిస్తారని తెలిపింది. ఢిల్లీలో ఆయనకు తగిన నివాసం కోసం అన్వేషిస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ చెప్పారు. అయితే కేజ్రీవాల్‌పై గతంలో పలు దాడులు జరిగినందున ఆయన భద్రతపై ఆందోళనలు ఉన్నాయని సింగ్ చెప్పారు. కాగా ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణస్వీకార కార్యక్రమం సెప్టెంబరు 21న ఏర్పాటు చేయనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వీకే సక్సేనా రాష్ట్రపతికి తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

పాలస్తీనా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: పాలస్తీనాలో ఆక్రమిత ప్రాంతం నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలని ఐక్యరాజ్యసమితి బుధవారం తీర్మానం చేసింది. ఇందుకు 12నెలల గడువు విధించింది. అంతర్జాతీయ న్యాయస్థానం సూచించిన విధంగా నిర్ణీత గడువులోపు చట్టపరమైన బాధ్యతల్ని పూర్తిచేయాలని డిమాండ్ చేసింది. అయితే ఈ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. భద్రతా మండలిలో ఉన్న 193 దేశాలకు గాను..124 దేశాలు ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించగా, భారత్ సహా 43 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.

'తేజస్'ను నడిపిన మోహన సింగ్!



న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: స్వదేశంలో తయారైన ఎల్‌సీఏ తేజస్ యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా పైలట్‌గా మోహన సింగ్ ఖ్యాతి గడించారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్)కు చెందిన ఎలైట్ 18 ఫ్లయింగ్ బుల్లెట్స్ స్క్వాడ్రన్‌లో చేరిన తొలి మహిళా యుద్ధ విమాన పైలట్‌గానూ ఆమె నిలిచారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన యుద్ధ విన్యాసాలు 'తరంగ్ శక్తి'లో ఆమె త్రివిధ దళాల వైస్ చీఫ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎల్‌సీఏ తేజస్ ఫైటర్ జెట్‌లో ఆమె పదాతిదళ, నావికాదళ వైస్ చీఫ్‌లకు సూచనలిస్తూ కనిపించడం గమనార్హం.

జమిలికి కేంద్రం సై!

(మొదటి పేజీ తరువాయి)



జమిలిపై నివేదికను రాష్ట్రపతి ముర్ముకు అందజేస్తున్న కోవింద్ (ఫైల్)

మార్చుకుంటాయన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ జరిపిన సంప్రదింపుల్లో పాల్గొన్న వారిలో 80 శాతానికిపైగా జమిలి ఎన్నికలకు మద్దతు తెలిపారని, ముఖ్యంగా యువత ఈ ప్రతిపాదనను బలంగా సమర్థించారని వెల్లడించారు. కోవింద్ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా పలు వేదికల మీద చర్చలను నిర్వహిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. చర్చల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించాలన్నది ప్రభుత్వ అభిమతమన్నారు. చర్చల ప్రక్రియను ముగించిన తర్వాత కేంద్ర న్యాయ శాఖ ముసాయిదా బిల్లును రూపొందిస్తుందని, క్యాబినెట్ ఆమోదంతో పార్లమెంటులో ప్రవేశపెడుతుందని వెల్లడించారు. కాగా, జమిలి ఎన్నికల్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారని విలేకర్లు అడగ్గా.. అశ్వినీ వైష్ణవ్ సూటిగా సమాధానం చెప్పకుండా, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత హయాంలోనే దీనిని అమలు చేస్తుందంటూ హోంమంత్రి అమిత్‌షా చెప్పారని గుర్తు చేశారు. జమిలి ఎన్నికలపై పార్లమెంటులో ఒకే బిల్లుగానీ.. కొన్ని బిల్లులనుగానీ ప్రభుత్వం ప్రవేశపెట్టవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. జమిలి ఎన్నికలను ఆమోదిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వల్ల భారతదేశ ప్రజాస్వామ్యం మరింత చైతన్యవంతమవుతుందని, ప్రాతినిధ్యం పెరుగుతుందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

క్యాబినెట్ ఇతర నిర్ణయాలు

1 రైతులకు పంట ఉత్పత్తులకు ప్రోత్సాహకర ధరలను ఇవ్వటానికి వీలుగా 'ప్రధానమంత్రి రైతు ఆదాయ సంరక్షణ పథకం' (పీఎం-ఆశ) కొనసాగింపు. మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల ప్రభావం నిత్యావసరాల మీద పడి సాధారణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండటానికి కూడా ఈ పథకం అవసరమని క్యాబినెట్ భావించింది. ఈ పథకానికి 15వ ఆర్థిక సంఘం గడువైన 2025-26 వరకూ రూ.35,000 కోట్ల మొత్తం కేటాయించింది. ధరల మద్దతు, ధరల స్థిరీకరణ నిధి, లోటు ధరల చెల్లింపులు, మార్కెట్ జోక్యం పథకాలను కలిపి పీఎం-ఆశ పేరుతో ఒకే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. రైతులకు మద్దతు ధరల భరోసా కల్పించటం దీని లక్ష్యం.

1 2024-25 రబీ సీజన్‌కు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ.24,474 కోట్ల సబ్సిడీ. దేశవ్యాప్తంగా గిరిజనుల సామాజిక ఆర్థిక అభ్యున్నతి కోసం రూ.79,156 కోట్లతో ప్రధానమంత్రి జన్‌జాతియా గ్రామ్ అభియాన్ పథకం.

1 ఐఐటీ, ఐఐఎంల మాదిరిగా ముంబైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ'ని నెలకొల్పుతారు. భారత్‌ను కంటెంట్ హబ్‌గా మార్చటం, మీడియా, వినోదం రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం లక్ష్యంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తారు.

1 బయోటెక్నాలజీ రంగంలో అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించటం కోసం బయో-రైడ్ పథకం.

త్వరలో లా కమిషన్ నివేదిక!

జమిలి ఎన్నికలకు సంబంధించి లా కమిషన్ కూడా తన నివేదికను త్వరలో వెలువరించే అవకాశం ఉంది. 2029 నుంచి దీనిని అమలు చేయాలని లా కమిషన్ సిఫార్సు చేయవచ్చని అంచనాలున్నాయి. వాస్తవానికి, స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి 1967 వరకూ దేశంలో జమిలి ఎన్నికలే జరిగాయి. ఆ తర్వాత కాలంలో మధ్యంతర ఎన్నికలు తదితర పలు కారణాల వల్ల ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

అమలుకు సవాళ్లెన్నో!

రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: కోవింద్ కమిటీ నివేదికను కేంద్ర క్యాబినెట్ ఆమోదించినప్పటికీ జమిలి ఎన్నికలు ఆచరణ రూపం దాల్చాలంటే ఎన్నో సవాళ్లున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైంది రాజ్యాంగ సవరణ. జమిలి కోసం రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలని కోవింద్ కమిటీ తన నివేదికలోనే సూచించింది. వీటికి పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అధికారపక్షమైన ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 119 మంది ఎంపీలున్నారు. రాజ్యాంగ సవరణలు మూడు రకాలుగా జరుగుతాయి. కొన్నింటికి లోక్‌సభ, రాజ్యసభల్లో సాధారణ మెజారిటీ అవసరం. మరికొన్నింటికి సాధారణ మెజారిటీతోపాటు, 2/3 వంతు మంది సభ్యుల మద్దతు కావాలి. ఇంకొన్నింటికి సగం కన్నా ఎక్కువ రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. 2/3 మెజారిటీ అవసరమైన పక్షంలో బిల్లు గట్టెక్కడం కష్టమే. ఎందుకంటే, పార్లమెంటు ఉభయసభల్లోనూ ఎన్డీఏకు 2/3 మెజారిటీ లేదు. ఇక రాష్ట్రాల ఆమోదం విషయానికొస్తే.. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అంగీకరిస్తాయా అన్నది అనుమానమే. జమిలి వల్ల చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నిర్దిష్ట కాలపరిమితి కంటే ముందే రద్దు అవుతాయి. దీనికి ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడతాయనేది మరో సవాలు. ప్రస్తుతం బీజేపీకి పార్లమెంటులో సొంతంగా మెజారిటీ లేదు. టీడీపీ, జేడీయూ, పలు చిన్న పార్టీల మద్దతుతో అధికారంలో కొనసాగుతోంది. జమిలి అమల్లోకి రావాలంటే ఆయా పార్టీల మద్దతు కచ్చితంగా అవసరం.

భారీ యంత్రాంగం అవసరం

ఒకేసారి దేశమంతా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలు భారీ సంఖ్యలో కావాలి. ఎన్నికల నిర్వహణకు అధికారులు, భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది అవసరం అవుతారు. ఒకవేళ జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తే జాతీయ స్థాయి అంశాలే ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇది జాతీయ పార్టీలకే మేలు చేస్తుంది. రాష్ట్రాల ఆశయాలు, స్థానిక పార్టీల ఉనికి దెబ్బతినే ప్రమాదం ఉంది. రాష్ట్రాల్లో రాజకీయంగా అనిశ్చిత వాతావరణం ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ దాన్ని అవకాశంగా తీసుకొని సమాఖ్య విధానాన్ని నీరుగార్చే ప్రమాదం ఉంది.

47 పార్టీల్లో 32 సమర్థించాయి

పార్టీల పరంగా చూస్తే.. జమిలి ఎన్నికలపై 47 పార్టీలు తమ అభిప్రాయాన్ని కోవింద్ కమిటీకు తెలియజేశాయి. వాటిలో 32 సమర్థించాయి. ప్రస్తుతం వీటి సంఖ్యాబలం 271. 15 పార్టీలు వ్యతిరేకించాయి. వీటి సంఖ్యాబలం 205. కోవింద్ కమిటీకి అభిప్రాయాలు తెలుపని పార్టీలు కూడా ఉన్నాయి. వీటి సంఖ్యాబలం 29. అభిప్రాయం తెలుపని పార్టీల్లో తెలుగుదేశం కూడా ఉంది. అయితే, తాజాగా జమిలికి సైద్ధాంతికంగా తాము మద్దతిస్తామని ఆ పార్టీ తెలిపినట్లుగా ఓ వార్తాసంస్థ ప్రకటించింది. కోవింద్ కమిటీ ఎదుట జమిలికి మద్దతిచ్చిన పార్టీలన్నీ బీజేపీ, దాని మిత్రపక్షాలే. వీటిలో బీజేడీ ప్రస్తుతం బీజేపీతో లేదు. ఆరు జాతీయపార్టీల్లో రెండు (బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ) జమిలికి మద్దతు తెలపగా, నాలుగు (కాంగ్రెస్, ఆప్, బీఎస్పీ, సీపీఎం) వ్యతిరేకించాయి.



ఇస్రోకు భారీ బూస్ట్!

చంద్రయాన్-4, శుక్రయాన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: ఇస్రో తదుపరి మూన్ మిషన్ చంద్రయాన్-4కు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో పాటు వీనస్ ఆర్బిటర్ మిషన్, భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుతోపాటు నెక్స్ట్-జెన్ లాంచ్ వెహికిల్ (ఎన్‌జీఎల్‌వీ) వంటి భారీ ప్రాజెక్టులకు కూడా ఓకే చెప్పింది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు నిధులు సైతం కేటాయించింది. కేబినెట్ భేటీలో ఇస్రో ప్రాజెక్టులపై తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. చంద్రయాన్ 4లో ల్యాండర్, రోవర్ చంద్రుడిపై దిగడమే కాకుండా.. అక్కడ చంద్రుడి మట్టి, రాళ్లను సేకరించి భూమిపైకి తీసుకొచ్చేలా డిజైన్ చేశారు. ఈ ప్రయోగం మూడేళ్లలో పూర్తి కావొచ్చని భావిస్తున్నారు. చంద్రయాన్-4 మిషన్‌కు రూ.2,104 కోట్లు ఖర్చవుతుందని అంచనా. చంద్రుడు, అంగారకుడు తర్వాత ఇస్రో.. శుక్ర గ్రహంపై దృష్టి పెట్టింది. రూ.1,236 కోట్లతో వీనస్ ఆర్బిటర్ మిషన్ (వీవోఎం)పేరిట శుక్రయాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 2028 మార్చిలో ఈ మిషన్ ప్రయోగం ఉంటుంది. శాస్త్రీయ పరిశోధనల కోసం సొంతంగా భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2028 నాటికి భారత స్పేస్ స్టేషన్ మొదటి దశను పూర్తిచేసేలా సన్నాహాలు చేస్తున్నారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రారంభించాలని, 2040 నాటికి.. భారతీయ వ్యోమగామిని చంద్రుడిపై కాలుపెట్టేలా చూడాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం గగన్‌యాన్ మిషన్‌ను ఇస్రో సవరించింది. దీని ప్రకారం కేంద్రం కూడా ఈ మిషన్‌కు ఇచ్చే నిధులను రూ.20,193 కోట్లకు పెంచింది. నెక్స్ట్-జెన్ లాంచ్ వెహికిల్ (ఎన్‌జీఎల్‌వీ) అభివృద్ధికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఎన్‌జీఎల్వీ ప్రాజెక్టు మొత్తం బడ్జెట్ రూ.8,240 కోట్లు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎనిమిదేళ్లలో 3 లాంచ్ వెహికిల్స్‌ను అభివృద్ధి చేయనున్నారు.

భూసేకరణ పరిహారంలో జాప్యమెందుకు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

తదుపరి విచారణ అక్టోబరు 21కి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ జరుపుతున్న ప్రభుత్వాలు.. బాధితులకు పరిహారం చెల్లింపులో, పునరావాసం కల్పించడంలో జాప్యం చేస్తుండడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భూ సేకరణ తర్వాత పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ న్యాయవాది కిషన్‌చంద్ జైన్ ఈ ఏడాది ఆగస్టు 3న సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ కిషన్‌చంద్ జైన్ వాదనలు వినిపిస్తూ.. భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం-2013లో భాగంగా బాధితులకు సత్వర న్యాయం అందాలనే ఉద్దేశంతో భూసేకరణ, పునరావాస, పరిహార సంస్థ (ఎల్ఏఆర్ఆర్‌ఏ) ఏర్పడిందని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం పరిహారం అందజేత, పునరావాసం కల్పించడంలో అన్ని రాష్ట్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఉదాహరణకు.. ఉత్తరప్రదేశ్‌లో 10,468 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కేసులను పరిష్కరిస్తున్న తీరును చూస్తే అవన్నీ పరిష్కారం కావడానికి మరో పదేళ్లు పడుతుందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 21వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు అన్ని రాష్ట్రాలకు చెందిన బాధ్యులు వర్చువల్ విధానంలో సుప్రీంకోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది.

గవర్నర్‌తో సిద్దు సర్కార్ అమీతుమీ!

బెంగళూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 'రాజ్‌భవన్ వర్సెస్ సర్కారు' అన్నట్లుగా వ్యవహారాలు సాగుతున్నాయి. ముడా ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతులు ఇచ్చినప్పటి నుంచి పరిస్థితి ఇలా తయారైంది. తాజాగా వీసీల నియామకంలో ప్రభుత్వం భిన్నమైన నిర్ణయం తీసుకుంది. విశ్వవిద్యాలయాల ఉప కులపతులను ఇన్నాళ్లూ గవర్నరే నియమించేవారు. ఇకపై ప్రభుత్వమే వారిని నియమించేలా మంత్రివర్గం తీర్మానం చేసింది. ఉప కులపతులను గవర్నర్ నియమించే విధానానికి స్వస్తి పలకాలని తీర్మానించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటి వరకు గవర్నర్‌కు ఉన్న అధికారాన్ని ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకుంది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విశ్వవిద్యాలయాల వీసీల నియామకం సవరణ బిల్లు-2024ను కేబినెట్‌లో ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం అన్ని విశ్వవిద్యాలయాలకు కులపతిగా గవర్నర్ వ్యవహరిస్తూ, ఉప కులపతులను నియమించేవారు. సవరణ బిల్లు శాసనసభలో ఆమోదం పొందితే గవర్నర్‌కు ఆ అధికారం తగ్గినట్లు అవుతుంది. గతంలో కేరళ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయమే తీసుకుంది.

జమిలి ఆచరణాత్మకం కాదు

కేంద్రం నిర్ణయంపై విపక్షాల మండిపాటు.. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

» ప్రజల దృష్టి మరల్చడానికే 'జమిలి': ఖర్గే

» జమిలికి బీఎస్పీ చీఫ్ మాయావతి మద్దతు



బుధవారం విలేకరులతో మాట్లాడుతున్న ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. ఈ విధానం ఆచరణాత్మకం కాదని, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సమాఖ్య విధానానికి వ్యతిరేకమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. మోదీ ప్రభుత్వం అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. జమిలి విధానాన్ని దేశం అంగీకరించబోదని పేర్కొన్నారు. 'ఒక దేశం.. ఒకేసారి ఎన్నికలు' అంశం బీజేపీ మరో చౌకబారు ఎత్తుగడ అని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ విమర్శించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటున్న బీజేపీ.. ప్రస్తుతం హరియాణా, జమ్మూ కశ్మీర్‌తో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను ఒకేసారి నిర్వహించలేని కేంద్రం జమిలి పాట పాడుతోందని శివసేన (యూబీటీ) విమర్శించింది. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం, మహిళలపై నేరాలు, రైతుల కష్టాలు వంటి సమస్యలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వానికి జమిలి ఎన్నికల అంశం మాత్రం చాలా ముఖ్యమైపోయిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, ఎంపీ అరవింద్ సావంత్ వ్యాఖ్యానించారు. ఒక దేశం.. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే 'జోక్'గా అభివర్ణించారు. త్వరలో నిర్వహించాల్సిన అన్ని ఎన్నికలను ఐదేళ్ల పాటు వాయిదా వేసేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రాల హక్కులను హరిస్తుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు సమాఖ్య విధానాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తాయని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగడం వల్ల ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తప్ప ఎవరికీ ఎలాంటి సమస్య లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఎప్పటికీ తామే పాలించాలని ఆరాటపడుతున్న బీజేపీ జమిలి ఎన్నికల కోసం ప్రయత్నిస్తోందని జేఎంఎం విమర్శించింది. మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనను చీల్చిన బీజేపీ.. ఝార్ఖండ్‌లో జేఎంఎంను దెబ్బతీయాలని చూస్తోందని ఆ పార్టీ ఎంపీ మహువా మాఝీ ఆరోపించారు. జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలన్నదే బీజేపీ ఎజెండా అని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయాన్ని ఆప్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. 4 రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం చేతకానప్పుడు దేశమంతా ఒకేసారి ఎన్నికల గురించి మాట్లాడడం విడ్డూరమని ఎద్దేవా చేసింది. కాగా, కేంద్రం నిర్ణయానికి బీఎస్పీ మద్దతు తెలిపింది. ఈ విషయంలో తమ పార్టీ అనుకూల వైఖరి అవలంబిస్తుందని, దేశ ప్రయోజనాలే జమిలి లక్ష్యం కావాలని మాయావతి అన్నారు.

చరిత్రాత్మక నిర్ణయం: ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు


జమిలికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని బీజేపీ నాయకులతో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు స్వాగతించాయి. రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత విధానంతో అభివృద్ధికి విఘాతం కలుగుతోందని, ఖజానాపై భారం పడుతోందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధం చేయడానికి జమిలికి కేంద్రం ఆమోదం తెలిపిందని, తద్వారా ఎన్నికల ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఎల్‌జేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కొనియాడారు. జమిలితో దేశంలో తరచూ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం తప్పుతుందని జేడీ(యూ) అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్‌ప్రసాద్ పేర్కొన్నారు. రాజకీయ సుస్థిరతకు, ప్రజాసామ్య పటిష్ఠానికి కేంద్రం మైలురాయిలాంటి నిర్ణయం తీసుకుందని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. జమిలి ప్రక్రియను తొలి ప్రధాని నెహ్రూయే ప్రారంభించారని, ఆయన చేసింది తప్పని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నిరూపిస్తారా అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రశ్నించారు.

సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షించాలి

» 1960 నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరు

» నిబంధనలను సవరించాలి

» పాకిస్థాన్‌కు నోటీసు ఇచ్చిన మోదీ సర్కారు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: సింధు నదీ జలాల ఒప్పందాన్ని సమీక్షించాలని భారత్ డిమాండ్ చేసింది. 1960లో పాక్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ మేరకు మోదీ సర్కారు పాకిస్థాన్‌కు నోటీసు ఇచ్చింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని సమీక్షించడంతో పాటు నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందని ఆగస్టు 30న పాక్‌కు ఇచ్చిన నోటీసులో స్పష్టం చేసింది. ఒప్పందంలోని ఆర్టికల్ 12(3) ప్రకారం ఇరు దేశాలు నిబంధనలను ఎప్పటికప్పుడు సవరించుకోవాల్సి ఉంటుంది. సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ ఉదారంగా వ్యవహరిస్తుండగా.. పాకిస్థాన్ మాత్రం దీన్ని అదనుగా తీసుకొని భారత్ వైపు నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలోనే 1960లో కుదిరిన ఒప్పందాన్ని సమీక్షించాలని డిమాండ్ చేస్తోంది. ఒప్పందం జరిగిన నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు మధ్య చాలా మార్పులు చోటుచేసుకున్నాయని, ఒప్పందంలోని పలు అధికరణల కింద సింధు జలాలపై పునఃపరిశీలన అవసరమని పేర్కొంటున్నారు. జనాభా లెక్కలు మారిపోవడంతో వ్యవసాయ, ఇతర అవసరాలకు నదీ జలాల వినియోగం పెరగడం; భారతదేశ ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను చేరుకోవడం కోసం స్వచ్ఛ ఇంధనాన్ని అభివృద్ధి చేయడం; జమ్మూకశ్మీరులో పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచిపోషించడం వంటి కారణాల నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందంలో తన హక్కులను పూర్తిగా వినియోగించుకోవాలని నిర్ణయించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాట్లే, కిషన్‌గంగా జల విద్యుత్తు ప్రాజెక్టుల నిర్వహణపై సుదీర్ఘకాలంగా వివాదం కొనసాగడం కూడా పాకిస్థాన్‌కు నోటీసు ఇవ్వడానికి ఓ కారణంగా భావిస్తున్నారు. సింధు జలాల ఒప్పందంపై భారత ఉదారతను పాక్ అవకాశంగా తీసుకుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మధ్యవర్తిత్వం, తటస్థ నిపుణుల వ్యవస్థలను కూడా వినియోగించుకోకపోవడం వంటి పరిణామాలతో సమస్య మరింత జటిలమైంది. ఈ క్రమంలోనే ఒప్పందంలోని వివాద పరిష్కార యంత్రాంగాన్ని సమీక్షించాలని కూడా భారత్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునఃపరిశీలించాలంటూ జమ్మూకశ్మీరు ప్రజలు కూడా డిమాండ్ చేస్తుండడం విశేషం. పంజాబ్, హరియాణాల్లో కూడా నదీ జలాల అంశం ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉంది.

జానీ మాస్టర్‌పై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు

- 40 పేజీల లేఖను సమర్పించిన బాధితురాలు
- అండగా ఉంటామన్న కమిషన్ చైర్‌పర్సన్ శారద
- జానీ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదుకు అవకాశం



హైదరాబాద్/రాంగోపాల్‌పేట్/నార్సింగ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీబాషాపై మహిళా కమిషన్‌లోనూ ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు బాధితురాలితో కలిసి పలు మహిళా సంఘాల నాయకులు బుధవారం మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తనపై జరిగిన లైంగిక వేధింపుల వివరాలను పేర్కొంటూ 40పేజీలతో కూడిన లేఖను బాధితురాలు సమర్పించారు. పరిగణనలోకి తీసుకున్న కమిషన్... ఫిర్యాదు ను స్వీకరించడంతోపాటు న్యాయం చేస్తామని ఆమెకు హామీ ఇచ్చింది. అనంతరం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మీడియాతో మాట్లాడుతూ మహిళలకు అండగా మహిళా కమిషన్ నిలబడుతుందని, మహిళా కొరియోగ్రాఫర్‌కు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ కొరియోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న జానీ మాస్టర్ బాధిత మహిళను ఇబ్బంది పెట్టారని, అసోసియేషన్ సభ్యత్వమున్నా ఆమెకు అవకాశాలు రాకుండా చేశాడని దుయ్యబట్టారు. కాగా, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర మండలి డిమాండ్ చేసింది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌లో లైంగిక వేధింపుల ఫిర్యాదుల ప్యానల్ ఉన్నా మహిళలపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేసింది. కాగా, జానీ మాస్టర్‌పై నమోదైన కేసులో నార్సింగ్ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అతడిని పట్టుకొనేందుకు 4 ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నెల్లూరుతోపాటు ముంబై, ఢిల్లీలో అయన కోసం వెతుకుతున్నారు. మరోవైపు.. ఫిర్యాదుదారు మైనర్‌గా ఉన్నప్పుడే జానీ మాస్టర్ ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ కేసును పోక్సో కేసుగా మార్చే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.

ఇది.. లవ్ జిహాదే : బీజేపీ నేత శిల్పారెడ్డి

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు.. లవ్ జిహాదే నని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్లపాటు ఓ యువతిని వేధించడం, మతం మారాలని ఒత్తిడి చేయడం, దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితుడిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. లైంగిక వేధింపుల కేసును తీవ్రంగా పరిగణించి.. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మైనార్టీ గురుకులం నుంచి ముగ్గురు విద్యార్థుల పరార్

- గురుకుల ఆవరణలోకి కల్లు ప్యాకెట్లు
- గుర్తించి ప్రశ్నించిన ఉపాధ్యాయులు, సిబ్బంది
- ప్రిన్సిపాల్ మందలిస్తారన్న భయంతో పరార్?

దేవరకొండ/మహేశ్వరం, సెప్టెంబరు 18: నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని కొండభీమనపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు గోడ దూకి పరారయ్యారు. మైనార్టీ గురుకుల పాఠశాలల జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ విష్ణుమూర్తి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు గురుకుల పాఠశాల ప్రహరీ పైనుంచి లోపలికి 3 ప్యాకెట్లను విసిరారు. వాటిని ముగ్గురు విద్యార్థులు తీసుకున్నారు. ఉపాధ్యాయులు గమనించి విద్యార్థులను ప్రశ్నించగా బిర్యానీ పొట్లాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయులు పరిశీలించగా వాటిలో కల్లు ఉన్నట్లు తేలింది. ఆ ప్యాకెట్లను ఎవరు వేశారని ప్రశ్నించగా, తమకు తెలియదని విద్యార్థులు సమాధానమిచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి ముగ్గురు విద్యార్థులు కనపడకపోవడంతో ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హనుమంతు అశోక్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా పాఠశాల గోడ దూకి పరారైనట్లు గుర్తించారు. వెంటనే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యార్థుల తల్లిదండ్రులకు, నల్లగొండ రీజనల్ కోఆర్డినేటర్ విష్ణుమూర్తికి సమాచారమిచ్చారు. ఘటనపై బుధవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు.. విద్యార్థులను వెతికేందుకు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములునాయక్ తెలిపారు. బుధవారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, ఆర్డీవో శ్రీరాములు పాఠశాలలో విచారణ నిర్వహించారు. కాగా, కల్లు ప్యాకెట్లు బయటనుంచి గురుకులంలోకి రావడంతో ప్రిన్సిపాల్ మందలిస్తారనే భయంతోనే విద్యార్థులు పారిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. 'తల్లిదండ్రులు మా గురించి వెతకొద్దు.. నా జీవితం నేను చూసుకుంటాను. నా తరఫున తప్పు జరిగి ఉంటే క్షమించండి' అంటూ పారిపోయిన విద్యార్థుల్లో ఒకరు రాసినలేఖను అతని పెట్టెలో గుర్తించారు. 'మేము ముగ్గురం కలిసి పారిపోతున్నాం. 10 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుద్దాం' అని ఆ లేఖలో రాసి ఉంది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

హాస్టల్‌లో ఉంటూ చదవడం ఇష్టం లేదని ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని బీసీ సంక్షేమ గురుకుల వసతి గృహంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కె.సిద్ధు గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సిద్ధు తరగతి గది భవనం మొదటి అంతస్థుపైకి ఎక్కి కిందకు దూకాడు. తీవ్ర గాయాలైన సిద్ధును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

తీవ్రవాదుల్లా బీజేపీ నేతల వ్యాఖ్యలు

రాహుల్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు.. రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తల ధర్నాలు, ఆందోళనలు

- గాంధీభవన్ వద్ద దిష్టిబొమ్మల దహనం
- బీజేపీ ఆఫీస్ ముట్టడి యత్నం
- ఆందోళనలు ఉధృతం చేస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- భోగం వేషం వేసే నటి కూడా దారుణంగా మాట్లాడుతోంది: దానం



హనుమకొండ అంబేడ్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన సభలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్

హనుమకొండ సిటీ, మహబూబాబాద్, హుజూరాబాద్, హైదరాబాద్, సెప్టెంబరు 18: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. హనుమకొండలోని అంబేడ్కర్ జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన ధర్నా, నిరసన సభకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. రాహుల్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టు, ఢిల్లీ బీజేపీ నేత తర్వీందర్‌సింగ్, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. సభలో మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రసంగిస్తూ బీజేపీ నేతలు తీవ్రవాదుల్లా మాట్లాడారని, వారి వ్యాఖ్యలు దేశ భద్రత, సమగ్రతకు భంగం కలిగేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షాకు చిత్తశుద్ధి ఉంటే బీజేపీ నేతలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆ తర్వాత కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై ఈగ వాలినా సహించబోమన్నారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాగరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ క్షమాపణలు చెప్పాలి: సీతక్క

తక్షణమే రాహుల్‌కు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన ఆందోళనలో సీతక్క పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, గాంధీభవన్ ముందు పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి, తర్వీందర్‌సింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. భోగం వేషం వేసే ఓ నటి కూడా దారుణంగా మాట్లాడుతోందని బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. మరోవైపు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డగించడంతో అక్కడే కూర్చుని నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ నేతలపై బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు గాంధీభవన్‌కు మంత్రి పొంగులేటి?

- వారంలో ఇద్దరు మంత్రుల రాక.. రేపటి నుంచే ప్రారంభం
- బుధ, శుక్ర వారాల్లో ఒక్కొక్కరు వచ్చేలా షెడ్యూల్ రూపొందించండి
- టీపీసీసీ అధ్యక్షుడి ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇకపై ప్రతి వారం.. బుధ, శుక్ర వారాల్లో ఎవరైనా ఒక మంత్రి.. గాంధీ భవన్‌లో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. సదరు మంత్రి.. కార్యకర్తలు, నేతల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. ఏ మంత్రి ఏ రోజున అందుబాటులో ఉండాలన్న అంశంపై షెడ్యూల్ రూపొందించాలని గాంధీభవన్ సిబ్బందికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గాంధీభవన్‌లో కార్యకర్తలు, నేతలకు మంత్రి అందుబాటులో ఉండే విధానం.. ఈ శుక్రవారం నుంచే ప్రారంభం కానుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోనే ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయంతో పాటు గాంధీ భవన్ ప్రాధాన్యతను పెంచేందుకే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న రోజునే.. వారంలో రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు రావాలని, నెలలో రెండు సార్లు సీఎం రేవంత్‌రెడ్డి కూడా రావాలని సభాముఖంగా కోరారు.

సాగర్ చూసి వెళ్తూ మృత్యుఒడికి

- మహిళా కానిస్టేబుల్ దుర్మరణం
- కాబోయే భర్తతో వచ్చి వెళుతుండగా దుర్ఘటన
- ప్రమాదంలో మూడు కార్లు, లారీ ముందుభాగం ధ్వంసం



శ్రావణి (ఫైల్)

నాగార్జునసాగర్, సెప్టెంబరు 18 : ఆమె అప్పటిదాకా నాగార్జునసాగర్ అందాలను తిలకించింది. కాబోయే భర్తతో సరదాగా బోటులో షికారు చేసింది. భర్త కంపెనీ పని చూసుకుని ఇంటికి వెళదామనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో బుధవారం ఈ విషాదం నెలకొంది. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, ఇందిరమ్మ దంపతుల కుమార్తె చేపల శ్రావణి(26) గద్వాల జిల్లా కేతిదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. శ్రావణికి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి.ప్రశాంత్‌తో ఇటీవలే వివాహం నిశ్చయం అయ్యింది. ప్రశాంత్ తన కంపెనీ పని మీద నల్లగొండ జిల్లా హాలియా వెళ్లాల్సి ఉండటంతో ఇద్దరూ బుధవారం ఉదయం కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ముందుగా పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యటించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో హాలియాకు బయలుదేరారు. ఈ క్రమంలో దయ్యాలగండి వద్ద ఒక క్రేన్ మరమ్మతులకు గురై రెండు రోజులుగా అక్కడే ఉంది. మరో ఇన్నోవా వాహనం క్రేన్‌ను ఢీకొట్టి అక్కడే ఉంది. అది ఘాట్ రోడ్డు కావడంతో ప్రశాంత్ తన వాహనాన్ని నెమ్మదిగా నడుపుతున్నాడు. అదే సమయంలో మాచర్ల నుంచి హైదరాబాద్ వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ప్రశాంత్ నడుపుతున్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఎడమ వైపున కూర్చున్న శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రశాంత్‌కు గాయాలు కావడంతో స్థానికులు నాగార్జునసాగర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్న మరో రెండు కార్లను కూడా లారీ ఢీ కొట్టడంతో మొత్తం మూడు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. లారీ ముందు టైర్లు పూర్తిగా కిందపడిపోయాయి. లారీ కింద ఇరుక్కుపోవడంతో రెండు క్రేన్ల సహాయంతో కారును తొలగించేందుకు నాలుగు గంటల సమయం పట్టింది. దీంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదంపై శ్రావణి సోదరుడికి పోలీసులు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సాగర్ సీఐ బీసన్న తెలిపారు.

మదర్సాలతో దేశ భద్రతకు ముప్పు

- శిశుమందిరాలకు నిధులెందుకు ఇవ్వడం లేదు?
- రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర మంత్రి బండి ధ్వజం
- రవ్వంతరెడ్డి, ట్విట్టర్ టిల్లులతో రాష్ట్రానికి ప్రమాదం
- రఘునందన్‌రావు వ్యాఖ్యలు



జమ్మికుంట, మిల్స్‌కాలనీ (వరంగల్), సెప్టెంబరు 18: ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సాలు దేశ భద్రతకు ముప్పు అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో బాలికల వసతి గృహ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చీపురుపుల్లతో కూడా ఏకే-47లు తయారు చేసేంతటి శిక్షణ ఇస్తూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న మదర్సాలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఎందుకు ఇస్తున్నాయని ప్రశ్నించారు. భారతీయ సనాతన సంస్కృతి సంప్రదాయాలను పెంపొందిస్తూ విద్యను అందిస్తున్న శిశుమందిర్ విద్యాలయాలకు నిధులెందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వేలాది టీచర్ పోస్టులు, 20వేలకు పైగా పారిశుధ్య కార్మికుల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. ఆ శాఖకు మంత్రి కూడా లేకపోవడం బాధాకరమని అన్నారు. తాను కూడా శిశుమందిర్ విద్యార్థినే అని, తనతో పాటు తన అన్నయ్యలు, అక్కయ్య కూడా శిశుమందిర్‌లోనే చదువుకున్నారని గుర్తుచేశారు. శిశుమందిరాల్లో చదువుకున్న వాళ్లు ఏ రంగంలో ఉన్నా కూడా జాతీయవాద భావజాలంతో పని చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు విమర్శించారు. రవ్వంతరెడ్డి, ట్విట్టర్ టిల్లుతో రాష్ట్రానికి ప్రమాదమంటూ రేవంత్‌రెడ్డి, కేటీఆర్‌లను ఎద్దేవా చేసిన రఘునందన్.. వారిద్దరూ రోజూ సాయంత్రం మాట్లాడుకుంటున్నారని ఆరోపించారు. లేకపోతే జన్వాడ ఫాంహౌస్ ఎందుకు కూల్చడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బుధవారం వరంగల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ అవివేకంగా మాట్లాడుతున్నారని, దేశంలో రక్షణ లేదంటున్న రాహుల్, ఆయన చెల్లెలు ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు.

వైసీపీకి మాజీ మంత్రి బాలినేని గుడ్‌బై

ఫలించని జగన్, సజ్జల బుజ్జగింపులు



ఒంగోలు, (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా కునారిల్లుతున్న వైసీపీకి మరో బిగ్‌షాక్ తగిలింది. ఇప్పటికే ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ముగ్గురు ఎమ్మెల్సీలతో సహా పలువురు ముఖ్య నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు ఆ పార్టీ అధినేత జగన్ బంధువు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంతు! బుధవారం ఆయన వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. విలువలు లేని, ఆత్మాభిమానానికి అవకాశం లేని వైసీపీలో కొనసాగలేకపోతున్నానని ఆయన ప్రకటించారు. "జగన్ చాలా తప్పులు చేశాడు.. ఇప్పటికీ మారలేదు" అని బాలినేని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో ఆయన గురువారం భేటీ కాబోతున్నారు. దీంతో ఆయన జనసేనలో చేరబోతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. మాజీ సీఎం రోశయ్య మంత్రివర్గంలో గనులశాఖ మంత్రిగా ఉన్న బాలినేని వైసీపీ ఆవిర్భావంతో మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నాడు వైసీపీలో చేరారు. అప్పటి నుంచి ఆ పార్టీ రాష్ట్ర నాయకుల్లో ఒకరిగా ఉన్నారు. జగన్‌కు వరుసకు బాబాయి అయిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి బాలినేని బావమరిది.

పవన్ నిర్ణయం మేరకు నడుచుకుంటా: బాలినేని

వైసీపీలో రాజకీయ విలువలు కరువయ్యాయని రాజీనామా అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. 'ఆంధ్రజ్యోతి'తో బాలినేని మాట్లాడుతూ, తాను ఎలాంటి షరతులు లేకుండా స్వచ్ఛందంగా జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యానని చెప్పారు. ప్రజాసేవ, పార్టీసేవలో తనను ఎలా వినియోగించుకోవాలనేది పవన్‌కల్యాణ్ నిర్ణయమన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో నమ్మించి.. రూ. 5 కోట్లు దోచేసి

- కేటుగాడిని అరెస్టు చేసిన సీఎస్‌బీ పోలీసులు
- పెట్టుబడుల పేరుతో వచ్చే సోషల్ మీడియా ప్రకటనలు నమ్మొద్దు: శిఖాగోయల్

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి రూ. 5.27 కోట్లు మోసం చేసిన కేటుగాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని రోజుల క్రితం ఫేస్‌బుక్‌లో వచ్చిన బిజినెస్ ప్రమోషన్ లింక్‌తో హైదరాబాద్‌కు చెందిన బాధితుడు 'ఏ117 ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ ఆఫీషియల్ స్టాక్ కమిటీ' అనే వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. అంకుర్ కేడియా ఆ గ్రూప్ సీఈవోగా పరిచయం చేసుకుని స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తాల్లో లాభాలు వస్తాయని నమ్మించాడు. రెండు దఫాల్లో రూ. 5.27 కోట్లు కేటుగాడు చెప్పిన బ్యాంకు ఖాతాల్లో బాధితుడు జమచేశాడు. లాభాలు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సీఎస్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన అధికారుల బృందం.. నిందితుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన సైదుల్ ఇస్లామ్ ఖాన్‌గా గుర్తించి శుక్రవారం అరెస్టు చేశారు. పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'జమిలి' దిశగా...

జమిలి ఎన్నికల విషయంలో మరో అడుగుపడింది. ఈ మధ్యనే, సార్వత్రిక ఎన్నికలకు కాస్తంత ముందు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన నివేదికను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. లోక్‌సభలో సొంతబలం గట్టిగా ఉన్న తొలి రెండు పర్యాయాల్లో ఈ దిశగా సాగించిన ప్రయత్నాలను, ఇప్పుడు సరిపడా స్వశక్తి లేని దశలో కూడా ముందుకు తీసుకుపోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. జమిలితో దేశానికి ఎంతో మంచిది అంటూ బీజేపీ పెద్దలు పట్టు వీడకుండా పోరాడుతున్న తీరు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

విపక్షాలు ఆదినుంచీ జమిలిని వ్యతిరేకిస్తున్నాయి కనుక, ఇప్పుడు మరింత గట్టిగా విరుచుకుపడటం సహజం. దేశానికి మంచిదన్న పేరిట బీజేపీ తన స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం, ఉజ్వల భవిష్యత్తు కోసం, మిగతాపార్టీల పతనం కోసం ఈ జమిలిని దేశంమీదకు రుద్దుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. చీటికీమాటికీ ఎక్కడోక్కడ ఎన్నికలు వచ్చిపడుతూ, అవి ఎక్కడ జరిగినా విధాన నిర్ణయాలకు, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్న స్థితిలో జమిలి వల్ల మాత్రమే ప్రజాధనం ఆదాకావడంతో పాటు, అభివృద్ధి కూడా పరుగులుపెడుతుందని అధికారపక్షం చెబుతూవస్తోంది. మోదీ మొదటివిడత ఎన్నికల మానిఫెస్టోలోనే జమిలి ప్రతిపాదన ఉంది. మరో రెండేళ్ళకు నీతిఅయోగ్ బరిలోకి దిగింది. మరో రెండేళ్ళకు లా కమిషన్ తన లోతైన అధ్యయనంతో ఏకకాల ఎన్నికలకు ఏయే రాజ్యాంగసవరణలు అవసరమో చెప్పింది. ఒకప్పుడు ససేమిరా కూడదన్న కమిషనే మోదీ ఏలుబడిలో అందుకు సరేనన్నది. ప్రధాని మోదీ ఓ అఖిలపక్షాన్ని ఏర్పాటుచేయడం, కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు వెళ్ళకపోవడం తెలిసిందే. జమిలిమీద ఎందుకంత ప్రేమ కలిగిందో తెలియదు కానీ, రెండేళ్ళక్రితం అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ తాము సిద్ధం అన్నరీతిలో ఓ ప్రకటన చేసేశారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్నప్పుడు, ఫలానా రాష్ట్రాన్ని జాబితాలో చేర్చకపోవడానికి ఈవీఎంల లభ్యత, సైనికబలగాల తరలింపుల వంటి సమస్యలు కారణమని ఎన్నికల అధికారులు చెబుతూంటారు. దేశవ్యాప్తంగా ఒకేమారు ఎన్నికలు జరపాలనుకుంటే ఈ తరహా చాలా రకాల కొరతలున్నాయని నిపుణులు చేస్తున్న విశ్లేషణలు కూడా కొందరికి నచ్చడం లేదు. బందోబస్తు సంగతి అటుంచితే, లక్షలాది ఈవీఎంలను వేలకోట్ల ఖర్చుతో కొనాల్సి ఉంటుందన్నది వాస్తవం. ఏకకాలంలో ఎన్నికల మంచిచెడులమీద ఇప్పటికే మాధ్యమాల్లో కొంత చర్చ జరిగింది. ప్రజాధనం వృథాకావడం నుంచి అభివృద్ధి సంక్షేమపథకాల నిరవధిక అమలు వరకూ ప్రతీ వాదనమీదా భిన్నాభిప్రాయాలున్నాయి.

జమిలి విషయంలో బీజేపీ పట్టుదల వెనుక తమ ఉనికిని దెబ్బతీసే రాజకీయ లక్ష్యం ఉన్నదని ప్రాంతీయపార్టీల వాదన. ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు కేంద్రంలో ఎవరుండాలన్న అంశమే రాష్ట్రస్థాయి ఎంపికనూ ప్రభావితం చేస్తుందని, ఓటర్లు అక్కడా ఇక్కడా ఒకేపార్టీ అన్నధోరణిలో పోతారని వాటి భయం. జాతీయాంశాలు ముందుకు వచ్చి తమను దెబ్బకొడతాయని వాటి వాదన. దేశభక్తి, సరిహద్దు సమస్యలు, యుద్ధాలు, కులమతాలు ఇత్యాదివి ప్రభావితం చేసినప్పుడు స్థానికాంశాలు వెనక్కుపోవచ్చు. జమిలివస్తే ఒకేపార్టీకి ఓటుచేస్తామని డెబ్బయ్‌శాతం మంది ఓ సర్వేలో చెప్పారట.

'ఒకేదేశం–ఒకే ఎన్నిక' విధానం ప్రజాస్వామ్యానికి మంచిదా కాదా అన్నది అటుంచితే, బీజేపీ గతంలో కంటే దిగజారిన తన సంఖ్యాబలంతో దానిని గట్టెక్కించగలదా అన్నది ప్రశ్న. బీజేపీ ఆశిస్తున్నది జరగాలంటే, రాజ్యాంగానికి అరడజను సవరణలు చేయాలి, అందుకు మూడింట రెండువంతులమంది సభ్యులు దానిపక్షాన ఉండాలి, ఆ తరువాత రాష్ట్రాలు దానిని ఆమోదించాలి. ఈ దేశంలో ప్రజలూ ఇతర పార్టీలూ జమిలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున ఇదంతా జరిగేది కాదని, ప్రజల దృష్టిమరల్చే ప్రయత్నమని కాంగ్రెస్ అంటున్నప్పటికీ, తిమ్మినిబమ్మిని చేసి అయినా సరే, బీజేపీ కచ్చితంగా తాను అనుకున్నది సాధిస్తుందని అత్యధికుల విశ్వాసం. కోవింద్ కమిటీ ముందు తలూపిన పార్టీల్లో కొన్ని భవిష్యత్తులో కాదుపొమ్మన్నా, కొత్త చేయూతలతో గట్టెక్కవచ్చునని బీజేపీ పెద్దలు నమ్మకంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

'డెడికేటెడ్ కమిషన్' కావాలి!

రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రధానమైనది. దేశంలోని సామాజికంగా వెనుకబడిన తరగతుల జీవన స్థితిగతుల వివరాలకు సాధికారికంగా సేకరించడానికి ఒక ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని తెలియజేసే ఆర్టికల్ ఇది. 1951లో బాబాసాహెబ్ తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా రాజీనామా చేసిన సందర్భంలో కూడా ఆయన 340 ఆర్టికల్ ప్రకారం ఒక ప్రత్యేక కమిషన్‌ను నియమింప చేయడంలో తాను సఫలీకృతం కానందుకు ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాకు ఇది కూడా ఒక ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు.

1953లో తొలిసారిగా 340 ఆర్టికల్ ద్వారా జాతీయస్థాయిలో కాకాసాహెబ్ కాలెల్కర్ కమిషన్‌ను భారతప్రభుత్వం నియమించింది. కమిషన్ 1955లో నివేదిక సమర్పించినప్పటికీ, చైర్మన్‌తో సహా ఒక సభ్యుడు నివేదిక అమలుకు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అప్పటి ప్రభుత్వం ఈ కమిషన్ సిఫారసులను అమలులోకి తేలేదు. తదనంతరం 25 సంవత్సరాల తరువాత మొరార్జీ దేశాయ్ ఆధ్వర్యంలోని జనతాపార్టీ ప్రభుత్వం 1979లో రెండవ జాతీయ బీసీ కమిషన్‌ను శ్రీ బిందేశ్వరి ప్రసాద్ మండల్ సారథ్యంలో వేశారు. ఆ కమిషన్ 1980లో అప్పటి రాష్ట్రపతి జ్ఞానిజైల్‌సింగ్‌కు నివేదికను సమర్పించింది. మండల్ కమిషన్ సిఫారసులు పదేళ్లు బుట్టదాఖలయ్యాయి. 1990లో వి.పి.సింగ్ కేంద్ర సర్వీసులలో 27శాతం ఓబీసీలకు అమలులోకి తెచ్చారు. మండల్–కమండల్ ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. కులం పేరిట, మతం పేరిట దేశమంతా రెండుగా చీలిపోయింది. ఎట్టకేలకు 1992లో గౌరవ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మేరకు 27శాతం రిజర్వేషన్‌లు అమలులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఇంద్రాసాహ్నీ కేసు దీనినే మండల్ కమిషన్ కేసు అంటారు. ఈ కేసులోనే రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు నిర్దిష్టమైన సూచనలను చేసింది. కేంద్రంలో, రాష్ట్రాలలో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్లను ఎప్పటికప్పుడు సమీక్షించడానికి, జాబితాలలో మార్పులు, చేర్పులకు, రిజర్వేషన్‌ల అమలులో జరిగే పొరపాట్లను సరిదిద్దడానికి జాతీయ, రాష్ట్ర స్థాయిలో శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందుకు అనుగుణంగా నాటి ప్రభుత్వాలు బీసీ కమిషన్ చట్టాలను అమలులోకి తెచ్చాయి. ఇందుకు సంబంధించిన కమిషన్‌ల విధి విధానాలు ప్రత్యేకంగా చట్టాలలోనే పేర్కొనబడ్డాయి. అలా బీసీ కమిషన్‌లు ప్రత్యేక విధులతో పనిచేయడం మొదలు పెట్టాయి.



అన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలతో 'డెడికేటెడ్ కమిషన్'లను నియమించుకుని ముందుకెళుతున్నాయి. ఇందుకు భిన్నంగా తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం ప్రస్తుత బీసీ కమిషన్‌నే 'డెడికేటెడ్ కమిషన్'గా నియామకం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విభేదించడమే అని న్యాయ నిపుణులు అంటున్నారు.

ఇదిలా ఉండగా రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం ప్రత్యేకంగా నిర్వహించాల్సిన పనుల నిమిత్తం కమిషన్ ఏర్పాటు చేసే సంప్రదాయం మాత్రం దేశంలో కొనసాగుతూ వస్తున్నది. తాజా ఉదాహరణగా ఓబీసీ జాబితా వర్గీకరణకు కేంద్రం జస్టిస్ రోహిణీ కమిషన్‌ను నియమించడం జరిగింది. పలు రాష్ట్రాలు కూడా ప్రత్యేక కమిషన్‌లను నియమిస్తూనే ఉన్నాయి.

ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టారీతిగా అమలు చేస్తుండడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. బీసీలకు స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్‌ల శాతం నిర్ణయించడానికి, 340 ఆర్టికల్ కింద ప్రత్యేక 'డెడికేటెడ్ కమిషన్'లను నియమించి, ఆ దిశగా ఆ కమిషన్‌లు సూచించే సిఫార్సుల మేరకు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టంగా డాక్టర్ కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావు గవాలి, సురేష్ మహాజన్, రాహుల్ రమేష్‌వాగ్, మన్‌మోహన్ నగర్, వైద్యపాండ్యా మున్నగు కీలకమైన తీర్పులలో రాజ్యాంగ ధర్మాసనాలు, ధర్మాసనాలు స్పష్టంగా సూచించాయి. ఈ నేపథ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల శాతాన్ని నిర్ణయించడానికి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిపుణులతో కూడిన 'డెడికేటెడ్ కమిషన్'లను నియమించుకొని, వాటి సిఫారసులతో సుప్రీం మార్గదర్శకాల మేరకు నడుచుకొని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకుంటున్నాయి. అందుకు ఉదాహరణగా మహారాష్ట్రలో జయంత్ కుమార్ భాటియా డెడికేటెడ్ కమిషన్, కర్ణాటకలో భక్తవత్సలం కమిషన్, మధ్యప్రదేశ్‌లో గౌరీశంకర్ బిసేన్ కమిషన్, గుజరాత్‌లో జవేరి కమిషన్, ఉత్తరప్రదేశ్‌లో లోకల్ బాడీస్ డెడికేటెడ్ కమిషన్... ఇలా అన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలతో 'డెడికేటెడ్ కమిషన్'లను నియమించుకుని ముందుకెళుతున్నాయి. ఇందుకు భిన్నంగా తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం ప్రస్తుత బీసీ కమిషన్‌నే 'డెడికేటెడ్ కమిషన్'గా నియామకం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విభేదించడమే అని న్యాయ నిపుణులు అంటున్నారు. పూర్తి స్థాయి సమయాన్ని కేటాయిస్తూ, గౌరవ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించడానికి డెడికేటెడ్ కమిషన్‌ను ప్రత్యేకంగా నిపుణులతో నియామకం చేయాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. అలాంటప్పుడు తెలంగాణ ప్రభుత్వం పాటించకపోవడానికి గల కారణాలు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇది సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లే అవుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు.

● **ఆర్. కృష్ణయ్య**
రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రాజీవ్ గాంధీకి, తెలంగాణ తల్లికి పోటీ ఎందుకు?





■ కె. శ్రీనివాస్

సందర్భం

రాహుల్ గాంధీ మీద శివసేన ఎమ్మెల్యే ఒకరు, బీజేపీ ఎంపీ ఒకరు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, బుధవారం నాడు ఢిల్లీలోనూ, హైదరాబాద్‌లోనూ జరిగిన ఆందోళనల తీరు చూస్తే, కాంగ్రెస్ శ్రేణులలో తిరిగి భావావేశాలు ప్రవేశించాయని అనిపించింది. రాహుల్ రాజకీయ పరిణతిని అభిమానించేవారే కాక, ఆయన వ్యక్తిత్వంతో అనుబంధాన్ని పెంచుకుంటున్నవారు కూడా పెరుగుతున్నారు. ఇది కాంగ్రెస్‌కు మంచిది. కొన్ని దశాబ్దాలుగా ఆ పార్టీ జనరంజక అధినేత లేని కొరతలో ఉంది, ఇందిర, రాజీవ్ ముఖచిత్రాల మీదనే ఇంకా ఆధారపడుతోంది.

గాంధీ కుటుంబం గురించి గాడిదలకేమి తెలుసును అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు కానీ, ఇక్కడ ఆయన ఉద్దేశం, గాంధీ కుటుంబం అంటే నెహ్రూ కుటుంబం. జాతీయోద్యమ నాయకుడిగా, సాహిత్య, కళా, మేధారంగాల అభిరుచి కలిగిన వాడిగా నెహ్రూ మీద దేశంలో గౌరవం, ఆరాధన ఉన్నాయి కానీ, ఆయనేమీ గాంధీ లాగా మాస్ లీడర్ కాదు. ప్రజానాయకురాలు అంటే, ఇందిరాగాంధీయే. ఇందిర మరణానంతరం ఉప్పొంగిన సానుభూతి వెల్లువలో రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. ఆయన తరువాత, దేశంలో కాంగ్రెస్ మెజారిటీ ప్రభుత్వం ఏర్పడనే లేదు. యూపీఏ ప్రభుత్వాలకు సాంకేతిక నాయకత్వం వహించిన మన్మోహన్ సింగ్ కూడా గౌరవం పొందినంతగా జనాభిమానం పొందినవారు కాదు, అందుకు తగ్గ అధికార స్వేచ్ఛా ఆయనకు లేకపోయింది. కాంగ్రెస్‌కు తిరుగులేని రోజుల్లోనే ఆ పార్టీలో జనాకర్షక నేతలు వచ్చారు.

ప్రజారంజకత అనేది రాజకీయాల్లో ఒక జటిలమైన లక్షణం. ప్రజలు విపరీతంగా ప్రేమించడం వల్ల అధికారం అమితంగా పొందవచ్చు. అదే సమయంలో, అందుకు ప్రతిఫలంగా ప్రజలకు ఏదో ఒకటి చేస్తూ కూడా ఉండాలి. అట్లా చేయకపోయినా, అపకారం చేసినా, ప్రజలు ఆ తిరుగులేని అభిమానాన్ని వెనక్కి తీసుకుంటారు. ప్రజలకు అప్రియమైన లేదా కఠినమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు, ప్రజల్లో పెద్దగా చెలామణీ లేని నాయకుడు ఉండడమే రాజ్యానికి మంచిది. తనను జనం ప్రేమిస్తున్నారు కదా అని, ఆ ధీమాతో వారినే అణచివేయాలని చూసే నాయకులకు ఏమంత సానుకూలమైన ఫలితాలు లభించవు. ఇందిరాగాంధీ తన నినాదాల ద్వారా, తనను తాను ప్రదర్శించుకున్న తీరు ద్వారా, ఆ కాలంలో తీసుకోగలిగిన కొన్ని నిర్ణయాల ద్వారా, ప్రజలకు బాగా దగ్గరగా వెళ్లారు. తమ దాకా చేరిన ప్రతిసంక్షేమం మీదా ఇందిరపేరే ప్రజలకు వినిపించేది. ఇందిర అన్నీ మంచే చేయాలనుకుంటారని, మధ్యలో ఇతరులు దానిని భంగపరుస్తున్నారని జనం అనుకునేవారు. ఎమర్జెన్సీ అకృత్యాలకుగాను ఆమెను ఘోరంగా ఓడించినప్పటికీ, ఆమెతో మానసిక అనుబంధం మాత్రం జనంలో మిగిలే ఉండింది.

రాజీవ్ గాంధీ అట్లా కాదు. మొదట అతను రాజకీయాల మీద అనాసక్తుడు. తమ్ముడి అకాలమరణం వల్ల దిగక తప్పలేదు. ఇందిర హత్య కారణంగా, అనివార్య వారసుడయ్యాడు. నాలుగువందల పైచిలుకు స్థానాల విజయం ఇందిర మరణం వల్ల కలిగిన సానుభూతితోనే తప్ప, ఆయన స్వార్జితం కాదు. అంతటి బలం పునాదితో ప్రధాని అయిన వ్యక్తి, తనను తాను తల్లిలాగా బలపరచుకోవాలని, స్థిరపరచుకోవాలని అనుకోవడంలో తప్పులేదు. కానీ, రాజకీయంగా అనుభవం లేని రాజీవ్‌కు తప్పుడు మార్గదర్శనం లభించింది. పంజాబ్ కల్లోలాన్ని పరిష్కరించలేకపోయారు. దేశంలో అటానమీ ఉద్యమాల సమస్యలను ఎదుర్కొనలేకుండానే, పక్క దేశంలో వేర్పాటు ఉద్యమాలలో కల్పించుకున్నారు. దక్షిణాసియాలో పెద్దరికం చేయాలనుకున్నారు. ఇన్ని పెద్ద పెద్ద ప్రయత్నాల మధ్య పార్టీలో ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదీ తెలుసుకోలేకపోయారు. పెళ్లివల్ల ఏర్పడిన ఇటలీ అనుబంధంలో అవినీతి ఉన్నదన్న ఆరోపణలు వచ్చాయి. అంత గొప్ప మెజారిటీతో గెలిచిన నాయకుడు తరువాతి ఎన్నికలలో అధికారం కోల్పోయాడు. శ్రీలంక గొలుసుకట్టు ప్రభావాలు మరో రెండేళ్లకు ఆయన ప్రాణాలనే బలితీసుకున్నాయి. ఇందిర, రాజీవ్ ఈ దేశ ప్రజారంగంలో ఉంటూ, తమ విధానాలకోసం ప్రాణత్యాగం చేసిన మాట వాస్తవమే, అదే సమయంలో ఆ ఇద్దరి దురదృష్టకర మరణాల వెనుక అనేక విధాన వైఫల్యాలున్నాయి.

ఘనవిజయాలను కూడా నిలుపుకోలేకపోయిన గత కాంగ్రెస్ నేతల కోవలోకి, తాను తొందరపాటుతో, ఆత్రుతతో జారిపోకుండా రేవంత్‌రెడ్డి జాగ్రత్తపడాలి. కానీ, ఆయన సలహాదారులెవరో కానీ, తెలంగాణ వాదంతో, సెంటిమెంట్‌తో తలపడడానికి, దానితో పోటీ పెట్టుకోవడానికి ఆయనను అనవసరంగా ప్రోత్సహిస్తున్నారు. కేసీఆర్‌ను, ఆయన పార్టీని ఎంతైనా విమర్శించవచ్చు, కానీ, తెలంగాణతనాన్ని వదులుకోగూడదు. ఒక విషయం గుర్తించాలి, ఈ రాష్ట్రం భౌగోళికంగా ఇట్లాగే ఉంటుంది, మరెప్పుడూ 2014కు ముందు రూపానికి వెళ్లదు. తెలంగాణ ఉద్యమం, దాని చిహ్నాలు, దాని నినాదాలు అన్నీ బీఆర్ఎస్ సొత్తూ కాదూ, కేసీఆర్ సొంత ఆస్తీకాదు. మొదట తెలంగాణ గీతం, చిహ్నం మొదలైన అంశాల మీద వివాదానికి ఆస్కారమిచ్చిన ముఖ్యమంత్రి, ఆ తరువాత తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తగవుకు చోటిచ్చారు. ఒకనాటి తెలుగుతల్లి కూడలి, రాష్ట్ర విభజన తరువాత, తెలంగాణ తల్లి కూడలిగా ఉండడమే న్యాయం కదా?

రాజీవ్ గాంధీ మరొక పార్శ్వం చూద్దాము. ఆయనకు ఇంకా జనం బ్రహ్మరథం పట్టక ముందే, ఇందిరాగాంధీ గొడుగు కింద పార్టీ పదవిలోను, ఎంపీగాను ఉన్న కాలంలోనే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అంజయ్యతో వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. అది ఎన్‌టి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీకి ఒక ముఖ్య ప్రచారాస్త్రం అయింది. భావావేశాలు ముడిపడి ఉన్న ఒక నాయకురాలి కుమారుడు, తమ మనోభావాలను దెబ్బతీయడం తెలుగుప్రజలు ఇష్టపడలేదు. ఎన్టీయార్‌ను గద్దె దించిన పరిణామాలలో ఇందిరతో పాటు రాజీవ్ గాంధీ కూడా ఉన్నారు. ఇందిర దారుణ హత్యకు తెలుగు ప్రజలు గుండెలు పగిలి ఏడ్చారు కానీ, అనంతర ఎన్నికలలో కాంగ్రెస్‌కు, రాజీవ్ గాంధీకి ఓటు మాత్రం వేయలేదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ అనంతర ఎన్నికలు కావడం వల్ల, సానుభూతి ప్రభంజనం తెలుగు రాష్ట్రంలో వీచనే లేదు. 1989 లోక్‌సభ ఎన్నికలలో దేశమంతటా ఓడిపోయిన కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో ఘనవిజయం (42లో 39) సాధించడానికి కారణం రాజీవ్ గాంధీ జనాకర్షణ శక్తి మాత్రం కాదు, తెలుగుదేశం పాలనపై ఏర్పడిన విరక్తి, చెన్నారెడ్డి రూపంలో కాంగ్రెస్‌కు దొరికిన సమర్థమైన రాష్ట్ర నాయకత్వం. 1991లో సాధారణ ఎన్నికలు రాష్ట్రంలో రెండు దశలలో జరిగాయి. రాజీవ్ హత్యకు ముందు ఒకటి, ఆ తరువాత ఒకటి. సానుభూతి ప్రభావం ఉన్నది కానీ, ఆంధ్రప్రదేశ్‌లో దాని శక్తి మునుపటి ఎన్నికల స్థాయిని అందుకోలేకపోయింది. (1991లో గెలుచుకున్నది 42లో 25 మాత్రమే). రెండు సంవత్సరాల కాలంలోనే తెలుగుదేశం పార్టీ బాగా పుంజుకోగలిగింది (1989లో 2 స్థానాల నుంచి, 1991లో 11 స్థానాలకు). తెలంగాణ వరకే చూసుకున్నా, నాటి 15న్నర స్థానాలను మొత్తంగా 1989లో గెలుచుకోగా, 1991లో పది మాత్రమే నిలుపుకుంది. కోస్తాంధ్ర, రాయలసీమల కంటె మెరుగే. మొత్తం మీద రాజీవ్ గాంధీ తెలుగు రాష్ట్రం మీద వేసిన ప్రభావమూ తక్కువే, తెలుగు సమాజంతో ఆయనకు గాఢమైన అనుబంధం ఏర్పడడానికి కలిగిన అవకాశమూ తక్కువే.

గత మూడు నాలుగు దశాబ్దాలలో కాంగ్రెస్ తరఫున ప్రధానులుగా చేసినవారిలో జనరంజకులు ఎవరూ లేకపోయినా, రాష్ట్రాలలో కొందరు జనప్రియ నాయకులయ్యారు. అందులో ఒకరు రాజశేఖరరెడ్డి. తన హయాంలో నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ పేర్లతో రాష్ట్రాన్నంతా నింపినప్పటికీ, తనకంటూ ఒక ప్రత్యేక ప్రతిష్ఠను, జనసంబంధాన్ని ఏర్పరచుకున్నారు. రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీ నాయకులకు మాత్రమే సాధ్యమయ్యే జనాకర్షణ ఆయనది. అట్లాగే, కర్ణాటకలో సిద్దరామయ్య సొంత ప్రతిష్ఠ కాంగ్రెస్ విజయానికి పనికివచ్చింది. రేవంత్‌రెడ్డి కూడా ఆ జనాకర్షక నాయకుల కోవలోకి చేరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన తన సొంత ఇమేజిని ప్రచారంలో పెట్టారు. రేవంత్‌కు ఏర్పడిన ప్రాచుర్యం వల్ల ముఖ్యమంత్రి ఎంపికలో అధిష్ఠానానికి వేరే దారే లేకుండా పోయింది. పాలనలో కూడా పార్టీలోని వివిధ బృందాలతో ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మరో వైపు అధిష్ఠానాన్ని కూడా మంచిచేసుకుంటున్నారు. బహుశా, రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు కూడా ఆ 'మంచి' ప్రయత్నాలలో ఒకటి కావచ్చు! ఆ ప్రయత్నం హుందాగా జరిగితే రాజీవ్ స్మృతికి కూడా మరింత గౌరవం దక్కేది!

నిజానికి, రేవంత్‌రెడ్డి జనరంజక ప్రతిష్ఠ ఇంకా కౌమారదశలోనే ఉంది. ఘనవిజయాలను కూడా నిలుపుకోలేకపోయిన గత కాంగ్రెస్ నేతల కోవలోకి, తాను తొందరపాటుతో, ఆత్రుతతో జారిపోకుండా ఆయన జాగ్రత్తపడాలి. కానీ, ఆయన సలహాదారులెవరో కానీ, తెలంగాణ వాదంతో, సెంటిమెంట్‌తో తలపడడానికి, దానితో పోటీ పెట్టుకోవడానికి ఆయనను అనవసరంగా ప్రోత్సహిస్తున్నారు. కేసీఆర్‌ను, ఆయన పార్టీని ఎంతైనా విమర్శించవచ్చు, కానీ, తెలంగాణతనాన్ని వదులుకోగూడదు. ఒక విషయం గుర్తించాలి, ఈ రాష్ట్రం భౌగోళికంగా ఇట్లాగే ఉంటుంది, మరెప్పుడూ 2014కు ముందు రూపానికి వెళ్లదు. తెలంగాణ ఉద్యమం, దాని చిహ్నాలు, దాని నినాదాలు అన్నీ బీఆర్ఎస్ సొత్తూ కాదూ, కేసీఆర్ సొంత ఆస్తీకాదు. మొదట తెలంగాణ గీతం, చిహ్నం మొదలైన అంశాల మీద వివాదానికి ఆస్కారమిచ్చిన ముఖ్యమంత్రి, ఆ తరువాత తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తగవుకు చోటిచ్చారు. ఇవన్నీ భావోద్వేగాలకు, మనోభావాలకు సంబంధించిన సున్నితమైన విషయాలు! తెలంగాణ తల్లితో ముడిపడిన భావావేశాలకు, ఎంత గొప్ప జాతీయనేత అయినప్పటికీ రాజీవ్ గాంధీ పోటీకాగలరా? రాజీవ్ గాంధీని ఆకాశమెత్తున గౌరవించుకోవడానికి మహానగరంలో మరెన్ని చోట్లు లేవు? సచివాలయం ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం పెట్టాలనుకోవడం కొంత గౌరవమే, ఇన్నేళ్లుగా తెలంగాణ తల్లిని కేసీఆర్ తన పార్టీ ఆఫీసుకే పరిమితం చేయడం నేరమే. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కలిగిస్తున్న కొరత పెద్దది కదా? ఒకనాటి తెలుగుతల్లి కూడలి, రాష్ట్ర విభజన తరువాత, తెలంగాణ తల్లి కూడలిగా ఉండడమే న్యాయం కదా?

తెలుగు రాష్ట్రాలలో, మొత్తంమీద దక్షిణాదిన ప్రాంతీయత కలిగించే మానసికానుబంధం, జాతీయస్థాయి రాజకీయం వల్ల ఎంతమాత్రం ఏర్పడదు. తెలంగాణలో సోనియాగాంధీకి లభించే గొప్ప గుర్తింపు కూడా, రాష్ట్రావతరణను సాధ్యం చేసిన నేతగానే! రాజీవ్ గాంధీకి లభించే స్మరణ కూడా తెలంగాణ "ఇచ్చిన" సోనియా భర్తగానే!

పార్టీ పేరు నుంచి కూడా తెలంగాణను తొలగించిన బీఆర్ఎస్, ఇప్పుడు మనుగడ కోసం, తీవ్రమైన ప్రాంతీయ భాష మాట్లాడవలసి వస్తున్నది. ప్రజల మానసిక సున్నితత్వాలను దృష్టిలో పెట్టుకోకుండా, మొరటుగా వ్యవహరిస్తే, చేజేతులా ఆయుధాన్ని ప్రత్యర్థికి అందించినట్టే అవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ తెలుసుకోవాలి. రాహుల్ గాంధీ చుట్టూ ఆరోగ్యకరమైన, కొత్త భావోద్వేగాలు రూపొందాలని కోరుకుందాం. కానీ, ఒక చారిత్రక వాస్తవికతను కూడా గుర్తించాలి. తెలుగు రాష్ట్రాలలో, మొత్తంమీద దక్షిణాదిన ప్రాంతీయత కలిగించే మానసికానుబంధం, జాతీయస్థాయి రాజకీయం వల్ల ఎంతమాత్రం ఏర్పడదు. తెలంగాణలో సోనియాగాంధీకి లభించే గొప్ప గుర్తింపు కూడా, రాష్ట్రావతరణను సాధ్యం చేసిన నేతగానే! రాజీవ్ గాంధీకి లభించే స్మరణ కూడా తెలంగాణ "ఇచ్చిన" సోనియా భర్తగానే!

వరద ముంపు నుంచి కాపాడాలి

పెద్దపల్లి జిల్లా మంథని-కాటారం మండలాల్లో గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రతి సంవత్సరం భారీ వర్షాలు వచ్చినప్పుడు పరివాహక ప్రాంతం వరద ముంపునకు గురవుతోంది. గత ప్రభుత్వం నిర్మించిన అన్నారం-సుందిళ్ల బ్యారేజీల వల్లనే ఇక్కడ గోదావరి వరద ఎక్కువై పంట పొలాలు, ఇళ్లు నీట మునిగిపోతున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలి. కరకట్టలు నిర్మించి, వరద తాకిడి లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ముంపు విషయమై ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా కాని ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. ఇప్పటికయినా రాష్ట్ర ప్రభుత్వం కరకట్టలను నిర్మించి వరద ముంపునకు గురికాకుండా మంథని-కాటారం ప్రాంతాల గ్రామాల రైతులను కాపాడాలి.

– తోట భాస్కర్, మంథని

డాక్టరేట్ ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వాలి

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే డాక్టరేట్ పట్టా పొందిన ఉద్యోగులను అదనపు విద్యార్హత ఉన్న వారిగా గుర్తించాలి. వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి. రిజిస్టర్‌లో పేరు, సీనియారిటీతో పాటు డాక్టరేట్ అని కూడా రాయాలి. ఆయా కార్యాలయాల్లో వారిని శాఖాపరమైన పరిజ్ఞానం ఉన్న వారిగా గుర్తించాలి.

– రాపాక రవీందర్, జనగాం

ఆర్థిక సంఘం చేయగలిగేవీ, చేయలేనివీ!

దేశ రాబడిని కేంద్రానికి రాష్ట్రాలకూ మధ్య, రాష్ట్రాల మధ్య కేటాయింపులు నిర్ణయించడం, ప్రత్యేక అవసరాల రీత్యా రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో సహాయం అందించడం... ఇవన్నీ ప్రతి ఆర్థిక సంఘం ముందు ఉండే రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ఈ పంచుకోవాల్సిన మొత్తం రాబడిని, అంటే ప్రత్యక్ష – పరోక్ష పన్నులను కలిపి 'భారత ఏకీకృత నిధి' అని అంటారు. ఇది దేశంలో రాష్ట్రాల సమాఖ్య నిర్మాణానికి అత్యంత మూలమైనది. అంతేగాక, రాష్ట్రాలు కూడా తమ స్థానిక సంస్థలైన మునిసిపాలిటీలు, గ్రామ పంచాయితీలకు ఇవ్వాల్సిన వాటా కూడా గత ఆర్థిక సంఘాలు నిర్ణయించాయి. 2026 నుండి 2031 దాకా, కొత్తగా ఏర్పాటైన 16వ ఆర్థిక సంఘం మారుతున్న రాష్ట్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంచుకోబోయే నిష్పత్తులను, ప్రాతిపదికలనూ కొత్తగా సవరించే పని చేయాలి.


గతంలో, అంటే 2004 కంటే ముందు, కేంద్రం విధించే కార్పొరేట్ పన్నులు, ఆదాయ పన్నులు, సెంట్రల్ ఎక్సయిజ్, కేంద్రం తెచ్చే అప్పులు కాక రాష్ట్రాలు విధించే సేల్స్ టాక్సులు కలిపి పంచుకోవాల్సిన ఏకీకృత నిధిగా ఉండేది. ఎక్సయిజ్ ఆదాయాలు మాత్రం రాష్ట్రాలకు విడిగా ఉండేవి. రాష్ట్రాలకు అదనంగా ఆక్ట్రాయ్ టాక్స్, ఎంటర్టయిన్మెంట్ టాక్స్ కూడా ఉండేవి. ఇక దేశంలో ఉన్న ఏకీకృత నిధిలో, 13వ ఆర్థిక సంఘం వరకు రాష్ట్రాల వాటా 31శాతం గాను, కేంద్రం వాటా 69శాతం గాను ఉంది. కేంద్రం తన అవసరాలను తీర్చుకుని, మిగతా డబ్బును రాష్ట్రాలకు వాటి ప్రత్యేక అవసరాలకు గ్రాంట్ల రూపంలో ప్రణాళిక సంఘం సిఫార్సు మేరకు పంచడం జరిగేది.

14వ ఆర్థిక సంఘం (2015–20) రాష్ట్రాల వాటా 31 శాతం నుంచి 42 శాతం పెంచింది. అయితే, మోదీ ప్రభుత్వం తను కోల్పోయే వాటాను భర్తీ చేసుకోవడానికి రాష్ట్రాలతో పంచుకోలేని సెస్సులు, సర్‌చార్జీలను 10శాతం అదనంగా పెంచుకుని, రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లను కుదించి, మొత్తం నిధులలో రాష్ట్రాల వాటా మళ్ళీ 31 శాతానికి పడేలా చేసారు. ఇది అన్ని రాష్ట్రాలు నిరసించే మొదటి అంశం. మరో పక్క, కేంద్రం విద్యవైద్యం కోసం వసులు చేసే సెస్సులు వాటి కోసమే ఖర్చుపెట్టకుండా, వేరే ఖర్చులకు మళ్లిస్తోందని కాగ్ 2023 నివేదిక చెప్పింది. కాబట్టి సెస్సులు సర్‌చార్జిలు దీర్ఘకాలంలో వెయ్యడం సరికాదు అన్నది మరో అంశం. ఇలాటి సందర్భాల్లో రాష్ట్రాలు 50 శాతం వాటా కావాలి అని అడిగితే, కేంద్రం దరిమిలా తాను కోల్పోయే ఆదాయాన్ని అదనపు సెస్సుల ద్వారా ఇంకా పెంచి రాష్ట్రాల వాటాను అక్కడికే నిలువరించే ప్రమాదం లేకపోలేదు. ప్రజల మీద పన్నుల భారం ఇంకా పెరుగుతుంది. ఏతావాతా, సెస్సులను నియంత్రించే అధికారం ఆర్థిక సంఘానికి లేని సందర్భంలో, రాష్ట్రాలు 50శాతం వాటా అడగడం వృథా అనే వాదన ఉంది.

తరువాత ముఖ్యమైన మూడవ అంశం ఏమిటంటే, రాష్ట్రాల మధ్య పంచే ప్రాతిపదిక మార్చడం వల్ల రాష్ట్రాల వాటా 41 శాతానికి పెరిగినా, అందులో దక్షిణాది రాష్ట్రాల వాటా 2000 నుండి 2023 కల్లా 21శాతం నుండి 15శాతానికి పడిపోయింది. ఆర్థిక సంస్కరణలు అమలుపరిచిన నాటి నుండి, దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక వృద్ధి పుంజుకుంది. దానికి కారణం రాష్ట్రాల పెట్టుబడి పెరగడం అని గమనించాలి. కానీ రాబడి పెరగలేదు. కారణం, గతంలో 1971 సెన్సస్‌ని, 2011 సెన్సస్‌కి మార్చడం వల్ల, జనాభా తగ్గించుకున్న దక్షిణాది రాష్ట్రాల వాటాకి గండి పడింది. అధిక అభివృద్ధి సాధించి, పన్నుల రాబడిని పెంచినా, దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలకు సమర్పించుకోవడం తప్పడం లేదు. యూపీ, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, బెంగాల్, జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలకు వెనుకబాటుతనం, అధిక జనాభా వల్ల వాటా పెరుగుతోంది. ఈ వెనుకబడ్డ రాష్ట్రాలు తమ ఆదాయాలను ఖర్చుపెట్టుకునే సామర్థ్యం కూడా పెంచుకోకుండా రెవెన్యూ మిగులును చూపిస్తున్నాయి. రాష్ట్రాలు ఖర్చుపెడితే తప్ప వాటి ఆదాయం పెరిగే అవకాశం లేదు. కానీ ఎఫ్‌ఆర్‌బిఎమ్ చట్టం అమలు చేసే పరిమితి వల్ల, అవి అప్పులు చెయ్యట్లేదు. దక్షిణాది రాష్ట్రాలు విరివిగా ప్రభుత్వ ఖర్చులను పెంచుకుని, వాటి ఆదాయాలను పెంచుకుని, దరిమిలా ఆ వృద్ధి రేటును కొనసాగించుకోవడానికి అప్పులను పెంచుకుంటున్నాయి. వాటిమీద వడ్డీలు కడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల మధ్య ఆర్థిక వ్యత్యాసం అంతకంతకు పెరిగిపోయి, ఉత్తరాది రాష్ట్రాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయం రావట్లేదు అనే ఘర్షణకు దారితీస్తోంది.

ఉత్తరాది రాష్ట్రాలు కూడా జనాభా నియంత్రణకు తగు విధానాలు అమలు చేస్తున్నట్టు కనిపించని ఈ కాలంలో, ఎంతకాలం దక్షిణాది ఉత్తరాది భారాన్ని మోయాలన్నది ఒక ప్రశ్న. జనాభా నియంత్రించుకున్న పాపానికి తాము వాటా ఎందుకు కోల్పోవాలి అన్నది మరో ప్రశ్న. ఇచ్చే సహాయంతో కూడా ఈ రాష్ట్రాల్లో ఆర్థికవృద్ధి కూడా జరగట్లేదు. మరొక పక్క ఈ సహాయం అందకపోతే ఆ రాష్ట్రాలలో ఇంకా దరిద్రం పెరిగిపోయి ఇంకో రకపు సంక్షోభానికి దారితీయవచ్చు. కాబట్టి, సమాంతర సమానత్వం విషయంలో ప్రాతిపదికనే మార్చడంలో ఈ 16వ ఆర్థిక సంఘం చేయగలిగేది ఏమీ లేదు. అంతే కాక, రాష్ట్రాల వాటా 50శాతానికి పెంచినా, దక్షిణాది రాష్ట్రాలకు పెద్దగా ఒరిగేదీ లేదు.

కాంగ్రెసు ప్రభుత్వం తలపెట్టిన కొత్త ఆరు పథకాలు అమలు చేయాలన్నా, ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు నింపాలన్నా, గత ప్రభుత్వం చేసిన దుబారా ఖర్చులను తగ్గించినా కూడా, వచ్చే ఆదాయం సరిపోయే అవకాశం లేదు. మరొక 50 వేల కోట్లు కావాలి. ఇంక అప్పు చేయడమే మార్గం. ఫలితంగా, కిస్తీల భారం పెరగడం కూడా ఖాయం. ఈ సమస్యని పరిష్కరించడంలో 16వ ఆర్థిక సంఘం కొన్ని గ్రాంట్లను పెంచడం ద్వారా 5 నుండి 10 వేల కోట్ల సహాయం మినహా తెలంగాణాకి చేయగలిగింది ఏమీ లేదు.



తెలంగాణ రాష్ట్రానికి వస్తే, తెలంగాణ ప్రత్యేకంగా ఆర్థిక సంఘాన్ని అడిగి లాభం లేదు, అది అన్ని రాష్ట్రాలతో పాటు ఉమ్మడిగా మాత్రమే అడగడం సాధ్యం. గత కేసీఆర్ ప్రభుత్వం, రెవెన్యూ మిగులుతో ప్రారంభం అయి, ఒక కొత్త అభివృద్ధి బాటలో మూలధన వ్యయాన్ని పెంచి విద్యుత్, నీటిపారుదల రంగాలను ప్రోత్సహించి, రెవిన్యూ ఖర్చులనూ వివిధ సంక్షేమ పథకాల కోసం పెంచుకుని, రాష్ట్ర వృద్ధి రేటును 9శాతం పైకి తీసుకువెళ్ళింది. దరిమిలా, స్వంత ఆదాయం సుమారుగా లక్ష కోట్లకు పెరిగింది. కానీ సరిపోక, సాలీనా అప్పుని లక్ష కోట్లకు తీసుకెళ్లి, మొత్తం అప్పును 6.7 లక్షల కోట్లకు పెంచారు. దీనివల్ల కొత్త కాంగ్రెస్ ప్రభుత్వానికి సాలీనా వడ్డీతో సహా చెల్లించాల్సిన కిస్తీ ఆదాయంలో 31శాతానికి చేరింది. ఇది వచ్చే ఇరవై ఏళ్లలో ఇంకా పెరిగే అవకాశం ఉంది. మరి కాంగ్రెసు ప్రభుత్వం తలపెట్టిన కొత్త ఆరు పథకాలు అమలు చేయాలన్నా, ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు నింపాలన్నా, గత ప్రభుత్వం చేసిన దుబారా ఖర్చులను తగ్గించినా కూడా, వచ్చే ఆదాయం సరిపోయే అవకాశం లేదు. మరొక 50 వేల కోట్లు కావాలి. ఇంక అప్పు చేయడమే మార్గం. ఫలితంగా, కిస్తీల భారం పెరగడం కూడా ఖాయం. ఈ సమస్యని పరిష్కరించడంలో 16వ ఆర్థిక సంఘం కొన్ని గ్రాంట్లను పెంచడం ద్వారా 5 నుండి 10 వేల కోట్ల సహాయం మినహా తెలంగాణాకి చేయగలిగింది ఏమీ లేదు.

తెలంగాణ ప్రభుత్వం, మిగతా దక్షిణాది రాష్ట్రాలతో కలిసి, జీఎస్టీ కౌన్సిల్లో ఒక ప్రత్యామ్నాయ ప్రతిపాదన చేయవచ్చు. ఇప్పుడు రాష్ట్రాలలో వచ్చే జీఎస్టీని కేంద్రంతో పంచుకునే 50:50 నిష్పత్తిని మార్చి, కేంద్రానికి 40శాతం, రాష్ట్రాలకు 60శాతం పంచమని అడగవచ్చు. ఇది తమ దగ్గర వచ్చే ఆదాయంలో తమ వాటాని నికరంగా పెంచుతుంది. ఈ నిష్పత్తితో పంచుకునే మొత్తంలో రాష్ట్రాలకి స్థిరమైన పన్ను రాబడి సాధ్యం అవుతుంది. కేంద్రం కోల్పోయిన రాబడిని పొందాలంటే కార్పొరేట్ టాక్సునో, ఆస్తి పన్నునో, సెస్సులనో పెంచుకోవచ్చు.

చివరిగా, రాష్ట్రాలకు కానీ, కేంద్రానికి కానీ అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వ వ్యయాలు పెంచుకోక తప్పదు. ఇది, తన ఆదాయ మార్గాలను పెంచుకుంటే తప్ప సాధ్యం అయ్యే విషయం కాదు. కేంద్రం 2020–21లో కార్పొరేట్ పన్నులలో రాయితీలు ఇచ్చి ఆ ఏడాదిలోనే రూ.8 లక్షల కోట్ల ఆదాయం కోల్పోయింది. పెట్టుబడిదారులు పెరిగిన ఆదాయాన్ని పెట్టుబడులకు మళ్లించలేదు. దీనివల్లే అభివృద్ధి కుంటుపడింది. భారతదేశం ఆదాయంలో పన్నుల శాతం 17.45శాతం మాత్రమే ఉంది. ఇది కనీసం 25శాతానికి పెంచాలి. అప్పుడే విద్య, వైద్యం, రోడ్లు వగైరాలను అందించగలదు. అది జీఎస్టీ పెంపుదల వల్ల కాక, ఆస్తి పన్ను, వారసత్వ ఆస్తి పన్ను, కార్పొరేట్ టాక్సులని పెంచి, ధనవంతులకు ఇచ్చే రాయితీలను తగ్గించుకుని పంచుకునే మొత్తాన్ని పెంచుకుంటే రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం రావచ్చు.

▪ **ఆర్.వి. రమణమూర్తి**
▪ **వెన్న విజయ్ కుమార్**
(హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం)



టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

విధి నిర్వహణలో జవాబుదారీతనం అవసరం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 18: విధి నిర్వహణలో సిబ్బందికి జవాబుదారితనం అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నాలాలు, చెరువులు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లతో పాటు బల్దియా పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలన్నారు. 66 డివిజన్‌లలో ఉన్న పక్కా గృహాలు, బీపీఎల్ కింద నిర్మించిన ఇళ్ల వివరాలు అధికారుల వద్ద ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తనకు సమర్పించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులలో పురోగతి సాధించాలన్నారు. వారికి నిర్ధేశించిన ఫీజు చెల్లించే విధంగా చొరవ చూపాలన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రకటన బోర్డుల రెన్యువల్ నోటీసులు వెంటనే జారీ చేయాలన్నారు. సిబ్బందిని మానిటరింగ్ చేయాలని అదనపు కమిషనర్‌కు సూచించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై గ్రీవెన్స్‌లో చాలా సమస్యలు పునరావృత్తం అవుతున్నాయని, బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, హర్షద్, టీపీఎస్‌లు అనిల్, రజిత, రోజారెడ్డి, శ్రీకాంత్, టీపీబీవోలు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీని చంపిన గాడ్సే వారసులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. త్యాగాల కుటుంబానికి చెందిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎన్‌డీఏ నేతలు ఉగ్రవాదుల్లా అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ మేరకు హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నిరసన, ధర్నాలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా వైఖరేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఇప్పటి వరకు కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అంటే.. ఈ వ్యాఖ్యలను వారు సమర్థిస్తున్నట్లేనా..? అని అన్నారు. రాహుల్‌గాంధీ త్యాగాల కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయనను కాపాడుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌డీఏ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- హనుమకొండ సిటీ



హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన సభలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న మంత్రి పొన్నం, ఎంపీ, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు

- రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్‌డీఏ నేతల వ్యాఖ్యలు
- వారిపై మోదీ, అమిత్‌షా కేసులు పెట్టాలి
- రాహుల్ కుటుంబానిది త్యాగాల చరిత్ర
- ఆ కుటుంబ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర
- రాహుల్ దేశ భవిష్యత్తు.. ఆయనను కాపాడుకుంటాం..
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్
- హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం

వివరాలు 7లో..

ముఖ్యమంత్రిని నమ్మితే నట్టేట ముంచుతాడు



- కోర్టు ఆదేశించినా ఫిరాయింపులపై స్పీకర్ చర్యలెందుకు తీసుకోవడం లేదు?
- నిజాయితీ పరుడినని చెప్పుకొనే కడియం కాంగ్రెస్‌లో ఎందుకు చేరారు?
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు వ్యాఖ్యలు
- స్థలం కేటాయిస్తే ఆరు నెలల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడి

మిల్స్‌కాలనీ(వరంగల్), సెప్టెంబరు 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నమ్మితే నట్టేట ముంచుతాడని, ఆయనవన్నీ మోసపూరిత మాటలేనని బీజేపీ నేత, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు విమర్శించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం వరంగల్ వచ్చిన ఆయన మట్టెవాడలోని ఎస్ఎస్‌కే సేవా సమాజ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని, సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డే కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుని.. ఆ తర్వాత అవి పార్టీ కండువాలు కాదు దేవుడి కండువాలని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కోర్టు ఆదేశించినా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రవ్వంతరెడ్డి, 'ట్విట్టర్ టిల్లు' కేటీఆర్‌లు రాష్ట్రానికి ప్రమాదమన్న ఆయన.. వారిద్దరు సాయంత్రం మాట్లాడుకుంటున్నారని ఆరోపించారు. లేదంటే జన్వాడ ఫాంహౌస్ ఎందుకు కూలడం లేదో సమాధానం చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో కారు స్టీరింగ్ పట్టుకున్న ఒవైసీ ఇప్పుడు కాంగ్రెస్‌కు చేయూతనిస్తున్నారని, అందుకే సల్కం చెరువులోని కట్టడాలు కూలడం లేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందన్నారు. ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేయడమేంటని ఇప్పుడు బీఆర్ఎస్ వాళ్లు తెగ బాధపడుతున్నారని, కానీ వారి హయాంలో బండి సంజయ్‌పై ఈ జిల్లాలోనే జరిగిన దాడి, అలాగే అర్వింద్‌పై జరిగిన దాడులు వారికప్పుడు కనబడలేదా అని ప్రశ్నించారు. తానే నిజాయితీ పరుడనని చెప్పుకునే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎందుకు మారారన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టులతో సహా అందరిని మోసం చేశారన్నారు. రాష్ట్రంలో బీజేపీ విస్తరిస్తోందని, వికసిత భారత్‌ను ఆవిష్కరించే దిశగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన స్థలాన్ని అందజేస్తే ఆరు నెలల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభం చేయిస్తామన్నారు. అంతకుముందు భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న రఘునందన్‌రావు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ వన్నాల శ్రీరాములు, పొట్టి శ్రీనివాస్‌గుప్త, మార్టిన్ లూథర్, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సుందర్‌రాజ్ గుడ్ బై?



- కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరే అవకాశం
- ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి పార్టీకి దూరం
- పట్టించుకోని బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు

వివరాలు 6లో..

మహా వరంగల్!

నగర విస్తరణ దిశగా యంత్రాంగం అడుగులు



కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. 'కుడా' శివారులోని కొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేసి నగర పరిధిని పెంచాలని సంకల్పించింది. ఈ మేరకు కుడా పరిధిలో ఏఏ గ్రామాలను కొత్తగా తీసుకురావాలనే విషయంలో ఆస్కి (అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సహాయంతో 150 గ్రామాలతో ఒక జాబితాను రూపొందించింది. ప్రస్తుతం కుడా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు ఉండి ఇప్పటికీ కుడా పరిధిలోకిరాని గ్రామాలను ప్రధానంగా ఎంపిక చేశారు. ఈ మేరకు హుస్నాబాద్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, జనగామ ఎమ్మెల్యేలకు 'కుడా' విస్తరణపై సమాచారం కూడా ఇచ్చారు. విలీనంపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది. 'కుడా'లో విలీనానికి అనుకూలంగా కొన్ని తీర్మానాలు చేసి పంపించాలని గ్రామ పంచాయతీలకు కలెక్టర్ల కార్యాలయాల నుంచి సర్క్యులర్లు జారీ అయ్యాయి.

హనుమకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర జనాభా క్రమంగా పెరుగుతోంది. ఆ మేరకు నగరం కూడా విస్తరిస్తోంది. నగర శివారు గ్రామాలు సైతం పట్టణీకరణ ప్రభావానికి లోనవుతున్నాయి. నగర శివార్లలో ఇప్పుడు ఎక్కడచూసినా రియల్ వెంచర్లు, అపార్టుమెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, కాలనీలు వెలుస్తున్నాయి. ఇది సంతోషించదగిన పరిణామమే.. అయినా అది ప్రణాళికాబద్ధంగా జరగకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో మౌలిక సదుపాయాలు కనుమరుగై పౌరజీవనం అస్తవ్యస్తమవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరాన్ని మహా హైదరాబాద్‌గా విస్తరిస్తున్నట్టే.. వరంగల్ నగరాన్ని కూడా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'కుడా' పరిధిలోకి నగర శివార్లలో ఉన్న మరో 150 గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు జరుగుతోంది.

ప్రజాభిప్రాయ సేకరణ

విలీనంపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది. 'కుడా'లో విలీనానికి అనుకూలంగా కొన్ని తీర్మానాలు చేసి పంపించాలని గ్రామ పంచాయతీలకు కలెక్టర్ల కార్యాలయాల నుంచి సర్క్యులర్లు జారీ అయ్యాయి. హుస్నాబాద్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, జనగామ ఎమ్మెల్యేలకు 'కుడా' విస్తరణపై సమాచారం కూడా ఇచ్చారు. అయితే కొన్ని గ్రామాల్లో ప్రజలు విలీనం పట్ల సానుకూలత వ్యక్తం చేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గ్రామ సభల్లో విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఏకంగా తీర్మానాలు కూడా చేస్తున్నారు. అయితే మెజారిటీ గ్రామాల ప్రజలు మాత్రం 'కుడా'లో కలవడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకతకు కారణం విలీనం పట్ల అపోహలు ఉండడమే. 'కుడా'లో తమ గ్రామం విలీనమైతే ఇంటి పన్నులు పెరుగుతాయని, అభివృద్ధి పనులపేరుతో తమ భూములను స్వాధీనం చేసుకుంటారని, భూముల ధరలు పెరిగి సామాన్యులు ఇళ్ల స్థలాలు కొని ఇల్లు కట్టుకునే పరిస్థితి ఉండదన్న అభిప్రాయం పల్లెవాసుల్లో నెలకొని ఉంది. దీంతో తాము 'కుడా'లో ససేమిరా చేరమని మొండికేస్తున్నారు.

అపోహ మాత్రమే..

'కుడా'లో విలీనమైనంత మాత్రాన ఎలాంటి ఇబ్బందులు ఉండవని 'కుడా' అధికారులు అంటున్నారు. ఇదంతా అపోహ మాత్రమేనని కొట్టిపారేస్తున్నారు. ఇంటి పన్నుల పెంపువంటివేమీ ఉండవని చెబుతున్నారు. 'కుడా' పరిధిలోకి ఇప్పటికే వచ్చిన గ్రామాల్లో చోటు చేసుకున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన చూస్తే తెలుస్తుందంటున్నారు. 'కుడా' పరిధిలోని విలీన గ్రామాల్లో కోట్లాది రూపాయలు వ్యయం చేసి రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, పార్కుల ఏర్పాటువంటి పనులు చేపట్టిందని గుర్తు చేస్తున్నారు. 'కుడా' పరిధిలోని నియోజకవర్గాల్లో రూ.200కోట్లతో వివిధ పనులు చేపట్టింది. 'కుడా'లో గ్రామాల విలీనం వల్ల భారీ ప్రాజెక్టుల అమలు చేపట్టినప్పుడు ఎలాంటి అడ్డంకులు ఉండవని చెబుతున్నారు. ఈ గ్రామాల్లో 'కుడా' స్పష్టమైన ప్రణాళికను రూపొందించి ఉండడం వల్ల అన్ని అనుమతులు సులభంగా లభిస్తాయని అంటున్నారు.

- 'కుడా' పరిధిలో చేరనున్న మరికొన్ని గ్రామాలు
- మరో 150 గ్రామాల విలీనానికి కసరత్తు
- కొనసాగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ
- కొన్ని చోట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకత
- అభివృద్ధి కోసం కలిసి రావాలని అధికారుల సూచన
- ప్రయోజనాలను వివరించేందుకు త్వరలో ప్రచారం

కుడా అభివృద్ధి పనులు

'కుడా' పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే విలీన గ్రామాల్లో 2014 నుంచి 2024 వరకు పదేళ్ల కాలంలో రూ.280కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. 2024-25 సంవత్సరానికిగాను రూ.483.05 కోట్ల అంచనా వ్యయంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.30కోట్ల వ్యయంతో భద్రకాళి మాడవీధులు, రూ.74.50 కోట్ల వ్యయంతో వరంగల్ బస్‌స్టాండ్, రూ.250కోట్ల వ్యయంతో ఆర్‌టీవో ఆఫీసు సర్కిల్ నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు ఇన్నర్ రోడ్డు రూ.30కోట్లతో ఉనికిచెర్లలో 135ఎకరాల్లో మోడల్ లేఅవుట్ అభివృద్ధి, రూ.30కోట్లతో కాళోజీ కళాక్షేత్రం, రూ.14కోట్లతో పశ్చిమ నియోజకవర్గంలో ఏడు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణం కుడా పూర్తి చేసింది. ఈ అభివృద్ధి పనుల్లో ఎక్కువ భాగంగా ఎక్కువగా విలీన గ్రామాల్లోనే జరిగాయి. గరిష్ఠంగా కుడా తన పరిధిలోని ఒక్కో నియోజకవర్గంలో సుమారు రూ.50కోట్ల అభివృద్ధి పనులు చేసింది. ఈ దృష్ట్యా 'కుడా'లో కొత్తగా ప్రతిపాదించిన గ్రామాల విలీనం వల్ల వాటికి ఎలాంటి నష్టం ఉండబోదని, పైగా మౌలిక సదుపాయాలు మెరుగు పడతాయని కుడా అధికారులు చెబుతున్నారు.

'కుడా' పరిధి

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ 1981లో ఏర్పాటైంది. మొదట 60 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే ఉండేది. ప్రస్తుతం 1,805 చ.కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలోని మొత్తం 19 మండలాలలోని 181 గ్రామాల్లోని 3.3లక్షల ఇళ్లలో ఉన్న 14లక్షల మంది ఉన్నారు. హనుమకొండ జిల్లాలోని 11 మండలాలలైన భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, కాజీపేట, వేలేరు, ఆత్మకూరు, దామెర మండలాలు.. వరంగల్ జిల్లాలోని ఐదు మండలాలైన వరంగల్, ఖిలా వరంగల్, వర్ధన్నపేట, గీసుకొండ, సంగెం మండలాలు.. జనగామ జిల్లాలోని 3 మండలాలైన చిలుపూరు, స్టేషన్‌ఘనపూర్, జఫర్‌గడ్ మండలాల్లో విస్తరించి ఉన్నాయి. పట్టణాల్లో మౌలిక సదుపాయాల ప్రణాళికను రూపొందించేందుకు, ఆ మేరకు అభివృద్ధి పనులు చేపట్టడానికి కుడాకు ప్రభుత్వం అధికారాలు ఇచ్చింది.

కొత్తగా చేరే మండలాలు

'కుడా' పరిధిలోకి కొత్తగా వచ్చే మండలాలు.. పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట, జనగామ పట్టణాలతో పాటు కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్న హుజూరాబాద్ ఉన్నాయి. 'కుడా' విస్తరణలో భాగంగా నర్సంపేట, నియోజకవర్గంలోని చెన్నారావుపేట, దుగ్గొండి, నర్సంపేట, అలాగే పరకాల నియోజకవర్గం నుంచి పరకాల, నడికూడ, జనగామ నియోజకవర్గం నుంచి జఫర్‌గడ్, లింగాల ఘనపురం, జనగామ నియోజకవర్గం నుంచి జనగామ, జనగామ రూరల్, వర్ధన్నపేట నియోజవర్గం నుంచి పర్వతగిరి మండలాలు విలీనం కానున్నాయి.



అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పోలీసులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

- విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి..
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 18: అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పోలీసులు వ్యవహరిస్తున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వంలో ఏ పార్టీ ఉన్నా.. చట్టాలను కాపాడాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ నెల 15న సోమవారం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం ప్రగతి సింగారంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఊరేగింపులో ఉన్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు తాగిన మైకంలో తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు చెప్పి ఇరు వర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిపించారని, అయితే దాడిచేసిన వారితో పాటు గాయపడిన వారిపైన కూడా కేసులు పెట్టడం సరికాదని అన్నారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో శాయంపేట ఎంపీపీ తిరుపతిరెడ్డిపై తప్పుడు కేసుపెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా వరంగల్ పోలీసు కమిషనర్, రాష్ట్ర డీజీపీలు స్పందించి ఇలాంటి దాడులు చేస్తున్న వారిపై ప్రత్యేక అధికారిని నియమించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, తిరుపతి రెడ్డి, సతీష్, సురేందర్, ప్రసాద్, నాగరాజు, మల్లయ్య, మహేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

28న జీపీ ఓటర్ల తుది జాబితా ప్రచురణ

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 18: జిల్లాలో ఉన్న 210 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామ పంచాయతీల వార్డుల వారిగా ఈ నెల 28వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా రూపకల్పనపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ నోటిఫికేషన్ జారీ చేసిన క్రమంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యామన్నారు. గురువారం మండలస్థాయిలో కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో హనుమకొండ, పరకాల రెండు రెవెన్యూ డివిజన్‌లు ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 210 గ్రామ పంచాయతీలుండగా, వాటిలో 1,986 వార్డులు ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీల వారిగా జిల్లాలో మొత్తం 3,65,828 ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో డీఎల్పీఓలు గంగాభవానీ, షర్ఫుద్దీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్యాంసుందర్, ఎం.డి. నేహాల్, ప్రవీణ్‌కుమార్, రవి, సయ్యద్ ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సుందర్‌రాజ్ గుడ్ బై?

- కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరే అవకాశం
- ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి పార్టీకి దూరం

రాంనగర్, సెప్టెంబరు 18: కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉం టున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రా జ్ కారు దిగేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. సుందర్‌రాజ్‌తో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో తన శ్రేయోభిలాషులతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏపార్టీలోకి వెళ్లినా సముచితస్థానం ఉంటుందనే హామీ లభించినట్లు తెలిసింది.

కాగా, 2001 నుంచి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న సుందర్ రాజ్.. 2015, 2021, 2024లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. పార్టీ అధిష్ఠానం సుందర్‌రాజ్‌కు ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. అధి ష్ఠానం నిర్ణయానికి కట్టుబడిన సుందర్‌రాజ్.. పార్టీ ఇచ్చిన కార్యకలాపాలను విజయవంతం చేశారు. ప్రతీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాస్టర్జీ కళాశాలల అధినేతగా, ప్రైవేటు కళాశాలల సంఘం రాష్ట్ర నేతగా యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్స్‌ను ఏకతాటిపై తీసుకువచ్చి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో తనదైన పాత్ర పోషించాడు. ఈ క్రమంలో సుందర్‌రాజ్‌కు బీఆర్ఎస్ అధిష్ఠానం 2022 ఏప్రిల్ 4వ తేదీన కుడా చైర్మన్‌గా అవకాశం కల్పించింది. అయితే ఆయన ఈ పదవిలో కనీసం యేడాది కూడా ఉండ లేదు. కిందటేడు నవంబర్‌లో జరిగినఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కుడా చైర్మన్ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 8 నెలలు మాత్రమే కుడా చైర్మన్‌గా పదవిలో సుందర్‌రాజ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

కుడా చైర్మన్ పదవి కోల్పోయిన క్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను సుందర్‌రాజ్ ఆశించారు. అయితే బీజేపీని వీడి బీఆర్ఎస్‌లోకి వచ్చిన రాకేష్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. రాకేష్‌రెడ్డిని తీసుకురావడంలో బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తనకు అవకాశం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన సుందర్‌రాజ్.. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అమెరికా వెళ్లారు. తిరిగి వచ్చి ఐదు మాసాలుగా పార్టీ కార్య కలాపాలకు దూరంగా ఉంటున్నారు. నూతనంగా బీసీ సం ఘాన్ని ఏర్పాటు చేసి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నా రు. పార్టీకి దూరమైన సుందర్‌రాజ్‌ను పార్టీ నేతలు పలకరించిన పాపాన పోలేదని తెలిసింది. ప్రతీ పార్టీ కార్యక్ర మంలో కీలక పాత్ర పోషించే ఆయన.. దూరంగా ఉండటం పట్ల స్థానిక నేతలు సైతం స్పందించలేదని సమాచారం. అటు అధిష్ఠానం, ఇటు స్థానిక నేతలు పట్టించుకోకపోవ డంతో సుందర్‌రాజ్ పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సుందర్‌రాజ్ బీఆర్ఎస్ వీడితే పట్టబద్రులు దూరమయ్యే అవకాశం ఉందని శ్రేణులు చర్చించుకుంటున్నారు.



వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబుపై వేటుకు రంగం సిద్ధం!

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాల ఆరోపణల నేపథ్యంలో తొలుత సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబుపై వేటు పడనున్నట్లు తెలిసింది. వర్సిటీ భూ కబ్జాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందం అధికారులు చేసిన సిఫార్సుల మేరకు కఠిన చర్యలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. వర్సిటీలోని 229 సర్వే నెంబర్‌లో అశోక్‌బాబుతోపాటు మరికొందరు అక్రమంగా ఇళ్లు నిర్మించడమే కాకుండా కబ్జాలకు పాల్పడినట్లు తాజాగా తేలిదిఇ. సర్వేల ఆధారంగా వర్సిటీ 229 సర్వేనెంబర్‌లో భూకబ్జాలపై స్పష్టత రావడంతో జిల్లా రెవెన్యూ అధికారులు రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది. రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల సర్వే రిపోర్టుల ఆధారంగా ఏఆర్ పి.అశోక్‌బాబుపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కాగా, వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ విబాగంలో ఏఆర్‌గా పనిచేసిన కాలంలో ఏఆర్ అశోక్‌బాబు వర్సిటీ పాలక మండలిలో, వర్సిటీ భూ కమిటీలో సభ్యుడిగా, కన్వీనర్‌గా పనిచేశారు. అయితే అశోక్‌బాబు పాలక మండలిలో, భూకమిటీ నుంచి తొలగించాలని పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నతాధికారులు కోరినప్పటికీ అప్పటి వీసీ టి.రమేశ్ తొలగించకుండా కొనసాగించారు. విద్యార్థిసంఘాల ఆందోళనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూకమిటీని నుంచి చివరకు అశోక్‌బాబును తొలగించాల్సి వచ్చింది. అయితే ఆ సమయంలో అశోక్‌బాబుపై చాలా ఆరోపణలు వచ్చాయి. అనుకూలమైనవారికి వర్సిటీలో అత్యున్నత పదవులు కట్టబెట్టబెట్టడంలో సహకరించారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల పట్ల సరిగా వ్యవరించేవారు కాదనే ఆరోపణలున్నాయి. తనకు వత్తాసు పలికిన వారికి పార్టుటైమ్ ఉద్యోగాలు కట్టబెట్టినట్లు తెలిసింది. అలాగే వర్సిటీలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు!

● ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్డీఏ నేతల వ్యాఖ్యలు ● వారిపై మోదీ, అమిత్‌షా కేసులు పెట్టాలి
● టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ● హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం


అంబేద్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, పక్కన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 18: భారతదేశాన్ని గాడ్సే వారసులు పాలిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలను పాతిపెడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో రాహుల్‌గాంధీపై బీజేపీ, ఎన్‌డీఏ నేతలు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా, నిరసన సభ జరిగింది. బీజేపీ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టు, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.

బీజేపీకి చెందిన రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్, శివసేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, యూపీ మంత్రి రఘురాజ్‌సింగ్, బీజేపీ నాయకుడు దర్విందర్ సింగ్‌లు తీవ్రవాదుల్లా మాట్లాడారని మండిపడ్డారు. బాధ్య తగల ప్రజాప్రతినిధులై ఉండి మరో ప్రజాప్రతినిధి అయిన రాహుల్‌గాంధీపై అప్రజాస్వామికంగా, తీవ్రవాదుల్లా వ్యాఖ్య లు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతల వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే స్పందించాలని, ఆ నలుగురి వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? లేక వ్యతిరేకిస్తున్నా రా? తేలాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం, గౌర వం ఉంటే.. ప్రధానమంత్రి ఆ నలుగురిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అప్రజాస్వామికులను గౌరవిస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర అని మహే శ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మోతీలాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వరకు దేశం కోసం త్యాగాలు చేశారని, జైలుకు వెళ్లారన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలే అర్పించారన్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొ ని దేశ ఐక్యత, అభివృద్ధి కోసం తపిస్తున్న రాహుల్‌గాంధీని ఒకరు టెర్రరిస్టు అని, మరొకరు ఆయన నాలుక కోస్తే వాళ్ల కు రూ.11లక్షల బహుమానం ఇస్తామని, ఇంకొకరు రాహు ల్‌గాంధీకి వాళ్ల నాయనమ్మకు పట్టిన గతే పడుతుంది.. అంటూ భయానక వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. అయినా మోదీ, అమిత్‌షాలు మాత్రం నోరు మెదపడం లేదని విరుచుకుపడ్డారు. జమ్మూ కశ్మీర్, మహారాష్ట్రల్లో బీజేపీ, శివసేన కనుమరుగు కానుందని, రానున్నరోజుల్లో హరియానాలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని, దీనిని జీర్ణించుకోలేని బీజేపీ.. రాహుల్‌గాంధీ పై అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. రాహుల్.. ఆయన కుటుంబ చరి త్రను కనుమరుగు చేయాలనే కుట్రలు బీజేపీ పన్నుతోంద న్నారు. రాహుల్‌కు ఏమైనా హాని జరిగితే బీజేపీ తగిన మూ ల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజల భవిష్యత్తు అని, ఆయనను కంటి కి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్య లపై బీఆర్ఎస్ మౌనంగా ఉందని, బీజేపీతో ఆ పార్టీ లోపా యికారి ఒప్పందమే ఇందుకు నిదర్శనమని మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. దేశంలో కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనే బీజేపీకి ప్రజలే మరింత గుణపాఠం చెబుతారన్నారు. మోదీ, అమిత్‌షాలకు చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా ఆ నలుగురిపై కేసులు నమోదు చేయించా లని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రాహుల్‌పై అను చిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలి

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ నలుగురి పై బీజేపీ అధిష్ఠాన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీజేపీ అడుగులకు మడుగులు ఒత్తే బీఆర్ఎస్ నేతలు కిమ్మనడం లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి మోదీ, ఆయన తల్లిపై వ్యాఖ్యలు చేయాలనుకుంటే తాము చేయలేమా?.. అది సంస్కారం కాదని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరు

బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ త్యాగాలు ముందు బీజేపీ నేతలెంత? అని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై ఈగ వాలినా ఊరుకోమని హెచ్చరించారు. దేశంలో వైషమ్యాలు, ద్వేషాలు సమసి అన్నివర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో విలసిల్లాని, దేశం అభివృద్ధి చెందుతూ ఐక్యంగా ఉండాలని రాహుల్‌గాంధీ కోరుకుంటుంటే.. బీజేపీ నేతలు ప్రజాస్వామ్య విలువలను పాతర పెట్టేలా వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. రాహుల్‌గాంధీ రాజకీయ ఉన్నతిని జీర్ణించుకోలేకే బీజేపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసాచారి, ఆనంద్ మోజెస్, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, టీపీసీసీ నాయకులు శ్రీనివాసాచారి, కూచన రవళి, ఎం.డి. అంకూస్, మార్క విజయ్, ఆనంద్ మోజెస్, డాక్టర్ శ్రవణ్, వీసం సురేందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, రజాలీ, బుచ్చిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య


పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


ప్రసంగిస్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు


ప్రసంగిస్తున్న మేయర్ గుండు సుధారాణి


మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

ఊకల్ నాగేంద్రస్వామి, భద్రకాళి సన్నిధిలో..


టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భద్రకాళి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేస్తున్న ఈవో, అర్చకులు


ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మహేష్‌కుమార్‌గౌడ్, పొన్నంకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు

వరంగల్ కల్చరల్ / గీసుగొండ, సెప్టెంబరు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొమ్మగాని మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం తొలిసారి వరంగల్ పర్యటనకొచ్చారు. తొలుత ఆయన గీసుగొండ మండలం ఊకల్ గ్రామంలోని శ్రీబాల నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే 40 రోజులుగా విజయ పాశుపత పారాయణం జపించిన ఆయన రక్ష కంకణాన్ని స్వామి వారికి తిరిగి చెల్లించారు. ఈ సందర్భంగా సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. నెమలి పింఛాలమాలతో సత్కరించారు.

అనంతరం వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయానికి చేరుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్కడ వల్లభగణపతిని దర్శించుకున్న తర్వాత భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ మహా మండపంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, పుల్లా పద్మావతి తదితరులకు అర్చకులు శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి శేష వస్త్రాలు, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల పీసీసీ అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజు, శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఊకల్ ఆలయంలో పీసీసీ అధ్యక్షుడి వెంట మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ గీసుగొండ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధులు చాడా కొమురారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కందకట్ల కళావతి, హైకోర్టు అడ్వకేట్ తీగల రాజేష్‌గౌడ్, ఏసీపీ తిరుపతి, సీఐ నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కొత్తగట్టు రాజేందర్, నాయకులు కూసం రమేష్, కందకట్ల నరహరి, నాగరాజు, మాజీ సర్పంచ్ నాగదేవత, వీరారావు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా హనుమకొండకు వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మడికొండలో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. నిరసన అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు జమ్మికుంటకు బయలుదేరారు.


వైద్య కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రారంభానికి సిద్ధమైన నర్సంపేట వైద్య కళాశాల భవనం

నేడు నర్సంపేట వైద్య కళాశాల ప్రారంభోత్సవం

హాజరవనున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నర్సంపేట, సెప్టెంబరు 18: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులు, వైద్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. వైద్య కళాశాల భవనంలో ఏర్పాట్లను, వివిధ విభాగాలకు చెందిన గదులను వారు పరిశీలించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి, కలెక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం 50మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతిచ్చింది. ఇప్పటి వరకు 50 మందిలో ఏడుగురు నాన్ లోకల్ వి ద్యార్థులకు అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించగా, నాన్ లోకల్‌కు చెందిన ఒక విద్యార్థి మాత్రమే అడ్మిషన్ పొందారు. మరో ఆరుగురు నాన్ లోకల్, 43 మంది లోకల్ విద్యార్థులు అడ్మిషన్లు పొందాల్సి ఉంది. ఈనెల చివరి వరకు అడ్మిషన్లు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణ



బాలసముద్రం, సెప్టెంబరు 18: జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణను బుధవారం ఐజేయూ అనుబంధ సంఘం టీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విర హత్ అలీ ప్రకటించారు. హను మకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన వల్లాల రమణ.. మూడు దశాబ్దా లకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. జర్నలిస్టు సంఘంలో గతంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, నాలుగుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రమణ పని చేశారు. ప్రస్తుతం రమణ మన తెలంగాణ దిన పత్రికా ప్రత్యే క ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాగా, తనను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం పట్ల మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి రహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఇతర యూనియన్ నాయకులకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని పేర్కొన్నారు. యూనియన్ నాయకుల సహకారంతో జర్నలిస్టుల హౌసింగ్ సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రమణకు వి విధ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై ఇన్‌చార్జ్ వీసీ కరుణ సీరియస్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కేయూ తెలుగు విభాగంలో ఆర్ట్స్ డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతిని అవమానక రంగా మాట్లాడటంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేసిన తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు కర్రె సదాశివ్‌తో పాటు మరో కాంట్రాక్టు అధ్యాపకుడిపై కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రొఫెసర్ జ్యోతి ఫిర్యాదు మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ కాంట్రాక్టు అధ్యాపకుల సస్పెన్షన్‌కే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, సదరు కాంట్రాక్టు అధ్యాపకులు ప్రొఫెసర్ ఏటూరు జ్యోతికి క్షమాపణలు చెప్పడంతో పాటు మరోసారి ఎలాంటి తప్పిదాలకు పాల్పడమని లేఖ రాసిచ్చారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18: జర్మనీ దేశంలో వివిధ రంగాల్లోని ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెని లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. లాజిస్టిక్స్, టెక్నికల్, హాస్పిటాలిటీ, ఫుడ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఉద్యోగాల ఉన్నాయని, 28 సంవత్సరాల వయస్సులోపు గల వారు టామ్‌కామ్ వెబ్‌పోర్టల్ లేదా యాప్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అన్ని వివరాల కోసం టామ్‌కామ్ వెబ్‌పోర్టల్‌ను లేదా 8125251408/9100798204లో సంప్రదించాలని సూచించారు.

చరిత్ర ఘనం.. శిథిల జ్ఞాపకం..

ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై పురాతన ఆలయం
1500ఏళ్లనాటిదిగా భావిస్తున్న పురావస్తు పరిశోధకులు
'ఫారెస్టు' టూరిజానికి మొదటి అడుగు
రాళ్లతో మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్న అటవీశాఖ
ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్ నిర్వహణకు సన్నాహాలు


ఆలయాన్ని పరిశీలిస్తున్న జర్మనీ పరిశోధకురాలు కొరీనా (ఫైల్)

ములుగు, సెప్టెంబరు 18: ములుగు అభయారణ్య గర్భం వందల ఏళ్ల చరిత్రను పదిలంగా దాచుకుంది. ఎక్కడ తడి మి చూసినా.. తవ్వి శోధించినా అడుగడుగునా విస్తుగొలిపే వింతలు, విశేషాలే కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ సంపద గా యునెస్కో గుర్తింపుతో కీర్తిపొందిన రామప్ప దేవాలయం కంటే పురాతనమైన చరిత్ర సాక్ష్యాలు అనేకం శిథిల జ్ఞాపకా లుగా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని దామెరవాయి, మంగపేట మండలంలోని మల్లూరు అడవుల్లో వెలుగుచూ సిన డోల్మన్ సమాధులు ఆదిమ మానవుడి ఆనవాళ్లకు దారి చూపిస్తాయి. ఇదే తరహాలో అత్యంత విశిష్టమైన రాతి నిర్మా ణమొకటి ములుగు మండలం కొత్తూరు సమీపంలోని దేవునిగుట్టపై ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన కంబోడియాలోని ఆంగ్‌కోర్ వాట్ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయం ప్రస్తుతం శిథిలా వస్థలో దర్శనమిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా ఈ కట్టడం పై విస్తృత పరిశోధనలు జరుగుతుండగా పరిరక్షణ, పునరు ద్ధరణకు అడుగులు ముందుకు సాగడంలేదు. తాజాగా అట వీశాఖ ఆధ్వర్యంలో గుట్టపైకి మెట్ల మార్గాన్ని నిర్మిస్తుండ టం ఈ ఆలయ మనుగడపై ఆశలు పెంచుతోంది.

ఆరో శతాబ్దం నాటి నిర్మాణం..

ములుగు జిల్లాకేంద్రానికి 18కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామ శివారులోగల దేవునిగుట్టపై ఈ రాతి నిర్మా ణం ఉంది. వందేళ్లక్రితమే ఈ ఆలయం వెలుగులోకి వచ్చి నా చుట్టూ ఉన్న దట్టమైన అడవిలో క్రూరమృగాల సంచా రం ఎక్కువగా ఉండటంతో ప్రజలెవరూ అటువైపునకు వెళ్లేవారు కాదు. అయితే గత మూడు దశాబ్దాలుగా దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాలంలో దేశ విదేశా లకు చెందిన పురావస్తు, చరిత్ర పరిశోధకులు వచ్చివెళ్లారు. చూసిన వారంతా ఒకింత సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు.


స్థానికులతో కలిసి ఆలయాన్ని సందర్శించిన బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ

ఆంగ్‌కోర్ వాట్ ఆలయం నమూనాలో ఉండటాన్ని గుర్తించి.. 6, 7శతాబ్దాల కాలంలో నిర్మించి ఉంటారని, విష్ణుకుండినుల కాలంలోని శైలిని పోలి ఉందని అభిప్రాయపడ్డారు. దక్షిణ ఆసియాలోని పురాతన కట్టడాలపై పరిశోధన చేస్తున్న బ్రిట న్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ, జర్మనీకి చెందిన కొరీనా, ఇటలీకి చెందిన ఆండ్రీతోపాటు దేశీయ పరిశోధకు లు అనేకమంది దేవునిగుట్ట ఆలయాన్ని సందర్శించి చరిత్ర లోతుల్లో అన్వేషించారు. యావత్ భారత దేశంలోనే ఇలాం టి నిర్మాణం ఎక్కడాలేదని తేల్చిచెప్పారు. ఫొటోలు, వీడి యోలు తీసుకొని వెళ్లి ఇంకా అధ్యయనం జరుపుతూనే ఉన్నారు.

శిథిలావస్థలో ఆలయం

దేవునిగుట్ట ఆలయం నిర్మాణం చూడగానే మనసును కట్టి పడేస్తుంది. ఆ శైలి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. 30మీటర్ల ఎత్తులో ఉండే ఈ ఆలయం రాతి ఇటుకలను పేర్చినట్లు కనిపిస్తుంది. శైవం, వైష్ణవం కలబోతగా శిల్పాకృ తులున్నాయి. తాండవం చేస్తున్నట్లుగా పరమశివుడు, నిలు వెత్తు విష్ణుమూర్తి, దేవతల ఆకృతులు కనిపిస్తాయి. అనేక రాళ్లపై దేవతామూర్తుల రూపాన్ని చెక్కి వరుసక్రమంలో పేర్చిన తీరు ఆనాటి మేధస్సుకు అద్దం పడుతోంది. కాలక్ర మంలో ఆలయం శిథిలావస్థకు చేరగా.. గోపురం పైభాగం ధ్వంసమై వర్షపునీరు లోపలికి చేరుతోంది. చెట్లు పెరగడం, తీగలు అల్లుకోవడంతో రాళ్లమధ్య పగుళ్లు వచ్చాయి. 60 నుంచి 70ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రహరీ ధ్వంసమైంది. ఆలయానికి వెళ్లే మార్గంలో గండశిలపై ఉన్న కోనేరు కాలా లతో సంబంధం లేకుండా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుం ది. ఇదిలా ఉంటే గుప్తనిధుల కోసం ఇక్కడ అన్వేషణ సాగుతోంది. గతంలో అనేక మంది రహస్యంగా తవ్వకాలు జరిపినట్లు స్థానికులు చెబుతారు. అయితే ఇటీవల ఆల యానికి సందర్శకులు వస్తుండటం, జనసంచారం పెరుగు తుండటంతో కొంతమేరకు తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతోంది.

సంరక్షిస్తున్న స్థానికులు

కొత్తూరు గ్రామస్థుల ఆరాధ్య దైవమైన లక్ష్మీనర్సింహ స్వామి తమను ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల నుంచి కాపాడుతున్నాడని నమ్ముతున్నారు. దేవునిగుట్టపై సాక్షాత్తు నర్సింహస్వామియే కొలువున్నాడనే విశ్వాసంతో వారు 2012లో దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని ఏటా హోలీ సమ యంలో వేడుకలు జరుపుతూ లక్ష్మీనర్సింహస్వామికి కల్యా ణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి దేవున్ని దర్శించుకుంటారు. ఈక్రమంలో భక్తులు వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. వర్షాలు కురవాలని, అంటువ్యాధులు దూరం కావాలని వేడుకుంటూ వరదపాశం వేడుక నిర్వహిస్తున్నారు. బెల్లం, బియ్యం, పాలతో వండిన పరమాన్నాన్ని ఆలయం ఎదుట బండరా యిపై పోసి నాకుతారు. ఇలా ఇన్నేళ్లుగా కొత్తూరువాసులు ఈ పురాతన కట్టడాన్ని సంరక్షిస్తున్నారు. గుడి వద్దకు వెళ్లాలంటే కాలినడకన దట్టమైన తుప్పలు, చెట్లను దాటాలి. ప్రతీ ఏటా ఉత్సవాల సమయంలో అప్పటికప్పుడు ముళ్లపొదలు, తుప్పలను కొంతమేరకు తొలగించి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకుంటారు.

రూ.10లక్షలతో మెట్లు, బేంచీలు..

ఆలయ పునరుద్ధరణ కోసం రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ కృష్ణఆదిత్య రూ.1.80కోట్లను కేటాయించారు. కాకతీ య హెరిటేజ్ ట్రస్టు, తెలంగాణ పురావస్తు శాఖ సంయుక్త పర్యవేక్షణలో పనులు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ ప్రయత్నం టెండర్ల దశలోనే నిలిచిపోయింది. తాజాగా జిల్లా అటవీశాఖ అడుగు ముందుకు వేసింది. బొగత, లక్నవరం, తరహాలో దేవునిగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దారి, సదుపాయాల కల్పనకోసం రూ.10లక్ష ల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. 2కిలోమీటర్ల మేర మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్నారు. స్థానికంగా లభించే రాళ్లతోనే మెట్లను కడుతున్నారు. గుట్టపై పగోడాలు, సందర్శకులు సేదతీరేందుకు బెంచీలను ఏర్పాటు చేయనున్నట్లు ములు గు ఫారెస్టు రేంజ్ అధికారి శంకర్ తెలిపారు. వారాంతాల్లో ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్, తదితర సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. దేవునిగుట్ట విశే షాలను పర్యాటకులకు తెలిపేందుకు గైడ్‌ను నియమి స్తామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత నిర్ణీత టిక్కె ట్ ధరతో సందర్శనకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.


మెట్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



వర్సిటీలో కబ్జాలపై కొనసాగుతున్న సర్వే

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీస్ అధికారులు, రెవెన్యూ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. బుధవారం వర్సిటీకి చెందిన 214 సర్వే నెంబర్‌లోని వర్సిటీ డబ్బాలు, ఓల్డ్ ఫార్మసీ హాస్టల్ భవనం పరిసరాల ప్రాంతాల్లో భూ సర్వే చేపట్టారు. అక్రమణలను గుర్తించారు. గురువారం మార్కింగ్ చేసి కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కార్యచరణ చేపడుతామని వర్సిటీ ఇన్‌స్పెక్షన్ జాయింట్ కమిటీ బాధ్యులు తెలిపారు. వర్సిటీలోని అన్ని సర్వే నెంబర్లలో ఫిజికల్ సర్వే చేపట్టి భూ కబ్జాలు, ఇతర అక్రమణల లేత్పే పనిలో వర్సిటీ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఈ సర్వేతో వర్సిటీ భూ కబ్జాలపై స్పష్టత వస్తుందని వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి చెప్పారు. సర్వేలో వర్సిటీ అధికారులతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సై రాకేశ్, రెవెన్యూ సర్వేయర్ రాకేశ్, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న అధికారులు, అధ్యాపక సిబ్బంది

పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత

హసన్‌పర్తి, సెప్టెంబరు 18: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యానికి భద్రత అని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో శ్రమదానం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మి, స్వచ్ఛ భారత్ ప్రతినిధి సంపత్‌కుమార్, కార్యదర్శి తిరుపతి, ఈసీ శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజుకుమార్, హెడ్ మాస్టర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుంచు రాజేందర్

ఉపాధి హామీ కూలీలపై కేంద్రం మొండి వైఖరి

వడ్డేపల్లి, సెప్టెంబరు 18: బెంగాల్ రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మూడేళ్లుగా ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించకుండా నిర్లక్ష్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం హనుమకొండలోని అశోక కాలనీలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డులను ప్రధానమంత్రికి పంపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. బెంగాల్ రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, పశ్చిమ బెంగాల్ కూలీలపై కక్ష సాధింపు, అమానవీయ చర్యలను మానుకొని బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర మహిళా నేతలు బొర్ర సంపూర్ణ, మేకల అనిత, ఎడ్ల కోమల, పుల్యాల మంజుల , విజయ, సరిత, సుజాత, రజిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, సెప్టెంబరు 18: పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోపా పద్మశాలి ప్రతిభాపురస్కార్ -2024 కోసం ప్రతిభ గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి పాము శ్రీనివాస్ తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, నీట్ తదితర పరీక్షలలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు నగదు పారితోషికం ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 28 సాయంత్రం 5 గంటల లోపు పంపించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 99514 09700 లో సంప్రదించాలని కోరారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ, సెప్టెంబరు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులై మొదటిసారి జిల్లాకు వచ్చిన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌కు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మడికొండలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి స్వాగతించారు. అనంతరం పార్టీశ్రేణులు భారీ ర్యాలీతో వారిని నగరానికి తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిల్ల రవిందర్, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ నర్సయ్య, ముంజ రమేష్, రాజుయాదవ్, వస్కుల శ్రీను, వస్కుల నాగరాజ్ పాల్గొన్నారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కడిపికొండకు చెందిన గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగపురి రాజయ్యగౌడ్ ఆయనను కలిసి శాలువా కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి

వడ్డేపల్లి: బీసీ కుల గణన వెంటనే చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శాలువా కప్పి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు కులగణన చేపట్టాలని కోరారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు తొటం రవీందర్, నాగరాజు, కురిమిల్ల శ్రీనివాస్, కోల ప్రతాప్, పంజాల మధు, కొడారి అనిల్ యాదవ్ ఉన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను పలువురు కాంగ్రెస్ శ్రేణులు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నా వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో కిసాన్ కేత్ మజ్దూర్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ తుమ్మలపల్లి వీరన్న, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ శ్రేణులు ముస్తాక్ నెహాల్, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి సుధాకర్, తాళ్లపెల్లి రవీందర్, బుస్స నవీన్‌కుమార్, బోడ ప్రసాద్, ఎండి అక్మల్ పాషా, ఎండి గౌస్ పాషా ఉన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న రాజయ్య గౌడ్

వినియోగదారుల కోసం టీజీ ఎన్పీడీసీఎల్ యాప్

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 18: వినియోగదారులకు మరింత చేరువయ్యే విధంగా 19 ఫీచర్లతో టీజీఎన్పీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని హనుమకొండ ఎస్ఈ పి. వెంకటరమణ తెలిపారు. ప్రతీ సమస్యకు ఒక ఫీచర్‌ను యాప్‌లో పొందుపరిచామన్నారు. వాటిలో 1. రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్, 2. కన్స్యూమర్ గ్రీవెన్సెస్, 3. సెల్ఫ్ రీడింగ్, 4.పే బిల్స్, 5. బిల్ హిస్టరీ, 6. ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, 7. లింక్ ఆధార్ అండ్ మొబైల్, 8. డొమెస్టిక్ బిల్ క్యాలిక్‌లెటర్ 9. కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి, 10. పేరు, లోడ్ మార్పు గురించి, 11. విద్యుత్ వాడకం గైడ్‌లైన్స్, 12. టారిఫ్ వివరాలు, 13. ఎనర్జీ సేవింగ్ టిప్స్, 14. సేఫ్టీ టిప్స్, 15.ఫీడ్ బ్యాక్, 16. మై అకౌంట్, 17. వినియోగదారుల బిల్లు సమాచారం, 18. వినియోగదారుల పరిధిలోని అధికారుల వివరాలు, 19. కాంటాక్ట్ విద్యుత్‌శాఖ అనే 19 ఫీచర్లతో యాప్ పనిచేస్తుందన్నారు. ప్రతీ ఒక్క వినియోగదారుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విద్యుత్‌శాఖ సేవ లను పొందాలన్నారు. మరింత నాణ్యమైన సేవలు అం దుకునేందుకు విద్యుత్ సంస్థకు వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 18: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని పాత ఆర్‌టీవో కార్యాలయం, లష్కర్‌సింగారం, రాంనగర్, రాజాజీనగర్, పోలీస్‌హెడ్‌క్వార్టర్ వెనుకాల ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం హెచ్‌వోడీలతో కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 18: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళితో కలిసి హెచ్‌వోడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రికి ప్రతీ రోజు సుమారు 2వేల మంది అవుట్ పేషెంట్లు వస్తున్న దృష్ట్యా ఓపీ యూనిట్‌ను వయోవృద్ధుల వార్డుకు మార్చాలన్నారు. వయోవృద్ధుల వార్డును కాకతీయ మెడికల్ కళాశాలలోని పీఎంఎస్ఎస్‌వైకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఓపీ వార్డును నవీకరించి రోగులు, అటెండెంట్‌ల విశ్రాంతి కోసం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రోగుల సౌకర్యార్థం ఓపీలో చీటీలు అందించే కౌంటర్ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. సమావేశంలో ఆర్‌ఎంవోలు శ్రీనివాస్, మురళి, శేషు, రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, పాథాలజీ, రేడియో థెరపీ, పీడియాట్రిక్స్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

కేయూ సూపరింటెండెంట్ ఆత్మహత్య



సదాశివుడు (ఫైల్)

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం సూపరింటెండెంట్ పసునూటి సదాశివుడు (57) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు సదాశివుడు కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన కథనం ప్రకారం.. సదాశివుడు కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో ప్రాణం మీద విరక్తితో గడ్డి మందు తాగడంతో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హంటర్‌రోడ్డులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. చిన్న కుమారుడు కెనడా నుంచి వచ్చిన తర్వాత అంత్యక్రియలు జరుపుతామని బంధువులు తెలిపారు. కాగా సదాశివుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సదాశివుడి మృతి పట్ల వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు వల్లాల తిరుపతి, ఇతర సూపరింటెండెంట్‌లు సంతాపం ప్రకటించారు. గురువారం సదాశివుడు స్వగ్రామమైన హసన్‌పర్తి మండలం పెగడపల్లి గ్రామంలో నిర్వహిస్తామని తెలిపారు.

శివసేన ఎమ్మెల్యేపై ఇనుగాల ఫిర్యాదు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 18: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహరాష్ట్రలోని శివసేన పార్టీ బుల్‌దాన నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసకోవాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి బుధవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. రాహుల్‌గాంధీ నాలుక కోసిన వారికి రూ.11లక్షల నగదు బహుమతి ఇస్తానని రెచ్చగొట్టేవిధంగా అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్యేను శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు ఇనుగాల వెంట కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ పిల్ల కార్తీక్, కాంగ్రెస్ లీగల్‌సెల్ సభ్యులు దుగ్గి అచ్యుత్ కుమార్, చెడుపాక అరుణ్‌కుమార్ ఉన్నారు.

దక్షిణాసియా దేశాల సదస్సుకు వేణు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 18: దక్షిణాసియా దేశాల మధ్య జరిగిన పారిశుధ్య రంగంలో ఉత్తమ పద్ధతులు, వాటిపై ఇతరులకు అవగాహన కల్పించడంలో భాగంగా నాలుగురోజుల పాటు న్యూఢిల్లీలో జరిగిన సదస్సుకు 53వ డివిజన్ ఆదర్శకాలనీకి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ కాలనీలో సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్‌లకు చేపట్టిన యాక్షన్ ప్లాన్, ప్రచారం చేసిన విధానం, ఎదురైన సవాళ్లను అధిగమించడానికి చేపట్టిన చర్యలను పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించి, వివిధ దేశాల నుంచి హాజరైన వారికి ఆదర్శ కాలనీ విజయగాథ ప్రతులను అందజేశారు. సదస్సును పూర్తి చేసుకొని తిరిగొచ్చిన వేణు దంపతులను కాలనీ కమిటీ అభినందించింది. కాలనీ ఏర్పాటు నుంచి నేటి వరకు కాలనీ పేరుకు తగ్గట్లు నగరంలో తమ కాలనీని వేణు ఆదర్శంగా తీర్చదిద్దడమే కాకుండా జాతీయస్థాయిలో ఆదర్శకాలనీ పేరును నిలపడం గర్వకారణంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, కుమారస్వామి, చంద్రమౌళి, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీను, స్వప్న, కరుణ, రజిత, రజిని తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తలో ఫిర్యాదు

మడికొండ, సెప్టెంబరు 18: మడికొండలోని దేవస్థానం భూములు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్యాక్రాంతమవుతున్నాయని మడికొండకు చెందిన పల్లపు అశోక్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఈ కేసు విచారించిన లోకాయుక్త న్యాయమూర్తి సీవీ రాములు రెవెన్యూ అధికారుల నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ సర్వే చేసి పూర్తి స్థాయి నివేదికతో తదుపరి విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

అశోక్ తెలిపిన వివరాల మేరకు రెవెన్యూ పహాణి రికార్డు ప్రకారం 1954-55, 1965-66 సంవత్సరాలలో స్థానిక కనకదుర్గమ్మ దేవస్థానానికి సంబంధించి 13 గుంటల వ్యవసాయేతర భూమి ఉందని ఆ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని లోకాయుక్త న్యాయమూర్తికి తెలుపగా విచారించిన న్యాయమూర్తి దేవాలయ స్థలాలు కాపాడటంలో రెవెన్యూ శాఖ కీలకం అని అసంపూర్తి వివరాలతో కాకుండా పూర్తి సర్వే చేసి పూర్తి విరాలతో కూడిన నివేదికను అక్టోబరు 23 నాటికి సమర్పించాని న్యాయమూర్తి ఆర్డీవోను ఆదేశించారని తెలిపారు.



సీతారాం సంతాప సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: సీపీఐ(ఎం)జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం సమాజానికి తీరని లోటని ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్ నేతృత్వంలో సంస్మరణ సభను సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మంద శ్రీకాంత్, స్టాలిన్, ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సాయి సందీప్, వినయ్, రాజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 18: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. జిల్లాలోని దామెర, సిద్ధాపూర్, హసన్‌పర్తి పీహెచ్‌సీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, మందులు, ల్యాబ్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అన్ని రకాల వ్యాక్సిన్‌లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా గురువారం నుంచి అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దీనికి సంబంధించిన క్యాంపుల షెడ్యూల్‌ను వైద్య అధికారులకు అందించినట్లు తెలిపారు. ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి సూచించారు.



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి

40వ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్
- బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 18: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో బల్దియా అధికారుల నిర్లక్ష్యంతోపాటు మేయర్ గుండు సుధారాణి పక్షపాత వైఖరి అవలంబిస్తోందని మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆరోపించారు. బుధవారం వరంగల్ బల్దియా కార్యాలయం ఎదుట 40వ డివిజన్ కార్పొరేటర్‌తో పాటు డివిజన్ ప్రజలు చేస్తున్న ప్రజా నిరసన దీక్షను సందర్శించి ప్రారంభించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 40వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించకపోవడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టకపోవడంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.



ప్రజా నిరసన దీక్షను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల కోసం తన మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం దగ్గరపడిందన్నారు.

బల్దియా డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల సమస్యలు పరిష్కరించే బాధ్యత మేయర్‌పై ఉందన్నారు. 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి మాట్లాడుతూ.. డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై మేయర్, కమి షనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కమిషనర్‌కు 13డిమాండ్లతో కూడిన వినతి సమర్పించినా పట్టించుకోలేదని అన్నారు. కాగా, ఈ దీక్షకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరై సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, అవాల రాధికరెడ్డి, గుగులోతు దివ్యరాణి, సీపీఎం నాయకుడు సింగారపు బాబు, బీజేపీ నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, పుల్లారావు, వెంకట్‌గౌడ్, ఆకుతోట రాజు, పూజారి విజయ్, వనం కుమార్, గౌతం, యాకయ్య, కుమారస్వామి, రాజేశ్వర్, రాజన్‌బాబు, మంద నవీన్ తదితరులు ఉన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ హైదరాబాద్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 50 ఉద్యోగాల కోసం, ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ వరంగల్, హుజురాబాద్, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో రిలేషన్‌షిప్ మేనేజర్ 50, బ్రాంచి రిలేషన్‌షిప్ మేనేజర్ 10 పోస్టులకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసై 22 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపుగల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ములుగురోడ్‌లోని కార్యాలయంలో హాజరు కావాలని ఆమె కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనంటూ కుటుంబసభ్యుల ఆందోళన
- న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ఎదుట నిరసన

న్యూశాయంపేట, సెప్టెంబరు 18: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతిచెందగా.. ఆమె మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేసిన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గుడ్ల చిన్న సుశీల(72)కు కాలు వాపు, ఇన్‌ఫెక్షన్ సోకడంతో కుటుంబ సభ్యులు ఆమెన ఈ నెల 9న హంటర్‌రోడ్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత రెండు రోజులకు సుశీలకు డయాలసిస్ చేసిన వైద్యులు ఆ తర్వాత మూత్రాశయంలో రాళ్లు ఉన్నాయని శస్త్రచికిత్స చేయాలని, అందుకు రాయితీ ఇస్తామని చెప్పి శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత బ్లీడింగ్ అవుతోందని, రక్తం కావాలని వైద్యులు హడావుడి చేసిన వైద్యులు చివరకు ఈసీజీ తీసి సుశీల మరణించిందని చెప్పారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ వద్ద నుంచి వైద్యానికి రూ.2లక్షల10వేలు వసూలు చేశారని, డబ్బులు తీసుకుని కూడా డాక్టర్లు నిర్లక్ష్యంగా వైద్యం చేసి సుశీల మృతికి కారకులయ్యారని, తమకు న్యాయం చేయాలని ఆసుపత్రి ఎదుట సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. సుబేదారి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో, ఆసుపత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. చివరికి చికిత్సకు కట్టిన రూ.2లక్షల 10వేలు ఆసుపత్రి వర్గాలు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించినట్టు సమాచారం.

ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ధర్నా

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతికి కారణమైన సదరు ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఉదయం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి మాట్లాడుతూ వైద్యం పేరుతో పేద ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న ఇలాంటి ఆసుపత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాలో డీవైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి డి. సాంబమూర్తి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి ఓ. చిరంజీవి, మహేష్, అనిల్, అరుణ్, రాజేష్, కుమార్ తదితరులు ఉన్నారు.

కౌన్సెలింగ్

మాయిశ్చరైజర్లు ఇంజక్షన్ రూపంలో...

Q A

డాక్టర్! నా వయసు 50 ఏళ్లు. చర్మం మీద ముడతలతో పెళ్లిళ్లు లాంటి వేడుకలకు దూరంగా ఉంటున్నాను. అలాగని ఖరీదైన కాస్మటిక్ చికిత్సలు తీసుకోలేను. కాబట్టి ఏదైనా తేలికపాటి ప్రత్యామ్నాయం సూచించగలరు?

- ఓ సోదరి, హైదరాబాద్

చర్మపు తేమను పెంచడానికి, హైల్యురోనిక్ యాసిడ్ ఎంతో బాగా ఉపయోగపడుతుంది. దీన్ని నేరుగా చర్మంలోకి ఇంజెక్ట్ చేయగలిగే వెసులుబాట్లు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. అలాగే వయసుతో పాటు పెరిగే చర్మపు ముడతలను తగ్గించడం కోసం, హైల్యురోనిక్ యాసిడ్‌తో పాటు, గ్లూటోథయాన్, పాలీడియాక్సీ న్యూక్లియొటైడ్ అనే పెప్టైడ్స్‌ను కలిగి ఉండే వాటినీ, విటమిన్ సిని కూడా జోడించి ఇంజెక్ట్ చేయవచ్చు. వీటితో యాంటీ ఏజింగ్, స్కిన్ లైటెనింగ్ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. వీటితో చర్మం మెరుగ్గా హైడ్రేట్ అవడంతో పాటు మెరుపును కూడా సంతరించుకుంటుంది.



ఏ వయసు వారైనా...

ఈ చికిత్సకు వయసుతో సంబంధం లేదు. 20 నుంచి 60 ఏళ్ల వాళ్లు కూడా ఈ ఇంజెక్టబుల్ చికిత్సల ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో వయసుకు తగిన ఇంజెక్టబుల్ మాయిశ్చరైజర్స్ ఉన్నాయి. కొన్ని ఇంజెక్షన్ల ప్రభావం 3 నుంచి ఆరు నెలలు ఉంటుంది. ఇంకొన్నిటిని ప్రతి ఆరు నెలలకూ రిపీట్ చేస్తూ ఉండాలి. హైల్యురోనిక్ యాసిడ్ సాంద్రత మీదే ఇదంతా ఆధారపడి ఉంటుంది. ఇది డే కేర్ ప్రొసిజర్. చికిత్స తర్వాత సగం రోజులోనే వాపు మొత్తం తగ్గిపోతుంది. ఒక్క రోజులో పూర్తిగా నార్మల్ అయిపోతుంది. ప్రభావం కనిపించడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. పెళ్లిళ్లు, వేడుకలకు ముందు ముఖం మెరుస్తూ, ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఈ చికిత్సలను ఎవరైనా ఎంచుకోవచ్చు. ఈ ఇంజక్షన్లకు ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.

- డాక్టర్ స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

ఇంటికి న్యూ లుక్

ఇంటిని అందంగా అలంకరించుకోవడం మన చేతుల్లో పనే. కాస్త అభిరుచి ఉంటే చాలు, ఇల్లు చిన్నగా ఉన్నా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చు. నిపుణులు సూచిస్తున్న హోమ్ డెకరేషన్ టిప్స్ ఇవి.

- ఇంటిని అలంకరించే ముందు ఏయే వస్తువులు తీసేయాలి. కొత్తగా ఏ వస్తువులు తీసుకురావాలి అనే విషయాల గురించి పేపర్‌పై రాసుకోవాలి. ప్లానింగ్ ఉంటేనే ఫలితం బాగుంటుంది. సమయం, డబ్బులు ఆదా అవుతాయి.
- డెకరేషన్ ఐడియాల కోసం మ్యాగజైన్లు తిరగేయాలి. ఆన్‌లైన్‌లో బోలెడు వెబ్‌సైట్లు ఉన్నాయి. వాటిపై ఒక లుక్కేయాలి.
- మీ అభిరుచికి తగిన విధంగా, అవసరానికి తగ్గట్టుగా ఫర్నిచర్‌ను ఎంపిక చేసుకోవాలి. అనవసరమైన వాటికి ఇంట్లో చోటివ్వద్దు.
- ఇల్లు చిన్నగా ఉన్నట్లయితే ప్రతీదీ ప్లాన్‌గా అమర్చుకోవాలి. ఇంట్లో ప్రతి మూలను మీరు ఉపయోగించుకునేందుకు వీలుగా ఉండాలి.
- ఇంట్లోకి సహజసిద్ధమైన వెలుతురు వచ్చేలా ఉండాలి. వెలుతురుకు అడ్డుపడేలా డెకరేషన్ ఉండకూడదు. కిటికీలకు డార్క్ కర్టెన్స్ వేయకూడదు. ఇంట్లో అన్ని ప్రదేశాల్లో వెలుతురు సమంగా ఉండేలా ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- హాల్‌లో గోడకు పెయింటింగ్స్ వేలాడదీసుకుంటే ఆకర్షణీయంగా ఉంటుంది. అలా అని మొత్తం గోడను పెయింటింగ్స్‌తో నింపకూడదు.
- ఇండోర్ ప్లాంట్స్‌తో ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కూడా చేకూరుతాయి.



- ఈ మధ్య కాలంలో ఇంట్లో ఒక్కో గదిలో గోడలకు రకరకాల రంగులు వేస్తున్నారు. అయితే వీటి ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. హాల్‌లో లేత రంగులు వేయాలి. పడకగదిలో ఒక గోడకు మాత్రమే భిన్నమైన రంగును ఎంచుకోవాలి. కళ్లకు హాయినిచ్చే రంగులను ఎంచుకోవడం ఉత్తమం.
- ప్రధాన ద్వారం పక్కన స్థలం ఉంటే కొన్ని మొక్కలను ఏర్పాటు చేసుకోవచ్చు. వాటి మధ్యలో బుద్ధుని విగ్రహం చిన్నది పెట్టుకుంటే సూపర్బ్‌గా ఉంటుంది.
- బాల్కనీలో మొక్కలతో పాటు సాయంకాలం కూర్చునేందుకు అనువుగా కుర్చీలు ఏర్పాటు చేసుకుంటే టీ టైమ్‌ని ఎంజాయ్ చేయవచ్చు.
- మీపై బాగా ప్రభావం చూపిన కొటేషన్‌ను గదిలో ఒక చోట గోడపై ఫ్రేమ్ చేయించి పెట్టుకోవచ్చు. రోజూ అది మీలో స్ఫూర్తిని నింపుతూ ఉంటుంది.

న్యూస్ మేకర్



పరుగు పందేలకు వయసుతో పని లేదని నిరూపించారు హైదరాబాద్‌కు చెందిన **సుంకర మల్లీశ్వరి, కృతి కడాకియా.** జాతీయ స్థాయిలో పతకాలను గెలుచుకున్న ఈ వనితలు, తాజాగా స్వీడన్ గోథెన్‌బర్గ్‌లో జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. 45, 47 ఏళ్ల ఈ పరుగుల రాణులు 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

నడి వయసు పరుగుల రాణులు

"మాది కాకినాడ దగ్గర ఆర్యవటం. అది ఇసుక ప్రాంతం. ఆ ఇసుక నేల మీదే, నాన్నతో పొలానికీ, అమ్మతో గుడికీ పరుగులు పెట్టేదాన్ని. అలా చిన్నప్పటి నుంచీ ఇసుకలో పరుగులు పెట్టడం వల్లనేమో, పరుగు చాలా సులువైపోయింది. ఏమాత్రం ఆయాస పడకుండా, సునాయాసంగా పరుగులు పెట్టడం అలవాటైపోయింది. బడిలో, ఎన్‌సిసిలో చురుగ్గా ఉండే నేను, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పైచేయి సాధిస్తూ, అంతిమంగా 1993లో జాతీయ స్థాయి పరుగు పోటీలో తొలి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాను. అది మర్చిపోలేని అనుభవం. అక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగే సమయంలోనే నాకు పెళ్లైపోయింది. దాంతో పరుగుకు బ్రేక్ పడింది. అలా ఏకంగా 20 ఏళ్ల పాటు పరుగుకు దూరంగా ఉండిపోయాను. పిల్లలిద్దరూ ఎదిగిన తర్వాత, కొవిడ్‌కు ముందు, మళ్లీ నేను గ్రౌండ్‌లోకి అడుగు పెట్టి, నాలోని క్రీడాకారిణిని నిద్ర లేపాను. అలా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. రెండో ఇన్నింగ్స్‌లో 6 జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. అన్ని పోటీల్లో స్వర్ణ పతకాలనే సాధించాను. 100, 200, 400 మీటర్ల స్ప్రింట్‌లో పాల్గొంటూ ఉంటాను. అలాగే రిలేల్లో కూడా పాల్గొంటూ ఉంటాను. గత ఆగస్టులో, స్వీడన్‌లో, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న పోటీల్లో 100, 200, 400 మీటర్ల పరుగు పందెంతో పాటు, 100, 4x400 రిలే పోటీల్లో కూడా పాల్గొన్నాను.



క్రీడాస్ఫూర్తి చెక్కుచెదరలేదు

తొలి 50 ర్యాంకుల్లో...

35 నుంచి 100 ఏళ్ల వయస్కుల కోసం ఉద్దేశించిన పోటీలే.. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్. ఈ పోటీల్లో మెడల్స్ కంటే అంతర్జాతీయ ర్యాంకింగ్ ప్రధానం. ఈ పోటీల్లో, రిలేలో 5, 7వ స్థానాలను పొందగలిగాను. వ్యక్తిగతా పోటీల్లో 30, 42, 46 ర్యాంకులు సాధించాను. ఈ ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో తెలంగాణా నుంచి 129 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మరీ ముఖ్యంగా దశాబ్దాల అనుభవమున్న ప్రపంచవ్యాప్త క్రీడాకారులు, ఒలింపిక్ విజేతలు లాంటి హేమాహేమీలు ఈ పోటీల్లో పాల్గొంటారు కాబట్టి గెలుపు కష్టమే! అయినా ఈ పోటీల్లో పాల్గొనే అర్హత పొందడమే మహా అదృష్టంగా భావిస్తూ ఉంటాం. మరో రెండేళ్లలో జరగబోయే అంతర్జాతీయ పోటీల్లో కచ్చితంగా స్వర్ణ పతకం గెలవాలనే పట్టుదలతో సాధన చేస్తున్నాను.

పట్టుదలే ప్రధానం

సాధారణంగా మహిళలు పెళ్లి, పిల్లల తర్వాత కెరీర్‌కు గుడ్‌బై చెప్పేస్తూ ఉంటారు. కానీ పెళ్లి , ఆ తర్వాత రెండు సిజేరియన్లు, పిల్లల పెంపకంతో 20 ఏళ్ల పాటు పూర్తిగా ఇంటికే పరిమితమైపోయినా, నాలో క్రీడాస్ఫూర్తి చెక్కుచెదరలేదు. సమయం కలిసి రాగానే మళ్లీ పరుగుకు పదును పెట్టాను. నా ఎదుగుదల వెనక మా వారు లక్ష్మణ్ మూర్తి, పిల్లల ప్రోత్సాహం కూడా లేకపోలేదు. మా వారిది కన్‌స్ట్రక్షన్ కంపెనీ. బాబు ఇంటర్ చదువుతున్నాడు. పాప 8వ తరగతి. బాబు కరాటెలో జాతీయ స్థాయికి ఎదిగాడు. పాప పరుగు పందేల్లో రాణిస్తోంది. నేనిప్పటివరకూ 38 నుంచి 40 స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు సాధించాను. పాల్గొన్న ప్రతి పోటీలో పతకం గెలవడం నా లక్ష్యం. మరో రెండేళ్లలో జరగబోయే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను.

- సుంకర మల్లీశ్వరి

"వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 45 నుంచి 49 ఏళ్ల విభాగంలో పాల్గొన్నాను. నా వయసు 47. మాది ముంబయి అయినా, 26 ఏళ్ల క్రితమే పెళ్లి చేసుకుని, హైదరాబాద్ వలస వచ్చేశాను. 2016 నుంచి ఫ్రీల్యాన్స్ ఇంటీరియర్ డిజైనర్‌గా వృత్తి జీవితాన్ని కొనసాగిస్తూనే, క్రీడాకారిణిగా కూడా రాణిస్తున్నాను. 2015లో 10, 21 వేల కిలోమీటర్ల మారథాన్స్‌లో పాల్గొన్నాను. 400, 800, 1500 మీటర్ల పరుగు పందేల్లో కూడా రాణించాను. జాతీయ పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలను గెలుచుకున్నాను. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ నా తొలి అంతర్జాతీయ ఈవెంట్. దీన్లో 800 మీటర్ల మొట్టమొదటి పోటీ, స్వీడన్‌లోని న్యూ ఉల్లేవి ఒలింపిక్ స్టేడియంలో జరిగింది. ఆ పోటీలో నేను మునుపటి కంటే

మెరుగ్గా రాణించగలిగాను

ఎంతో బాగా రాణించి, 12 సెకన్లు తక్కువ సమయంలోనే, 3:02 నిమిషాల్లోనే 800 మీటర్ల పరుగును ముగించి, ప్రపంచంలో 28వ ర్యాంకును పొందగలిగాను. తర్వాత జోర్ల్యాండా స్టేడియంలో 1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని, 19వ స్థానాన్ని దక్కించుకోగలిగాను. 4x400 రిలే పోటీల్లో మన భారతీయ జట్టు, 4 నిమిషాల 47 సెకన్లలోనే పోటీని పూర్తి చేసి, ప్రపంచ ర్యాంకింగ్‌లో ఆరవ స్థానంలో నిలిచింది. మా వారిది ఫార్మస్యూటికల్ వ్యాపారం. నాకిద్దరు అమ్మాయిలు. ఇద్దరూ విదేశాల్లో చదువుకుంటున్నారు. ఈ వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు గెలవకపోయినా, మరో రెండేళ్లలో జరగబోయే



పోటీల్లో భారత దేశం గర్వపడేలా పతకాలను గెలుచుకోవాలని ఆశిస్తున్నాను"

- కృతి కడాకియా

• గోగుమళ్ల కవిత

శ్రీశక్తి



మానసి... సక్సెస్‌కు మారుపేరు

130 ఏళ్ల చరిత్ర ఉన్న వ్యాపార సామ్రాజ్యం. తండ్రి చనిపోవడంతో మూడు పదుల వయసులో వ్యాపార బాధ్యతలను భుజానకెత్తుకోవాల్సి వచ్చింది. అయితే తన మీద ఉంచిన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయలేదు. సమర్థవంతమైన వ్యాపారవేత్తగా సంస్థను ప్రగతి పథంలో నడిపిస్తూ 'కిర్లోస్కర్ టాటా' సంస్థకు తగిన వారసురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమే మానసి కిర్లోస్కర్ టాటా. కిర్లోస్కర్ వంశంలో ఐదో తరానికి చెందిన మానసి విశేషాలు ఇవి...

కిర్లోస్కర్ గ్రూపు సంస్థలకు అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ ఉంది. దేశీయంగా అగ్రగామి సంస్థలుగా గుర్తింపు పొందిన వాటిల్లో కిర్లోస్కర్ ఒకటి. 2022 వరకు విక్రమ్ కిర్లోస్కర్ వ్యాపార బాధ్యతలను చూసుకునే వారు. 64 ఏళ్ల వయసులో ఆయన గుండెపోటుతో చనిపోయారు. దాంతో వ్యాపార నిర్వహణ బాధ్యతలు ఆయన కూతురు మానసి భుజానకెత్తుకుంది. 1990లో జన్మించిన మానసి వ్యాపార బాధ్యతలు చేపట్టాక సంస్థ గణనీయమైన విజయాలు సాధించింది. అయినా మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు మానసి పెద్దగా ఆసక్తి చూపరు. కుటుంబ గౌరవాన్ని,



వ్యాపార వారసత్వాన్ని నిలబెట్టేందుకు ఆమె ఎప్పుడూ కష్టపడుతుంటారు. రతన్ టాటా సవతి సోదరుడు అయిన నోయల్ టాటా కుమారుడు నెవిల్లే టాటాను 2019లో ఆమె వివాహం చేసుకున్నారు. అలా టాటా మనవరాలిగా మారిపోయారు. ఈ వివాహంతో రెండు అగ్రశ్రేణి వ్యాపార కుటుంబాల మధ్య బంధుత్వమే కాకుండా ఆశయాలను, లక్ష్యాలను సాధించేందుకు కలిసి పని చేసే అవకాశం దక్కింది. మానసి తల్లి గీతాంజలి కిర్లోస్కర్ కిర్లోస్కర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

బాధ్యతలు చేపట్టాక...

మానసి చదువంతా విదేశాల్లోనే జరిగింది. అమెరికాలోని రోడ్ ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో ఆమె ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. తండ్రి తరువాత కిర్లోస్కర్ సిస్టమ్స్ జాయింట్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా నియమించబడ్డారు. అంతేకాకుండా టయోటా ఇంజన్ ఇండియా లిమిటెడ్, కిర్లోస్కర్ టయోటా టెక్స్‌టైల్ ప్రైవేట్ లిమిటెడ్, టయోటా మెటీరియల్ హ్యాండ్లింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెనో కిర్లోస్కర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. సంస్థలను విజయపథంలో నడిపించేందుకు ఆమె చాలా కష్టపడ్డారు. టయోటా కిర్లోస్కర్ మోటార్ విభాగంలో మూడేళ్ల పాటు శిక్షణ తీసుకున్నారు. అక్కడే టెక్నికల్ ప్రొసీజర్లు, తయారీ, జపనీస్ వర్క్ కల్చర్, క్వాలిటీ కంట్రోల్ టెక్నిక్స్, కమర్షియల్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో పట్టు సాధించారు. సంస్థ బాధ్యతలు చేపట్టడానికి ముందే ఆమె పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. కిర్లోస్కర్ సంస్థ టయోటాతో కలిసి ఇన్నోవా, ఫార్చూనర్ కార్ల తయారీ, అమ్మకాలను ఇండియాలో నిర్వహిస్తోంది.

బిజీ లైఫ్‌లోనూ....

నిత్యం వ్యాపార నిర్వహణలో బిజీగా గడిపే మానసి తన హాబీలను నెరవేర్చుకునేందుకు సమయం కేటాయిస్తుంది. మానసి మంచి స్విమ్మర్. అడ్వెంచర్లు చేయడమంటే మానసికి చాలా ఇష్టం. పర్వతాలు అధిరోహించడం, డీప్ సీ డైవింగ్, టెన్నిస్, వాటర్ స్పోర్ట్స్‌ను ఇష్టపడతారు. అలాగే ఆర్ట్ గ్యాలరీలను, హిస్టారికల్ సైట్స్‌ని, మ్యూజియంలను సందర్శించేందుకు అమితాసక్తి కనబరుస్తుంటారు. కేరింగ్ విత్ కలర్ అనే స్వచ్ఛంద సంస్థతో కలసి ఆమె పని చేస్తున్నారు. ఈ సంస్థ మన దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య మెరుగవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. అంతేకాకుండా మానసి మంచి పెయింటర్ కూడా. ఆమె వేసిన చిత్రాలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శనకు కూడా పెట్టారు.

కొత్త తరాన్ని ప్రకృతికి చేరువ చెయ్యడం, మొక్కలు, జంతువులు, పక్షుల్లోని వైవిధ్యాన్ని పరిచయం చెయ్యడం, వాటి సంరక్షణ మన బాధ్యత అని గుర్తించేలా చెయ్యడం... ఈ లక్ష్యాలతో సాయిదేవి సంజీవిరాజా చేపట్టిన ప్రయత్నం... వేలాది పిల్లలకు చేరువై, వారిలో స్ఫూర్తి నింపుతోంది. "ప్రకృతి విలువ పిల్లకు తెలియాలి. వాళ్లకు దానిపట్ల ఆసక్తి, ఆపేక్ష కలిగించాలి. అప్పుడే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సాధ్యం" అంటున్న సాయిదేవి గురించి ఆమె మాటల్లోనే...

కొత్త తరానికి ప్రకృతి పాఠాలు



"మా ఊరుకు కొద్ది దూరంలో అడవి. ఇక మా బడి పరిసరాలైతే జూపార్క్ మాదిరిగా ఉండేవి. పక్షులు, జంతువులు, ఆహ్లాదమైన ప్రకృతి... వీటి మధ్య నా బాల్యం ఆడుతూ పాడుతూ సాగింది. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో వన్యప్రాణుల అభయారణ్యం ఉంది. దానికి సమీపంలోని రాజాపాళ్యం మా ఊరు. అక్కడ మా స్కూలు దాదాపు 30 ఎకరాల్లో విస్తరించి ఉండేది. అందులో నెమళ్ళు, ఊసరవెల్లులు, పునుగు పిల్లులు, ఇంకా ఎన్నో జంతువులు, పక్షులు పుష్కలంగా ఉండేవి. అప్పుడప్పుడు పాములు కూడా కనిపించేవి. మా బడిలోనే మా అమ్మ టీచర్. కొన్నిసార్లు నాకు సెలవున్నా... అమ్మ స్కూల్‌కి వెళ్ళాల్సి వచ్చేది. అమ్మతో నేనూ వెళ్ళేదాన్ని. పాఠాలు లేవు కాబట్టి... నాకు నచ్చినట్టు ఆ పరిసరాల్లో తిరిగేదాన్ని. మాది చిన్న పట్టణం. పెద్దగా వినోదాలేవీ ఉండేవి కావు. ఖాళీ సమయం పుష్కలంగా ఉండేది. నేను, నా ఫ్రెండ్స్ చేసిన సాహసాలకు లెక్కలేదు. నేచురలిస్ట్ అవ్వాలనుకున్నా. కానీ... ఇంట్లో వాళ్ళ ఒత్తిడితో... ఎంబీఏ చదివాను.

ఆ ధ్యాస పెద్దల్లోనే లేదు...

చదువు పూర్తి చేశాక... బెంగళూరు వచ్చాను. అక్కడ... కర్ణాటకలోని ఎలిఫెంట్ కారిడార్స్ సంరక్షణ కోసం పాటుపడుతున్న ఒక సైంటిస్ట్‌తో పని చేసే అవకాశం వచ్చింది. ఆ సమయంలోనే 'నేచర్ వాక్స్' నిర్వహించడం ప్రారంభించాను. మళ్ళీ నాకు బాల్యంలోకి అడుగు పెట్టినట్టనిపించింది. నాకు ప్రకృతిలో నడక, రకరకాల జాతుల పక్షుల్ని గుర్తించడం ఎంతో ఇష్టం. కానీ చుట్టూ ఎంతో ప్రకృతి ఉన్నా... పిల్లల్లో ఆ ఆసక్తి నాకు కనిపించలేదు. ప్రతిదీ గమనిస్తూ, ఎప్పుడూ ప్రశ్నిస్తూ, అన్నీ తెలుసుకోవాలనే తపన పిల్లల్లో కొరవడితే... అది వారి వికాసానికి అవరోధంగా మారుతుంది. వాళ్ళు ప్రశ్నలు వేసి, సమాధానాలు కోరే వాతావరణాన్ని తల్లితండ్రులు, టీచర్లు కల్పించాలి. అయితే పోటీ చదువుల్లో పడిన పిల్లలకు... బడి వేళల తరువాత మరే యాక్టివిటీ ఉండదు. ఇంటికి వెళ్ళి మళ్ళీ పాఠాలు చదవడం, హోమ్ వర్క్ చేసుకోవడం, లేదా గాడ్జెట్స్ చూసుకోవడం. దీంతో ప్రకృతితో కానీ, అవుట్‌డోర్ యాక్టివిటీస్‌తో కానీ వాళ్ళకు ఎలాంటి సంబంధం ఉండదు. మరొక వైపు అడవులు అంతరించి పోతున్నాయి. ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయి. ప్రకృతిని కాపాడుకోవాలనే ధ్యాస పెద్దల్లోనే కనిపించడం లేదు. కనీసం రాబోయే తరమైనా దీన్ని పట్టించుకోకపోతే... ఎడారులు తప్ప మరేం మిగలవు. దీనికి పరిష్కారం ఏమిటని ఆలోచించాను. 2000లో... కరోనా విజృంభణకు కాస్త ముందు... బెంగళూరులోని కబ్బన్ పార్కులో పిల్లల కోసం ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాను. ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల



ద్వారా, ఆ నోటా ఈనోటా తెలుసుకొని... కేవలం ఏడుగురు పిల్లలు మాత్రం దానికి హాజరయ్యారు. చెట్లు, పక్షులు, జంతువుల గురించి వాళ్ళకు ఎన్నో విషయాలు చెప్పాను. 'ఎందుకు', 'ఎలా', 'ఏమిటి'? అని వాళ్ళు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం నాకు ఆనందం కలిగించింది.

50 స్కూళ్ళు 50 పార్కుల భాగస్వామ్యం...

ఆ తరువాత వాళ్ళు మరికొందరు పిల్లలకు ఈ సంగతి చెప్పారు. వారు కూడా తదుపరి కార్యక్రమాలకు రావడానికి ఆసక్తి చూపించారు. ఇంతలోనే కరోనా వచ్చింది. దీంతో... ఆన్‌లైన్ సెషన్స్ పెట్టాలని వాళ్ళు కోరారు. దీని కోసం ఒక ప్రణాళిక రూపొందించాను. స్టోరీ టెల్లింగ్, చర్చా కార్యక్రమాలను నిపుణుల భాగస్వామ్యంతో నిర్వహించాను. అలాగే పూర్తిగా ప్రకృతి సంబంధమైన అంశాల ఆధారంగా కథలు రాశాను, సెషన్స్ ఏర్పాటు చేశాను. పిల్లల ఉత్సాహం చూసి.. తల్లితండ్రులు కూడా నన్ను సంప్రతించారు. నా ప్రయత్నానికి మద్దతు ఇచ్చారు. 'థికెట్ టేల్స్' ఏర్పాటుకు అది దారి తీసింది. 'థికెట్ టేల్స్' ప్రకృతి ఆధారమైన ఒక విద్యా సంస్థ. ఉత్తేజం కలిగించే అనుభవాల ద్వారా పిల్లలను ప్రకృతికి అనుసంధానం చేయడం కోసం ఇది పని చేస్తుంది. లాక్‌డౌన్ తరువాత... మళ్ళీ ఆఫ్‌లైన్ సెషన్స్ మొదలుపెట్టాను. 'లెర్న్ ఎరౌండ్ నేచర్' అనే ప్రోగ్రామ్‌ను 'థికెట్ టేల్స్' నిర్వహిస్తోంది. ఇది తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు చెందిన ఆరు, ఏడు ఎనిమిది తరగతుల విద్యార్థుల కోసం. ప్రకృతితో మమేకమయ్యే అనుభవాలు, నేచర్ వాక్స్, చర్చలు, దృశ్యరూపంలో సైన్స్, సోషల్ సైన్స్‌ను వారికి వివరించడం, బృంద కార్యకలాపాలు దీనిలో భాగాలు. ఇది ఏడాది పాటు... ప్రతి వారం ఎనభై నిమిషాలు ఉండే ప్రయోగాత్మకమైన కార్యక్రమం. 'గ్రీన్‌జెన్ ఎక్స్‌ప్లోరర్స్' అనే మరో కార్యక్రమం కింద పిల్లలను జీవ వైవిధ్యం కలిగిన పార్కులకు తీసుకువెళ్ళి, శాస్త్రీయంగా, ప్రయోగాత్మకంగా వివిధ అంశాలను వివరిస్తున్నాం. మొక్కలు, పక్షులు, జంతువులు.. వాటిలో వైవిధ్యం, వాటి లక్షణాలు, తీసుకొనే ఆహారం, ప్రత్యేకతలు, వాటిని సంరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇలా అనేక విషయాలు వీటిలో ఉంటాయి. ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం బెంగళూరులోని యాభై స్కూళ్ళు, యాభై పార్కులు, కొన్ని వేల మంది పిల్లలు భాగస్వాములు.

'ఇదంతా నాన్సెన్స్' అన్నారు...

ప్రస్తుతం మా సంస్థలో ఇద్దరు ఫుల్ టైమ్ ఫెసిలిటేటర్లు, శిక్షణ పొందిన బయాలజిస్ట్, సైన్స్ కమ్యూనికేటర్, ఒక అకడమిక్ డైరెక్టర్ ఉన్నారు. మా కార్యక్రమాలన్నీ పూర్తిగా ఉచితమే. దాతలు ఇచ్చే విరాళాలతోనే నిర్వహణ సాగుతోంది. స్కూళ్ళకు ఈ కాన్సెప్ట్ వివరిస్తే... మొదట్లో 'ఇదంతా నాన్సెన్స్' అన్నవాళ్ళు, "నాలుగు రోజుల్లో ఆపేస్తార్లే!" అని నిరాశపరుస్తూ మాట్లాడినవాళ్ళు ఉన్నారు. కానీ ఇప్పుడు ఎంత ఆదరణ లభిస్తోందంటే... వారంలో ఏ రోజూ ఖాళీ ఉండడం లేదు. నేను ఇదంతా చెయ్యడానికి కారణం కేవలం ప్రకృతి, జంతుజాలం పట్ల నాకున్న అభిమానం మాత్రమే కాదు... మనిషిగా ఇది నా బాధ్యత. ప్రకృతిని మనం సృష్టించలేం. కాబట్టి దాని నుంచి ప్రయోజనాలు పొందాలి తప్ప దాన్ని నాశనం చెయ్యకూడదు. అలా జరగాలంటే... ప్రకృతి విలువ రాబోయే తరాలకు తెలియాలి. వాళ్ళకు దానిపట్ల ఆసక్తి, ఆపేక్ష కలిగించాలి. అవే ఆ తరువాత బాధ్యతగా మారుతాయి. అప్పుడే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. నా ప్రయత్నమంతా ఆ దిశగానే. రాబోయే రోజుల్లో వెయ్యికి పైగా పాఠశాల పిల్లలకు ప్రకృతి పాఠాలు చెప్పాలి. వారిలో కొందరినైనా ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలి. ఇదీ నా లక్ష్యం."

> **"అమ్మతో నేనూ వెళ్ళేదాన్ని, పాఠాలు లేవు కాబట్టి... నాకు నచ్చినట్టు ఆ పరిసరాల్లో తిరిగేదాన్ని. మాది చిన్న పట్టణం. పెద్దగా వినోదాలేవీ ఉండేవి కావు. ఖాళీ సమయం పుష్కలంగా ఉండేది. నేను, నా ఫ్రెండ్స్ చేసిన సాహసాలకు లెక్కలేదు. నేచురలిస్ట్ అవ్వాలనుకున్నా. కానీ... ఇంట్లో వాళ్ళ ఒత్తిడితో... ఎంబీఏ చదివాను."**

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్నవెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళలపైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు.. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యాజ్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణులతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

ఎన్ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

అడ్మిషన్స్

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

బిజినెస్

వరంగల్ ● గురువారం 19 సెప్టెంబరు 2024

ఫెడ్ రేటు తగ్గిందోచ్..

0.50% తగ్గింపుతో శ్రీకారం

నాలుగేళ్లలో ఇదే తొలిసారి

4.75-5 శాతానికి తగ్గిన ప్రామాణిక వడ్డీ రేట్ల శ్రేణి


జెరోమ్ పావెల్

న్యూయార్క్: అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' ప్రామాణిక వడ్డీ రేట్ల తగ్గింపుపై గత కొన్ని నెలలుగా ప్రపంచ మార్కెట్లో కొనసాగుతున్న చర్చకు ఎట్టకేలకు తెరపడింది. బుధవారంతో ముగిసిన పరపతి సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేటును మెజారిటీ విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా అర(0.50) శాతం తగ్గించింది. దాంతో ప్రామాణిక వడ్డీ రేట్ల శ్రేణి 23 ఏళ్ల గరిష్ఠ స్థాయి 5.25-5.50 శాతం నుంచి 4.75-5.0 శాతానికి తగ్గింది. ఫెడ్ రేట్లు తగ్గడం నాలుగేళ్లలో(2020 తర్వాత) ఇదే తొలిసారి. కొవిడ్ సంక్షోభం తర్వాత కూడా ఇదే తొలి వడ్డీ రేట్ల తగ్గుదల. ఇక దేశ ఆర్థిక వృద్ధితోపాటు జాబ్ మార్కెట్‌కు ఊతమిచ్చేలా ముస్ముందు సమీక్షల్లో వడ్డీ రేట్లను మరింత తగ్గిస్తామని ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. ఈ ఏడాది చివరి నాటికి మరో అర శాతం కోత పెట్టడంతోపాటు వచ్చే ఏడాదిలో ఒక శాతం తగ్గించే అవకాశాలున్నాయంది. 2026లో మరో 0.50 శాతం తగ్గించే అవకాశాలున్నాయి. కాగా, ఫెడ్ రిజర్వ్ బాటలోనే మరిన్ని దేశాల సెంట్రల్ బ్యాంక్‌లూ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఫెడ్ రేటు తగ్గింపు వార్త వెలువడిన వెంటనే అమెరికన్ మార్కెట్లు భారీగా పుంజుకుంది. డౌజోన్స్ ఒకదశలో 375 పాయింట్ల వరకు ఎగబాకింది. గురువారం ప్రపంచ మార్కెట్లు కూడా పాజిటివ్‌గా స్పందించనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది.

రెపో తగ్గకపోవచ్చు

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

ఆహార ధరల ద్రవ్యోల్బణం తగ్గుదలపై ఇంకా అనిశ్చితి తొలగకపోవడంతో ఈ ఏడాదిలో ఆర్‌బీఐ ప్రామాణిక వడ్డీ (రెపో) రేటును తగ్గించకపోవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఫెడరల్ రిజర్వ్ నాలుగేళ్లకు పైగా కాలం తర్వాత తొలిసారిగా ప్రామాణిక వడ్డీ రేటును తగ్గించింది. దాంతో మిగతా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు కూడా వడ్డీ రేట్ల కోతకు శ్రీకారం చుట్టవచ్చన్న అంచనాలున్నాయి. అయితే, ఈ విషయంపై శెట్టి కొంత భిన్నంగా స్పందించారు. "వడ్డీ రేట్ల విషయంలో చాలా సెంట్రల్ బ్యాంక్‌లు దేశీయ పరిస్థితులకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటున్నాయి. ఫెడ్ రేట్ల తగ్గింపు అందరినీ ప్రభావితం చేయనున్నప్పటికీ, ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకునే రెపో రేటు పై నిర్ణయం తీసుకోనుందని మేం భావిస్తున్నాం. ఈ ఏడాదిలో రెపో రేటు తగ్గింపు ఉండకపోవచ్చని అనుకుంటున్నాం. వచ్చే ఏడాది మార్చి త్రైమాసికం వరకు వేచి చూడాల్సి రావచ్చ"ని శెట్టి అన్నారు.

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్‌లో 'కేర్' విలీనం!

తుది దశకు చేరిన చర్చలు

ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్లాక్‌స్టోన్, టీపీజీ సంస్థల నిర్వహణలోని కేర్ హాస్పిటల్ రివర్స్ మెర్జర్‌కు సిద్ధమవుతోంది. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్ అనే లిస్టెడ్ కంపెనీలో విలీనమయ్యేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ రెండు సంస్థల ఈక్విటీల్లోనూ బ్లాక్‌స్టోన్ పీఈ సంస్థకు మెజారిటీ వాటా ఉంది. ఈ చర్చలు ఫలిస్తే అపోలో హాస్పిటల్స్, మణిపాల్ హాస్పిటల్స్ తర్వాత ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్ దేశంలో అత్యధిక పడకలు ఉన్న మూడో అతిపెద్ద హాస్పిటల్ చైన్ అవుతుంది. ప్రస్తుతం కేర్ హాస్పిటల్ ఈక్విటీలో బ్లాక్‌స్టోన్‌కు 73 శాతం, టీపీజీ గ్రూప్‌నకు 27 శాతం వాటా ఉంది. కేర్ హాస్పిటల్ ప్రస్తుతం భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌లోనూ హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హెల్త్) కూడా కేర్ అనుబంధ సంస్థగానే పనిచేస్తోంది. ఈ హాస్పిటల్ ఈక్విటీలో మెజారిటీ వాటాను బ్లాక్‌స్టోన్ సంస్థ గత ఏడాది అక్టోబరులో కొనుగోలు చేసింది.

రికార్డు గరిష్ఠాల నుంచి నష్టాల్లోకి..

సెన్సెక్స్ 131 పాయింట్లు పతనం.. ఐటీ రంగ షేర్లలో లాభాల స్వీకరణ

ఫెడ్ పరపతి సమీక్ష నేపథ్యంలో ఈక్విటీ మదుపరుల అప్రమత్తత

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు బుధవారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకినప్పటికీ, మధ్యాహ్నం నుంచి యూటర్న్ తీసుకున్నాయి. చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ఐటీ రంగ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కాగా, బ్యాంకింగ్, ఆర్థిక సేవల షేర్లలో కొనుగోళ్లు నష్టాలను పరిమితం చేశాయి. ఒక దశలో సెన్సెక్స్ 246.72 పాయింట్లు ఎగబాకి 83,326.38 వద్ద, నిఫ్టీ 63.65 పాయింట్ల వృద్ధితో 25,482.20 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 131.43 పాయింట్ల నష్టంతో 82,948.23 వద్ద, నిఫ్టీ 41 పాయింట్లు కోల్పోయి 25,377.55 వద్ద స్థిరపడ్డాయి.

సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 నష్టపోయాయి. టీసీఎస్ 3.49 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ షేర్లూ 3 శాతానికి పైగా క్షీణించాయి. టెక్ మహీంద్రా 2.79 శాతం పతనమైంది.

ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9 లక్షల కోట్లు

ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఒక దశలో 2 శాతం ఎగబాకి ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.1,295కు చేరింది. చివరికి 1.55 శాతం లాభంతో రూ.1,288.05 వద్ద ముగిసింది. తాజా ర్యాలీలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14,921 కోట్ల పెరుగుదలతో రూ.9,07,391.45 కోట్లకు చేరుకుంది. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.9 లక్షల కోట్ల మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్లో ఐదో అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతోంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్ల ఐపీఓ

దేశంలో అతిపెద్ద విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం 'ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ' పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.10,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి కంపెనీ ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.7,500 కోట్లను రుణాల తిరిగి చెల్లింపుల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపింది. మిగతా నిధులను వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోనుంది. ఈ ఆగస్టు నాటికి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ 3,071 మెగావాట్ల సోలార్, 100 మెగావాట్ల పవన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

తెలంగాణలో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ

రూ.204 కోట్ల పెట్టుబడితో శామీర్‌పేటలో ఏర్పాటు: హెరిటేజ్ ఫుడ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఐస్‌క్రీమ్స్ ఉత్పత్తి కోసం కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేటలో రూ.204 కోట్ల పెట్టుబడితో ఈ కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనుంది. బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకుంటారు. వచ్చే ఏడాది నవంబరుకల్లా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. తెలంగాణ ప్రాంతంలో ఐస్‌క్రీమ్స్‌కు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.

బెంగళూరుకు యశోద హాస్పిటల్

రూ.344 కోట్లతో 4.5 ఎకరాల కొనుగోలు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న యశోద హాస్పిటల్ తన కార్యకలాపాలను బెంగళూరుకు విస్తరిస్తోంది. ఇందుకోసం బెంగళూరు రింగ్ రోడ్డులోని సిల్క్ బోర్డు జంక్షన్ ప్రాంతంలో రూ.344 కోట్లతో 4.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అనేక ప్రముఖ కంపెనీల ఆఫీసులు ఉండే ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర అని భావిస్తున్నారు. తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉన్న బెంగళూరు రియల్ ఎస్టేట్ కంపెనీ ఓజోన్ గ్రూప్ నుంచి యశోద హాస్పిటల్ ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో ఓజోన్ గ్రూప్ 12 లక్షల ఎస్ఎఫ్‌టీలో భవనాలు నిర్మించి యశోద హాస్పిటల్‌కు అప్పగిస్తుంది. యశోద హాస్పిటల్ ఇందుకు మరిన్ని నిధులు సమకూరుస్తుంది. అయితే ఈ భూమి కొనుగోలు వార్తలపై యశోద హాస్పిటల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

త్వరలో రెనో నిస్సాన్ కొత్త కారు

చెన్నై: ఫ్రెంచి, జపాన్ ఆటో దిగ్గజాల అలయెన్స్ రెనో నిస్సాన్ ప్లాట్‌ఫామ్‌పై రెండు విద్యుత్ కార్లు సహా ఆరు కొత్త కార్ల తయారీ కార్యకలాపాలు అనుకున్న ప్రణాళిక ప్రకారం సంతృప్తికరంగానే సాగుతున్నట్టు రెనో ఇండియా కంట్రీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ మామిళ్లపల్లి వెంకట్రామ్ అన్నారు. ఈ కార్ల ఉత్పత్తిపై రెనో నిస్సాన్ జాయింట్ వెంచర్ రూ.5,300 కోట్లు పెట్టుబడి పెడుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రెనో నిస్సాన్ ఈ పెట్టుబడిని ప్రకటించాయి. ఆ మొత్తంలో 70 నుంచి 80 శాతం ఇప్పటికే పెట్టుబడి పెట్టినట్టు ఆయన చెప్పారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు కింద కొత్త కారు విడుదల ప్రకటన వింటారని రెనో నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్ కార్ల విడుదల కార్యక్రమానికి హాజరైన విలేకరులకు ఆయన తెలిపారు. అయితే కొత్త కారు ఎప్పుడు విడుదల చేయబోయేది చెప్పడానికి ఆయన నిరాకరించారు. బుధవారం విడుదల చేసిన లిమిటెడ్ ఎడిషన్ కింద కేవలం 1,600 కార్లు ఉత్పత్తి చేస్తామని, ఎవరు ముందొస్తే వారికి అనే ప్రాతిపదికన వాటిని విక్రయిస్తామని వెంకట్రామ్ చెప్పారు. కస్టమర్ల స్పందన బాగున్నట్టయితే మరిన్ని కార్లు తయారుచేసే విషయం పరిశీలించనున్నట్టు తెలిపారు. లిమిటెడ్ ఎడిషన్ క్విడ్ కారు ధర రూ.4,99,500 కాగా లిమిటెడ్ ఎడిషన్ ట్రైబర్ ధర రూ.7 లక్షలని, కైగర్ ధర రూ.6,74,990 అని ఆయన వెల్లడించారు.

1సోషన్ గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వింజో.. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా టాలెంట్ మెంటార్‌షిప్ ప్రొగ్రామ్, బ్యాటిల్ ఆఫ్ సూపర్ స్కాలర్స్ (బీఓఎస్ఎస్)ను ప్రారంభించింది. సాంకేతిక ఆవిష్కరణలకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించటంతో పాటు ఐపీ ఎగుమతి ఆధారిత రంగ వృద్ధిని పెంచటం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని వింజో వెల్లడించింది.

1బెంగళూరుకు చెందిన ఫ్యాషన్, ఫైన్ క్లాతింగ్ బ్రాండ్ పీఎన్ రావు.. హైదరాబాద్‌లో తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించింది. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌తో దక్షిణాదిలో మొత్తం స్టోర్స్ సంఖ్య ఎనిమిదికి చేరిందని తెలిపింది. రానున్న రోజుల్లో మరిన్ని స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం పీఎన్ రావు బ్రాండ్ బెంగళూరులో ఐదు, చెన్నైలో రెండు స్టోర్స్‌ను నిర్వహిస్తోంది.

1ఇసుజు మోటార్స్.. మార్కెట్లోకి సరికొత్త డీ-మాక్స్ కమర్షియల్ వాహన శ్రేణిని తీసుకువచ్చింది. 1.7 క్యాబ్ చాసిస్ స్టాండర్డ్ మోడల్‌తో కూడిన డీ-మాక్స్.. వినియోగదారుల వ్యాపార అవసరాలను పూర్తిగా తీర్చనుంది. 2.5 లీటర్ ఇసుజు 4జేఏ1 ఇంజన్‌తో కూడిన డీ-మాక్స్ పరిచయ ధర రూ.9,99,990 (చెన్నై ఎక్స్‌షోరూమ్).

1ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్).. అంతర్జాతీయం పేరొందిన బ్రాండ్ 'మాగ్నెలిస్'ను భారత మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఆర్సెలార్ మిట్టల్ పేటెంటెడ్ బ్రాండ్ అయిన మాగ్నెలిస్‌ను ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఇక్కడే ఉత్పత్తి చేయటంతో పాటు డిస్ట్రిబ్యూట్ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో స్పెషాలిటీ స్టీల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే భారం తగ్గుతుందని తెలిపింది.

1క్యాన్సర్ ఔషధాల మార్కెట్లో అరబిందో ఫార్మా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ రంగంలో మంచి పట్టున్న జీఎల్ఎస్ ఫార్మా ఈక్విటీలో మిగిలిన 49 శాతం వాటాను రూ.22.5 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది.

ఐఎస్‌బీ నుంచి 'పీజీపీ వైఎల్' కోర్సు

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) యంగ్ లీడర్స్ కోసం మరో సరికొత్త కోర్సు ప్రారంభించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ (పీజీపీ-వైఎల్) పేరుతో 20 నెలల కోర్సు ప్రవేశపెట్టింది. డిగ్రీ పూర్తి చేసి, రెండేళ్ల కనీస ఉద్యోగ అనుభవం ఉన్న నిపుణులు ఈ కోర్సుకు అర్హులు. ఈ 20 నెలల పీజీపీ-వైఎల్ కోర్సులో చేరిన అభ్యర్థులు తప్పనిసరిగా రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి ఈ కోర్సు ప్రారంభమవుతుంది.

రూ.2,000 కోట్ల టర్నోవర్ టార్గెట్


ప్యూర్ ఈవీ

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ప్యూర్ ఈవీ.. వచ్చే నాలుగేళ్లలో రూ.2,000 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం దేశీయ ద్విచక్ర ఈవీ విభాగంలో ప్యూర్ ఈవీ వాటా 65 శాతంగా ఉందని కంపెనీ సీఈఓ రోహిత్ వధేరా అన్నారు. ప్యూర్ ఈవీలో నాట్కో ఫార్మా ఫ్యామిలీ ఆఫీస్, లారస్ ల్యాబ్స్ ఫ్యామిలీ ఆఫీస్, హెచ్‌టీ వెంచర్స్, బీసీసీఎల్, యూఈపీఎల్, ఐ-టీఐసీ, ఐఐటీ హైదరాబాద్ సహా పలువురు ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టారు. కాగా వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకి వచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు రోహిత్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,730 ▼	68,500 ▼	96,000 ▼
ముంబై	73,257 ▼	67,103 ▼	87,406 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

స్పోర్ట్స్

భారత్‌కు బంగ్లా స్పిన్ 'పరీక్ష'

నేటి నుంచే తొలి టెస్ట్


రోహిత్

పంత్, రాహుల్‌కు చోటు! | **ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో**


బంగ్లా కెప్టెన్ షంటో

చెన్నై: వైట్‌బాల్ క్రికెట్‌లో బిజీబిజీగా గడిపిన భారత్.. సుమారు ఆరు నెలల తర్వాత టెస్టు మ్యాచ్ బరిలోకి దిగనుంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి జరిగే తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో రోహిత్ సేన తలపడనుంది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్న టీమిండియాకు బంగ్లా స్పిన్నర్ల నుంచి గట్టిసవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఇటీవలే పాకిస్థాన్‌ను వారి సొంతగడ్డపై 2-0తో చిత్తు చేసిన ఆత్మవిశ్వాసంతో ఉన్న బంగ్లా మరో సంచలనం సృష్టించాలనుకొంటోంది. అయితే, స్వదేశంలో భారత్‌ను ఓడించడం పాక్‌ను చిత్తు చేసినంత సులువు కాదన్న విషయం వారికీ తెలుసు. పైగా రోహిత్, కోహ్లీతోపాటు రిషబ్ పంత్ మళ్లీ జట్టులోకి రావడంతో భారత్ బలంగా కనిపిస్తోంది. 2015 నుంచి సొంతగడ్డపై టీమిండియా బ్యాటింగ్‌కు విరాట్ వెన్నెముకగా నిలుస్తున్నాడు. అయితే, 2021 నుంచి మాత్రం స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఆడలేక పోతున్నాడు. టీ20లకు గుడ్‌బై చెప్పిన కోహ్లీ.. ఈసారి మాత్రం అద్భుత ప్రదర్శనతో పరుగుల వరద పారించాలన్న పట్టుదలతో ఉన్నాడు. ఒకప్పుడు స్పిన్నర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించే రోహిత్ నుంచి ఆస్థాయి ప్రదర్శన కరువైంది. ఇక, మిడిలార్డర్‌లో రాహుల్‌కు చోటు ఖాయంగా కనిపిస్తోంది. ఎటువంటి బౌలింగ్‌నైనా రాహుల్ సమర్థవంతంగా ఎదుర్కోగలడు. కానీ, ఇటీవలి కాలంలో పెద్దగా ఫామ్‌లో లేకపోవడంతో అతడు క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా ఆడడం ఎంతో అవసరం. పంత్ ఎదురుదాడి గురించి పెద్దగా చెప్పనక్కర్లేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్, గిల్ కూడా మెలికలు తిరిగే బంతులను ఎదుర్కోవడంలో బోల్తా పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నెట్స్‌లో వీరు తన నైపుణ్యాలను మెరుగుపరచుకొనేందుకు శ్రమించారు. బౌలింగ్ విభాగానికొస్తే చెన్నై పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్, జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు తుది జట్టులో చోటు దక్కే చాన్సులున్నాయి. పేస్ భారాన్ని బుమ్రా, సిరాజ్ మోయనున్నారు. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ హయంలో ఇదే తొలి టెస్ట్ కావడంతో అతడికి ఈ మ్యాచ్ కీలకంగా మారింది.

అవకాశం కోసం బంగ్లా

మరోవైపు బంగ్లా కూడా అవకాశం చిక్కితే ఆతిథ్య జట్టుకు షాకివ్వాలనే కసితో ఉంది. పాక్‌పై సంచలన విజయంలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్లు మెహిదీహసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం మరోసారి అదే తరహా ప్రదర్శన కనబరచాలని జట్టు భావిస్తోంది. ఆల్‌రౌండర్ షకీబల్ హసన్‌కు భారత పిచ్‌లపై ఆడిన అనుభవం ఎంతో ఉంది. బ్యాటింగ్‌లో లిట్టన్ దాస్, కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షంటో, మోమినుల్ ఇస్లాం అండగా నిలుస్తున్నారు. మొత్తంగా చూస్తే భారత బ్యాటింగ్. బంగ్లా స్పిన్నర్లకు మధ్య ప్రధానంగా పోటీ జరిగే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, పంత్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

బంగ్లాదేశ్: షద్మన్ ఇస్లాం, జాకిర్ హసన్, నజ్ముల్ హొస్సేన్ షంటో (కెప్టెన్), మోమినుల్ ఇస్లాం, ముష్ఫికర్, లిట్టన్ దాస్ (వికెట్ కీపర్), షకీబల్, మెహిదీహసన్ మిరాజ్, టస్కిన్, హసన్ మెహమూద్, నహీద్ రాణా/తైజుల్.

పిచ్/వాతావరణం

ఎర్రమట్టి పిచ్ కావడంతో తొలిరోజు బౌన్స్ లభించినా.. పేసర్లు, స్పిన్నర్లకు సమంగా సహకరించొచ్చు. మ్యాచ్ సాగే కొద్దీ బంతి టర్న్ కావచ్చు. తొలిరోజు వర్షం ఆటంకం కలిగించొచ్చు. ఉదయం వాన కురిసే చాన్స్ 25 శాతం ఉండగా.. మధ్యాహ్నం 46 శాతంగా ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.



632 రోజుల తర్వాత

వికెట్ కీపర్ రిషబ్ పంత్ 632 రోజుల తర్వాత టెస్టుల్లోకి పునరాగమనం చేయనున్నాడు. 2022లో బంగ్లాతో అతడి చివరి టెస్ట్ ఆడాడు. ఆ తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ వేగంగా కోలుకొన్నాడు. రీఎంట్రీలో ఇప్పటి వరకు పరిమిత ఓవర్ల క్రికెట్ మాత్రమే ఆడాడు. యాదృచ్ఛికంగా మళ్లీ బంగ్లాపైనే ఆడనున్నాడు.

0 భారత్‌తో బంగ్లా ఇప్పటి వరకు 13 టెస్టులు ఆడినా ఒక్కసారి కూడా నెగ్గలేదు. టీమిండియా 11 మ్యాచ్‌లు గెలవగా.. రెండు డ్రాగా ముగిశాయి.

17 2012 నుంచి స్వదేశంలో ఆడిన 17 సిరీస్‌ల్లో టీమిండియాకు ఓటమన్నదే లేదు. గత 11 ఏళ్లలో సొంతగడ్డపై 40 మ్యాచ్‌లు నెగ్గిన భారత్.. నాలుగు మాత్రమే ఓడింది.

చైనా ఓపెన్‌లో మాళవిక సంచలనం



చాంగ్జౌ (చైనా): పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ నెంబర్ 7 గ్రెగోరియా (ఇండోనేసియా)కు భారత షట్లర్ మాళవిక బన్సోడ్ చైనా ఓపెన్‌లో షాకిచ్చింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో మాళవిక 26-24, 21-19తో గ్రెగోరియాను చిత్తు చేసింది. మాళవిక కెరీర్‌లో ఇదే అతి పెద్ద విజయం. మిగతా భారత షట్లర్లలో ఆకర్షి, సామియా, కిరణ్ జార్జ్, డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జోడీ, మిక్స్‌డ్‌లో సిక్కి-సుమిత్ జంట తొలిరౌండ్లోనే నిష్క్రమించారు.

ఎదురులేని మన జట్లు

చెస్ ఒలింపియాడ్‌లో ఏడో గెలుపు

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళలు, పురుషుల జట్లు అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్నాయి. వరుసగా ఏడో రౌండ్‌లోనూ మనోళ్లు జయ కేతనం ఎగుర వేశారు. బుధవారం జరిగిన ఈ రౌండ్‌లో మహిళల జట్టు 3-1తో జార్జియాను చిత్తుచేయగా, హోరాహోరీ పోరులో పురుషుల జట్టు 2.5-1.5తో చైనాను ఓడించాయి. దాంతో రెండు జట్లు చెరో 14 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాయి. మహిళల్లో.. లెలాపై వైశాలీ, ఖొటెనాష్‌విలీపై వంతిక అగర్వాల్ గెలిచారు. ఇక నానాతో గేమ్‌ను హారిక, బసియాష్‌విలీతో గేమ్‌ను దివ్య డ్రా చేసుకున్నారు. హరికృష్ణ-వాంగ్ ఈతో, అర్జున్-జియాంగ్జీతో, ప్రజ్ఞానంద-యాగ్యీతో గేమ్‌లను ఫలితం లేకుండా ముగించారు. దాంతో 1.5-1.5తో స్కోరు సమమైంది. ఈనేపథ్యంలో నిర్ణాయక ఆఖరి గేమ్‌లో గుకేష్-వీ యీపై నెగ్గడంతో భారత్ గెలుపు ఖాయమైంది.


విజయకృష్ణ (మధ్య)

సైక్లిస్ట్ విజయ్ అరుదైన ఘనత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): లద్దాఖ్ రాండనీర్స్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించిన 200 కిలోమీటర్ల సైక్లింగ్ ఈవెంట్‌ను హైదరాబాద్ సైక్లిస్ట్ ఎస్.టి.పి విజయవంతంగా పూర్తి చేశాడు. సముద్ర మట్టానికి 11,800 అడుగుల ఎత్తులో జరిగిన ఈ ప్రపంచ ఎత్తయిన బీఆర్ఎం సైక్లింగ్ ఈవెంట్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించి విజయకృష్ణ లక్ష్యాన్ని చేరాడు. ఇక, ఇదే ఈవెంట్‌లోని 400 కి.మీ. విభాగంలో పాల్గొన్న హైదరాబాదీలు శశికాంత్, ఈఏఎస్ రెడ్డి లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు.

సౌతాఫ్రికాకు అఫ్ఘానిస్థాన్ ఝలక్

షార్జా: తొలి వన్డేలో దక్షిణాఫ్రికాకు అఫ్ఘానిస్థాన్ షాకిచ్చింది. మూడు వన్డేల్లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ ఆరు వికెట్లతో విజయం సాధించింది. తొలుత సౌతాఫ్రికా 33.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. వియాన్ ముల్డెర్ (52) హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. ఫజల్‌హక్ ఫారూఖీ (4/35) నాలుగు, ఘజన్‌ఫర్ (3/20) మూడు వికెట్లు పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని అఫ్ఘానిస్థాన్ 26 ఓవర్లలో 107/4 స్కోరుతో ఛేదించింది. గుల్బదిన్ (34 నాటౌట్), అజ్మతుల్లా (25 నాటౌట్) రాణించారు. అంతర్జాతీయ క్రికెట్ అన్ని ఫార్మాట్లలో సఫారీలపై అఫ్ఘానిస్థాన్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం.

గౌతీ 'చాలీసా'.. కోహ్లీ 'శివనామ' స్మరణ

న్యూఢిల్లీ: ఢిల్లీవాలాలు కోహ్లీ, గంభీర్ ఇద్దరూ దూకుడైన స్వభావం కలిగిన వ్యక్తులు. మైదానంలో కోహ్లీ దుందుడుకుగా వ్యవహరించినా.. బయట సరదాగా ఉంటాడు. గౌతీ మాత్రం ఎక్కడైనా ఆవేశంగానే కనిపిస్తాడు. అయితే, దేవుడిని నమ్మే విషయంలో ఇద్దరిదీ ఒకే పంథా. బీసీసీఐ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ, గౌతీ కొన్ని జ్ఞాపకాలను పంచుకొన్నారు. అలా విషయం క్రికెట్ నుంచి ఆధ్యాత్మికత వైపు మళ్లింది. 2009లో నేపియర్‌లో న్యూజిలాండ్‌తో టెస్ట్‌లో భారత్ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు గంభీర్ రెండు రోజులకు పైగా బ్యాటింగ్ చేసి జట్టును ఘోర ఓటమి నుంచి తప్పించాడు. అప్పుడు మానసిక బలం కోసం తాను 'హనుమాన్ చాలీసా'ను చదువుకొనేవాడినని.. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా అదే పెట్టుకొని వినేవాడినని చెప్పాడు. ఇక 2014లో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో కోహ్లీ పరుగుల వరద పారించాడు. అప్పుడు తాను కూడా ప్రతి బంతికి 'ఓం నమః శివాయ' అని మనసులో అనుకొనే వాడినని కోహ్లీ అప్పట్లో తనకు చెప్పిన విషయాన్ని గంభీర్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. అవును నిజమేనన్నట్టుగా విరాట్ తలాడించాడు.

'పంజాబ్' చీఫ్ కోచ్ పాటింగ్

న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాటింగ్ నియమితుడయ్యాడు. ట్రెవర్ బేలిస్ స్థానంలో నాలుగేళ్లపాటు అతడు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడని పంజాబ్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. కాగా, ఏడేళ్లుగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ సేవలందించాడు. పంజాబ్ ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ నెగ్గలేదు. 2014లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.

దులీప్ ట్రోఫీ ఫైనల్ రౌండ్ నేటినుంచి

అనంతపురంలో పోటీలు

అనంతపురం క్లాక్ టవర్ (ఆంధ్రజ్యోతి): దులీప్ ట్రోఫీ ఆఖరి రౌండ్ గురువారం మొదలవనుంది. దీంతో రెడ్‌బాల్ క్రికెట్‌లో సత్తా నిరూపించుకునేందుకు శ్రేయాస్ అయ్యర్, సంజూ శాంసన్, రియాన్ పరాగ్, రింకూ సింగ్‌లకు ఇది మరో అవకాశం. ముఖ్యంగా.. బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు ఎంపిక కాలేకపోయిన ఇండియా-డి కెప్టెన్ శ్రేయాస్‌కు కీలకం. ఫైనల్ రౌండ్‌లో భాగంగా ఇండియా-ఎతో 'సి', ఇండియా-డితో 'బి' జట్లు తలపడతాయి.

కమిందు శతకం

శ్రీలంక 302/7

కివీస్‌తో తొలి టెస్టు

గాలె: యువ బ్యాటర్ కమిందు మెండిస్ (114) అద్భుత ఫామ్ కొనసాగిస్తూ శతకం బాదాడు. దాంతో న్యూజిలాండ్‌తో బుధవారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో మొదటి రోజు ఆఖరికి శ్రీలంక 302/7 స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న 106 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయిన దశలో కమిందు.. మాథ్యూస్ (36)తో కలిసి ఐదో వికెట్‌కు 72, కుశాల్ మెండిస్ (50) జతగా ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించాడు. రమేష్ మెండిస్ (14), ప్రభాత్ జయసూర్య (0) క్రీజులో ఉన్నారు. రూర్క్ 3, గ్లెన్ 2 వికెట్లు పడగొట్టారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రూ.2.50 కోట్ల చెక్కు అందిస్తున్న నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు శరణి, పునీత్

'నారాయణ' విరాళం రూ.2.50 కోట్లు

- శ్రీరామ్ చిట్స్ రూ.కోటి అందజేత

వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు, పలు సంస్థలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ప్రకటిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కులు అందిస్తున్నారు. బుధవారం నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు శరణి, పునీత్ రూ.2.50 కోట్లు అందించారు. శ్రీరామ్ చిట్స్ ఎండీ వైఎస్ చక్రవర్తి రూ.కోటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు తరపున బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ రూ.50 లక్షలు, టెక్నో పెయింట్స్ తరపున ఆ సంస్థ డైరెక్టర్లు ఆకునూరి శ్రీనివాసరెడ్డి, సీవీఎల్ఎన్ మూర్తి, అనిల్ రూ.20 లక్షలు ఇచ్చారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా తరపున కన్నెగంటి రమాదేవి, దుర్గాభవాని, పల్లవి రూ.5 లక్షలు, మోల్డ్‌టెక్ ఇండస్ట్రీస్ తరపున వైస్ ప్రెసిడెంట్ రాణా రూ.25 లక్షలు అందించారు.



సీఎంకు 50వేల చెక్కు అందిస్తున్న కుమారీ ఆంటీ, కుటుంబసభ్యులు

కుమారీ ఆంటీ రూ.50 వేల విరాళం

- వరద బాధితుల సహాయార్థం సీఎంకు చెక్కు అందజేత
- రేవంత్‌కు రొయ్యలు, నాటుకోడి కూర ఇచ్చిన కుమారి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చిన్న షెడ్డులో హోటల్ నడుపుతూ పేరు తెచ్చుకుని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన కుమారి అలియాస్ కుమారీ ఆంటీ తన పెద్దమనసును చాటుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష విరాళం ప్రకటించారు. బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసిన కుమారి కుటుంబం రూ.50వేల చెక్కును అందించింది. సీఎం రేవంత్ ఆమెను అభినందించి, శాలువాతో సన్మానించారు. కుమారి హైదరాబాద్‌లోని రాయదుర్గం ఐటీ హబ్ ప్రాంతంలో నడుపుతున్నారు. ఆమె కుటుంబానికి ఆ హోటలే జీవనాధారం. నిజానికి తామే అప్పుల్లో ఉన్నా... 'అప్పులు ఎప్పుడూ ఉంటాయి.. సాయం చేసేది ఒకసారే కదా అమ్మా' అని తన పిల్లలు అన్నారని ఆమె 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. ఇంకొంచెం ఎక్కువ కష్టపడదామన్నారని తెలిపారు. కాగా సీఎంకు ఆమె రొయ్యల వేపుడు, నాటుకోడి, చేపల కూర, మటన్ కర్రీ, బిర్యానీ అందజేశారు. గతంలో తన హోటల్‌ను తీసేయాలని పోలీసులు చెప్పినప్పుడు తమకు సీఎం అండగా ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఏపీ పెద్దలకు సమాచారం అందించామని, వారి నుంచి పిలుపు రాగానే వెళ్లి రూ.50వేల చెక్కు అందిస్తామని తెలిపారు.



చెక్కును సీఎం రేవంత్‌కు అందజేస్తున్న బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీబీవీఆర్ ప్రసాద్, తదితరులు

బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ 5 లక్షల విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 18 : వరద బాధితుల సహాయార్థం బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించింది. బుధవారం సీఎంను కలిసిన ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి చెక్కును అందజేశారు.

అపరమిత నగదు రహిత వైద్యం అందించండి

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈహెచ్ఎస్(ఉద్యోగుల ఆరోగ్య పథకం) ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, పింఛనుదారులకు అపరిమిత నగదు రహిత వైద్య సేవలను అందించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి ఈహెచ్ఎస్‌లో మార్పులు సూచిస్తూ చేసిన ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, ఇతర సభ్యులు కలిసి మంత్రి దామోదర రాజనర్సింహకు అందజేశారు. ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేయాలని మంత్రిని కోరారు.

నిర్బంధ తనిఖీలపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

నిర్బంధ తనిఖీ(కార్డన్ సెర్చ్)లపై వివరణ ఇవ్వాలని హోంశాఖ, డీజీపీ తదితరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నిర్బంధ తనిఖీల పేరిట పౌరుల జీవితాల్లో పోలీసులు అతిగా జోక్యం చేసుకుంటున్నారని.. మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో, మిడ్‌నైట్ కౌన్సెలింగ్ అంటూ వివిధ పేర్లతో బస్తీల్లో ప్రజలను నిర్బంధిస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో ల్‌దాఖలైంది. హైదరాబాద్ బాషారత్ నగర్ మక్కా కాలనీకి చెందిన ఎస్క్యూ మసూద్ అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

కుక్కల నియంత్రణకు ఏబీసీ రూల్స్ అమలు

- హైకోర్టుకు జీహెచ్ఎంసీ నివేదిక

మనుషులపై కుక్కల దాడుల నేపథ్యంలో కుక్కలను నియంత్రించేందుకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్‌ను నిర్దిష్టంగా అమలు చేస్తున్నట్లు హైకోర్టుకు జీహెచ్ఎంసీ నివేదించింది. ఏబీసీ నిబంధనలను ఎలా అమలు చేస్తున్నారనే అంశంపై జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి హైకోర్టుకు నివేదిక సమర్పించారు. 'లోకల్ యానిమల్ బర్త్ కంట్రోల్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశాం. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 18 మంది వెటర్నరీ డాక్టర్లు, ఆరుగురు షెల్టర్ మేనేజర్లు, 22మంది పారా వెటర్నరీ సిబ్బంది, 362మంది డాగ్ హ్యాండ్లర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా బ్లూక్రాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు'అని తెలిపారు. జీహెచ్ఎంసీ కౌంటర్‌పై రిప్లై దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించిన ధర్మాసనం.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

అక్రమ నిర్మాణాల కేసు కొట్టివేతకు పిటిషన్

నిజాంపేట్‌లోని ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ తమపై పెట్టిన కేసు కొట్టేయాలని మ్యాప్స్ ఇన్‌ఫ్రా సంస్థ, మేనేజింగ్ పార్ట్నర్ పి.సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎర్రకుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారంటూ నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేసిన ఫిర్యాదుతో బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు కొట్టేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ కె.సుజన ధర్మాసనం...వైఖరి తెలియజేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

2050 స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్

28 నుంచి దరఖాస్తుకు చాన్స్

- నవంబరు 17న పరీక్ష
- రాష్ట్ర వ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలు
- ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వెయిటేజీ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కొలువుల జాతర మొదలైంది. సరిగ్గా వారం రోజుల్లోనే మరో నోటిఫికేషన్ విడుదలైంది. సెప్టెంబరు 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ కాగా... ప్రస్తుతం స్టాఫ్‌నర్సుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 2,050 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి బుధవారం నియామక బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 16 నుంచి 17వ తేదీ మధ్య దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. నవంబరు 17న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్ష ఉంటుంది. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం), బీఎస్సీ నర్సింగ్ చేసిన అభ్యర్థులే ఈ పోస్టులకు అర్హులు. దరఖాస్తు చేసే సమయానికి తప్పనిసరిగా అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాలను తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. పోస్టుల్లో 95 శాతం స్థానికులకేనని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. అభ్యర్థుల వయోపరిమితి ఈ ఏడాది జూలై 1 నాటికి 46 సంవత్సరాలకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఇచ్చారు. వంద పాయింట్ల ప్రాతిపదిక జరిగే భర్తీ ప్రక్రియలో అర్హత పరీక్షకు 80మార్కులు, వెయిటేజీ కింద 20 మార్కులు కేటాయిస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా కనీసం ఆరు నెలలు పని చేస్తేనే వెయిటేజీ మార్కులొస్తాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆయా ఆస్పత్రుల నుంచే అనుభవ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట(మొత్తం 13) పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. 2050 పోస్టులకు గాను ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో 1576, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో 332, ఆయుష్‌లో 61, ఐపీఎమ్‌లో ఒకటి, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో 80 పోస్టులు ఉన్నాయి. జోన్-1లో 241, జోన్-2లో 86, జోన్-3లో 246, జోన్-4లో 353, జోన్-5లో 183, జోన్-7లో 114 పోస్టులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు టీటీటీ.రుజిట టబ్ల్యూజ్యూఎబ్ల్యూ.జౌరి.జీను సందర్శించవచ్చు. కాగా, వచ్చే వారం ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు వైద్య శాఖ వర్గాలు తెలిపాయి.

ఫిక్స్‌డ్ చార్జీల పెంపు!

300 యూనిట్లకు పైగా విద్యుత్ వాడే గృహ వినియోగ దారులకు వర్తింపు

- కొత్త ప్రతిపాదనలు అమల్లోకి వస్తే రూ.150కి పెంపు
- హెచ్‌టీ కేటగిరీలో ఫిక్స్‌డ్‌తో పాటు పెరగనున్న విద్యుత్ చార్జీలు
- ఈఆర్సీకి వార్షికాదాయ అవసరాల నివేదికలో డిస్కమ్‌ల ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోటెన్షన్ (ఎల్‌టీ) కేటగిరీలోని విద్యుత్ వినియోగదారులపై ఫిక్స్‌డ్ చార్జీల (డిమాండ్ చార్జీ) రూపంలో అదనపు భారం పడబోతోంది. నెలలో 300 యూనిట్లకు మించి విద్యుత్‌ను వినియోగించుకున్న వారికి ఈ చార్జీలు వర్తించనున్నాయి. ప్రస్తుతం గృహ కనెక్షన్ల లోడ్ సామర్థ్యం (కాంట్రాక్టెడ్ లోడ్) ఆధారంగా ప్రతి కిలోవాట్ (కేడబ్ల్యూ) లోడ్‌కు రూ.10 చొప్పున ఫిక్స్‌డ్ చార్జీలు విధిస్తున్నారు. దీంతో నెలకు 300 యూనిట్లకు పైగా వినియోగించే గృహ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల కింద రూ.30 భారం పడుతోంది. అయితే ఇకపై ఈ చార్జీలను కిలోవాట్‌కు రూ.10 నుంచి రూ.50కి పెంచాలని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. కొత్త ప్రతిపాదనలు అమల్లోకి వస్తే నెల విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించిన వారికి ఫిక్స్‌డ్ చార్జీలు రూ.150కి పెరగనున్నాయి. ఎల్టీ కేటగిరీకి ఫిక్స్‌డ్ చార్జీలు మాత్రమే పెరగనుండగా, హైటెన్షన్ (హెచ్‌టీ) కేటగిరీ వినియోగదారులకు మాత్రం విద్యుత్ బిల్లులు షాక్ కొట్టబోతున్నాయి. హెచ్‌టీ కేటగిరీలో ఇటు విద్యుత్ చార్జీలు, అటు ఫిక్స్‌డ్ చార్జీలు రెండూ పెరగబోతున్నాయి. ఈ మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రాష్ట్రంలో రూ.1200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు(టీజీఎస్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్) బుధవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతిపాదించాయి. ఇందుకు తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, టారిఫ్ ప్రతిపాదనలను ఈఆర్సీకి సమర్పించాయి. హెచ్‌టీ కేటగిరీలో విద్యుత్ చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్లు కలిపి మొత్తం రూ.800 కోట్ల పెంపును ప్రతిపాదించాయి. మిగిలిన రూ.400 కోట్లను ఎల్టీ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు ద్వారా రాబట్టుకునే అవకాశమివ్వాలని కోరాయి. అయితే ఎల్టీ కేటగిరీలోని ఇతర వినియోగదారులకు సంబంధించిన ఫిక్స్‌డ్ చార్జీల పెంపునకు కూడా డిస్కమ్‌లు ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది. లోటెన్షన్ కేటగిరీలోకి గృహాలు, గృహేతర/వాణిజ్య, పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలు, వీధి దీపాలు, తాగుటి సరఫరా పథకాలు, సాధారణ వినియోగదారులు వస్తుండగా, వీటికి సంబంధించిన ఫిక్స్‌డ్ చార్జీలు మాత్రమే పెరగనున్నాయి. విద్యుత్ చార్జీలను మాత్రం యథాతథంగా కొనసాగించాలని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి.



ఆదాయ లోటు రూ.13,022 కోట్లు..

రాష్ట్ర డిస్కమ్‌లు 2024-25లో రూ.13,022 కోట్ల ఆదాయ లోటును ఎదుర్కోవాల్సి ఉంటుందని అంచనా వేశాయి. ఇందులో ఎస్పీడీసీఎల్ వాటా రూ.8093 కోట్లు కాగా, ఎన్పీడీసీఎల్ వాటా రూ.4929 కోట్లు. విద్యుత్ చార్జీల పెంపుతో రూ.1200 కోట్ల అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటామని, మిగిలిన రూ.11,822 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తుందని నివేదించాయి.

హెచ్‌టీలో ఇక ఒకే చార్జీలు..

హెచ్‌టీ కేటగిరీలో 11కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై సామర్థ్యం .. అనే మూడు ఉప కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, మూడింటికీ వేర్వేరు చార్జీలను విధిస్తున్నారు. ప్రస్తుతం అన్నింటికన్నా 11 కేవీ కనెక్షన్ల చార్జీలు అధికంగా ఉన్నాయి. అయితే ఇకపై మిగిలిన రెండు కేటగిరీల చార్జీలు కూడా 11కేవీ కనెక్షన్ల చార్జీలకు సమానమయ్యేలా.. 33కేవీ కనెక్షన్లకు యూనిట్ విద్యుత్‌పై అర్ధరూపాయి వరకు, 132కేవీ/ఆపై సామర్థ్యం కలిగిన కనెక్షన్లకు రూపాయి వరకు పెంచనున్నారు. హెచ్‌టీ కేటగిరీలో పరిధిలోకి.. సాధారణ పరిశ్రమలు, లైట్స్ అండ్ ఫ్యాన్స్, కోళ్ల ఫారాలు, సీజనల్ పరిశ్రమలు, ఫెర్రో అల్లయ్ యూనిట్లు, ఇతరులు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, తాత్కాలిక సరఫరా వంటి వినియోగదారులు వస్తారు. ఈ కేటగిరీల వినియోగదారులు తమ అవసరాల మేరకు 11కేవీ, 33కేవీ, 132కేవీ/ఆపై సామర్థ్యంతో విద్యుత్ కనెక్షన్లను కలిగి ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్వార్టర్ మద్యం 99కే!

- అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీ
- 10% షాపులు కల్లుగీత కులాలకే రాష్ట్ర కేబినెట్ ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు చౌక మద్యాన్ని(చీప్ లిక్కర్) అందుబాటు ధరలకే అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. క్వార్టర్ రూ.99కే అందుబాటులోకి తీసుకురానుంది. సాధారణ లిక్కర్ షాపులతో పాటు కేవలం ప్రీమియం రకం మద్యం బ్రాండ్లు మాత్రమే ఉండే ఎలైట్ షాపుల ఏర్పాటుకూ ఆమోద ముద్ర వేసింది. మద్యందుకాణాల్లో 10% కల్లు గీతకులాలకు కేటాయించాలని నిశ్చయించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. కేబినెట్ నిర్ణయాలను వివరించారు. 2023 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 15 వరకు గ్రామ/వార్డు వలంటీర్ల సర్వీసును పొడిగిస్తూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేబినెట్ విభేదించిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. వార్తా పత్రిక కొనుగోలు కోసం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ.200 చొప్పున అదనపు ఆర్థిక సాయం అందించేందుకు గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని చేసిన ప్రతిపాదనలను కూడా కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. 'రాజకీయ లబ్ధి కోసం, ఎవరికో ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ఇచ్చిన ఈ జీవోల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.205 కోట్ల నష్టం వాటిల్లింది. దీనిపై కమిటీ వేసి పూర్తి వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేస్తూ అసెంబ్లీ ఉభయ సభల ముందుంచే తీర్మానం, కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడానికి చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది' అని చెప్పారు.



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

కేటీఆర్ ఓ బచ్చా..

- పార్లమెంట్ ఎన్నికల్లో మూడోస్థానంలో కూర్చోబెట్టినా తెలుసుకోలేకపోతున్నాడు
- 'నల్లగొండ'ను బంగారుకొండ చేస్తాం
- రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి: కోమటిరెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 18: కేటీఆర్ బచ్చాగాడు.. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు పంపిస్తానని అంటున్నాడు. పార్లమెంట్ ఎన్నికల్లో 9 నియోజకవర్గాల్లో మూడో స్థానంలో, 7 నియోజకవర్గాల్లో డిపాజిట్ కోల్పోయినప్పటికీ ఇంకా తెలుసుకోలేకపోతున్నాడు. అతని ఆరోగ్యం గురించి ఒకసారి ఆలోచించాల్సిన అవసరముంది' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రూ.180 కోట్లతో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై 4 చోట్ల నిర్మించనున్న వెహికిల్ అండర్ పాస్(వీయూపీ)లకు రామచంద్రగూడెం వై జంక్షన్ వద్ద ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాను రాబోయే కాలంలో బంగారుకొండను చేస్తామని, జిల్లాను వ్యవసాయ రంగం, రోడ్ల అభివృద్ధిలో అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ నెల 20న ఉపముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రితో కలిసి ఎస్ఎల్‌బీసీని సందర్శించనున్నామని చెప్పారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ పనులు రెండేళ్లలో పూర్తి చేసి అదనంగా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ పనులను నవంబరు మొదటి లేదా రెండో వారంలో ప్రారంభిస్తామన్నారు. గంధమళ్ల, బస్వాపూర్ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీనిచ్చారు. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నాలుగేళ్ల క్రితమే పూర్తి కావల్సి ఉండగా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఆ పవర్‌ప్లాంట్‌లో అన్ని యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని వెల్లడించారు. నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మిర్యాలగూడ వద్ద రూ.147 కోట్లతో నిర్మించనున్న 4 వీయూపీలు, 3 ఎకరాల భూసేకరణకు రూ.30 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడలో రూ.10 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో మరణాలపై రగడ

పసిబిడ్డల ప్రాణాలు పోతుంటే సీఎం ఏం చేస్తున్నారంటూ కేటీఆర్ ట్వీట్

ప్రభుత్వ దవాఖాన్లపై కుట్రలు వద్దంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో పసిపిల్లలు, బాలింతల మరణంపై అధికార, ప్రతిపక్షాల మధ్య బుధవారం మాటల యుద్ధం మొదలైంది. ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ముఖ్యమంత్రిపై తీవ్ర విమర్శలు చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా ఎక్స్‌లో ఘాటుగా బదులిచ్చారు. ఈ ఏడాదిలో 48 మంది పసిబిడ్డలు, 14 మంది బాలింత తల్లులు మరణించారని ఎంతో మందికి ప్రాణం పోసిన గాంధీ ఆస్పత్రిలో ఇంత విషాదమా? ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? వ్యవస్థలు పనిచేస్తున్నాయా? పసిబిడ్డల ప్రాణాలకు విలువ లేదా? అని కేటీఆర్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఒక్క గాంధీలోనే ఇన్ని మరణాలుంటే.. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితేంటని, సీఎం ఏం చేస్తున్నారని నిలదీశారు. పాలన గాలికి వదిలేసి విగ్రహ రాజకీయాలు చేస్తున్న సీఎంకు ఎవరైనా బాధ్యతను గుర్తు చేయాలని కోరారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్రంగా స్పందించారు. గాంధీ ఆస్పత్రిపై బురద జల్లి రోగులు రాకుండా చేసి కార్పొరేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చాలని కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాంధీ వంటి టెర్షియరీ కేర్ ఆస్పత్రులకు అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్న రోగులే వస్తారని, వారిని కాపాడేందుకు చివరి నిమిషం వరకు వైద్యులు ప్రయత్నిస్తారని వివరించారు. పరిస్థితి విషమంగా ఉండడం వల్ల కొందరు రోగులు ప్రాణాలు కోల్పోతారని తెలిపారు. దేశంలోని ఏ టెర్షియరీ కేర్ ఆస్పత్రిలోనైనా ఇలాంటి ఘటనలు ఉంటాయన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఇలా జరిగిందంటూ కేటీఆర్ మరణాల సంఖ్యను భూతద్దంలో చూపిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో గాంధీ ఆస్పత్రిలో చోటుచేసుకున్న మరణాల వివరాలను విడుదల చేశారు. కాగా, సినీనటుడు నాగార్జునను సీఎం రేవంత్‌రెడ్డి రూ.400కోట్లు డిమాండ్ చేశారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆ మొత్తం ఇవ్వనందుకే ఎన్‌కన్వెన్షన్ కూల్చేశారని విమర్శించారు.



బీసీల సమస్యలపై పోరాటం

- నవంబరు 10లోగా బీసీ డిక్లరేషన్ అమలవకుంటే ఉద్యమిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీల సమస్యలను పరిష్కరించే వరకూ పోరాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 10న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని, సమగ్ర కులగణన చేపట్టాలని, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిని వచ్చే నవంబరు 10లోపు నెరవేర్చకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. పార్టీకి చెందిన బీసీ నేతలతో తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్టీలోని బీసీ నేతలను వర్కింగ్ గ్రూపులుగా విభజించి, బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు కనీసం రూ.30వేలకోట్లు కేటాయించాలని, ఎంబీసీకి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. జమిలి ఎన్నికల విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్తారన్న విషయమై కేంద్రం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు వచ్చాక.. తమ పార్టీ నేతలతో చర్చించి.. తమ నిర్ణయం చెబుతామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టిందనడానికి కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీనే ఉదాహరణ అని పేర్కొన్నారు.

కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఏసీబీ సోదాలు

- రూ. 1.14 లక్షలు తీసుకుంటూ అడ్డంగా దొరికిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

కొత్తగూడెం, సెప్టెంబరు 18: బిల్లుల చెల్లింపుకు క్లియరెన్స్ ఇచ్చేందుకు రూ. 1.14 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జరిగింది. జిల్లాలోని కొందరు రైతులకు వివిధ కంపెనీల నుంచి ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పైపులను సబ్సిడీపై అందజేసింది. ఇందుకోసం ఆయా కంపెనీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ బిల్లులు చెల్లించాలంటే జిల్లా ఉద్యానవన శాఖ అధికారి క్లియరెన్స్ ఇవాల్సి ఉంటుంది. ఇందుకు ఆయా కంపెనీల పంపిణీదారులను ముడుపులు చెల్లించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ డిమాండ్ చేశాడు. గతంలో సదరు అధికారి మహబూబాబాద్‌లో పనిచేసిన సమయంలో ఓ కంపెనీ వారు లంచం డబ్బులు బ్యాలెన్స్ ఉంచారని, ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో బిల్లులకు ఆ కంపెనీవారు అదనంగా చెల్లించాలని ఒత్తిడి చేశాడు. మొత్తం రూ.1.14లక్షలు చెల్లిస్తేనే బిల్లులకు క్లియరెన్స్ ఇస్తానని చెప్పడంతో సదరు కంపెనీకి చెందిన పంపిణీదార్లు జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డబ్బులు అందజేస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు సూర్యనారాయణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

తిరుమల లడ్డూ అపవిత్రం

- వైసీపీ హయాంలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు కలిపారు
- అన్న ప్రసాద నాణ్యతా తగ్గించారు
- మేము మంచి నెయ్యి తెప్పించాం
- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదం నుంచి నిత్యాన్న ప్రసాదం వరకు అన్నింటినీ సర్వనాశనం చేశారని తెలిపారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యి ఉపయోగించి తయారు చేయాల్సిన శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతువుల కొవ్వును కలిపారని చెప్పారు. "తిరుమల లడ్డూ ప్రసాదాన్ని నాసిరకంగా మార్చేశారు. ఎన్ని ఫిర్యాదుల చేసినా శ్రీవారి పవిత్రతను దెబ్బతీశారు. ఎన్నోసార్లు చెప్పాం. అయినా.. తిరుమలలో చాలా దుర్మార్గంగా ప్రవర్తించారు. చివరకు అన్న ప్రసాదంలోనూ నాణ్యత లేకుండా చేశారు. సాక్షాత్తూ స్వామి దగ్గర పెట్టే ప్రసాదం కూడా అపవిత్రం చేశారు. నాసిరకం సరుకులే కాకుండా, లడ్డూ ప్రసాదం తయారీకి నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారు. ఈ రోజు స్వచ్ఛమైన నెయ్యి తెమ్మన్నాం. ప్రక్షాళన చేయమని చెప్పాం. ఇప్పుడు నాణ్యత పెరిగింది. ఇంకా నాణ్యత పెంచుతాం. వేంకటేశ్వరస్వామి మనరాష్ట్రంలో ఉండడం మనందరి అదృష్టం. ఆయన కోసం ప్రపంచం మొత్తం మన దగ్గరకి వస్తోంది. అలాంటప్పుడు తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు అన్నారు.

డీఎస్పీగా బాక్సర్ నికత్ జరీన్

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా బాక్సర్ నికత్ జరీన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం డీజీపీ జితేందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన ఆమె జాయినింగ్ రిపోర్టు అందజేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నికత్... బాక్సింగ్‌లో రెండు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచారు. ఆమెకు జూబ్లీ హిల్స్‌లో 600 గజాల ఇంటిస్థలంతో పాటు గ్రూప్-1 స్థాయి ఉద్యోగాన్ని ఇవ్వనున్నట్లు ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆమెను డీఎస్పీగా నియమిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



డీఎస్పీగా తన జాయినింగ్ రిపోర్టును డీజీపీ జితేందర్‌కు అందజేస్తున్న నికత్ జరీన్

చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా
ఆలయాల అభివృద్ధి చేపట్టండి

» అధికారులతో సమీక్షలో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రముఖ దైవ క్షేత్రాలైన కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయం, యాదాద్రి దేవాలయ పురోగతికి చేపడుతున్న పనులు, భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్, పలు దేవాలయాల్లో సౌకర్యాల కల్పనపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి చేపట్టే పనుల్లో వివిధ శాఖలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. మానిటరింగ్ కమిటి నివేదిక సమర్పించిన తర్వాత యాదగిరిగుట్ట గర్భగుడి విమాన గోపురం స్వర్ణ తాపడం, వేదపాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గోవింద హరి చైర్మన్‌గా రాయగిరిలో 20 ఎకరాల్లో రూ.43 కోట్ల అంచనా వ్యయంతో వేదపాఠశాలను నిర్మిస్తామన్నారు.

ఈవీ చార్జింగ్ కేంద్రానికి
3 రోజుల్లో కనెక్షన్ ఇవ్వాలి: కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్రో నగరాల్లో విద్యుత్తు వాహనాల చార్జింగ్ కేంద్రాలకు విద్యుత్తు వినియోగదారుల మార్గదర్శకాలు-2020 ప్రకారం 3 రోజుల్లో కనెక్షన్ ఇవ్వాలని బుధవారం కేంద్రం ఆదేశించింది. మునిసిపల్ ప్రాంతాల్లో 7 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లోగా, గ్రామీణ కొండ ప్రాంతాల్లో 30 రోజుల్లోగా, ఒకవేళ పంపిణీ వ్యవస్థను విస్తరించడం లేదా కొత్త సబ్‌స్టేషన్లు అవసరమైతే 90 రోజుల్లోగా కనెక్షన్ ఇవ్వాలని పేర్కొంది. దీని కోసం ఎప్పటికప్పుడు విద్యుత్తు వినియోగదారుల మార్గదర్శకాలు- 2020ని సవరించాలని నిర్దేశించింది.

బీసీ విదేశీ విద్యానిధికి దరఖాస్తులు షురూ

మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. 2024 ఆగస్టు, సెప్టెంబర్ (ఫాల్ సీజన్)లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అక్టోబర్ 15 వరకు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందదలచుకున్న విద్యార్థులు 35 ఏళ్లలోపు వారై ఉండాలి. కుటుంబ ఆదాయం రూ. 5 లక్షలకు మించకూడదు. డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. మరిన్ని వివరాలకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె

పంచాయతీల విలీన ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని పలు పంచాయతీలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. దాదాపు 51 పంచాయతీలను మునిసిపాలిటీల్లో కలుపుతూ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో మరిన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. రంగారెడ్డి జిల్లా చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, హమీదుల్లా నగర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ మాజీ సర్పంచులు పద్మావతి, లక్ష్మయ్య, సతీశ్, సుజాత, రాణి పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం.. సాధారణ పరిపాలన, మునిసిపల్, న్యాయశాఖలు, ఎంఏయూడీ డైరెక్టర్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లకు నోటీసులు జారీచేసింది. కౌంటర్‌లు దాఖలు చేయాలంటూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

మండపంలో గణనాథుడు మాయం?

వికారాబాద్, సెప్టెంబరు 18: నిమజ్జనానికి ముందే ఓ మండపంలో గణనాథుడు మాయమయ్యాడు. ఉదయం వచ్చి పరదా తీసిన భక్తులు మండపం ఖాళీగా ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. వికారాబాద్ జిల్లా కేంద్రం 33వ వార్డు బీటీఎస్ కాలనీ ఇంద్రారెడ్డి పార్కు కాలనీ వద్ద ఈ ఘటన జరిగింది. మంగళవారం రాత్రి పూజలు చేసి, లడ్డూ వేలం నిర్వహించారు. నిమజ్జనం మంగళవారం కావడంతో మర్నాడు నిమజ్జనం చేయాలని నిర్ణయించి అంతా వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి మండపంలో వినాయక విగ్రహం లేదు. కొందరు యువకులు తెల్లవారుజామున మూడు గంటలకు గుట్టు చప్పుడు కాకుండా వినాయకుడిని నిమజ్జనానికి తరలించినట్లు కాలనీ వాసులు గుసగుసలాడుకుంటున్నారు. అయితే ఈ మండపంలో నిర్వాహకులు ప్రత్యేక కమిటీ వేసి పదేళ్లుగా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కమిటీలో అవకతవకలు జరగడంతో వారిని తప్పించాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది.

మల్లన్నసాగర్
ముంపు గ్రామాలు మునిసిపాలిటీలోకి

» విలీనం చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిన ప్రభుత్వం

గజ్వేల్, సెప్టెంబరు 18: మల్లన్నసాగర్ ముంపు గ్రామలతో పాటు పునరావాస కాలనీ గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో విలీనం కానున్నాయి. ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం ఎర్రవల్లి గ్రామపంచాయతీతో పాటు తిప్పారం గ్రామపంచాయతీ పరిధిలోని మధిర గ్రామమైన సింగారం, తొగుట మండలంలోని బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామపంచాయతీలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో విలీనం చేయనున్నారు. అలాగే మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసే ముందు ముంపు గ్రామాల ప్రజల కోసం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధి ముత్రాజ్‌పల్లి, సంగాపూర్, గజ్వేల్ రెవెన్యూలో పునరావాస కాలనీని ఏర్పాటు చేశారు. ముంపు గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి కుటుంబాలు అక్కడ నివాసం ఉంటున్నాయి. 2019లో మల్లన్నసాగర్ పునరావాస కాలనీకి స్థానిక ఎన్నికలు నిర్వహించారు. కాలనీపై మునిసిపాలిటీకి ఎలాంటి అధికారం లేకుండా స్థానిక సంస్థల పర్యవేక్షణలోనే పునరావాస కాలనీలో పౌర సేవలు కొనసాగించారు. తాజాగా ప్రభుత్వం మారడం, సర్పంచ్, ఎంపీటీసీల పదవీ కాలం పూర్తవడం రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిధిలో ఓటరు జాబితా సవరణ, ఇతరత్రా ఎన్నికల పనులు జరుగుతుండగా ముంపు గ్రామాలతో పాటు పునరావాస కాలనీని మునిసిపాలిటీలో విలీనం చేయనున్నారు.

మల్లన్నసాగర్‌కు జల కళ

» రిజర్వాయర్‌లో ప్రస్తుతం 20 టీఎంసీల నీళ్లు

తొగుట, సెప్టెంబరు 18: సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ వద్ద ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ జల కళ సంతరించుకుంది. ఈ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోత రికార్డు స్థాయిలో కొనసాగుతోంది. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్‌లో రెండేళ్ల క్రితం వరకు 15 టీఎంసీల నీటిని మాత్రమే నింపేవారు. ఈ ఏడాది 21 టీఎంసీల నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా ఎత్తిపోతలు ప్రారంభించారు. ప్రస్తుతం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 20 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, 20వ తేదీ వరకు నీటిని ఎత్తిపోసి 21 టీఎంసీల లక్ష్యాన్ని చేరుకుంటామని మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు.

తెలంగాణ.. సంపన్న రాష్ట్రం!



జాతీయ సగటు కంటే ఎక్కువ తలసరి

తర్వాత కర్ణాటక, తమిళనాడు, కేరళ

దేశ జీడీపీలో 30% దక్షిణాది రాష్ట్రాల నుంచే..

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ జీడీపీలో దాదాపు 30 శాతం దక్షిణాది రాష్ట్రాల నుంచే వస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు వాటా 30 శాతంగా ఉంది. ఈ విషయాలను ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ రాష్ట్రాల తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని తెలిపింది. జాతీయ సగటులో తెలంగాణ తలసరి ఆదాయం 193.6 శాతం ఉండగా, కర్ణాటక 181 శాతం, తమిళనాడు 171 శాతం, కేరళ 152.5 శాతం మేర ఉందని వివరించింది. ఆర్థిక సరళీకరణ తర్వాత తెలంగాణ, కర్ణాటక బలమైన ఆర్థిక కేంద్రాలుగా మారాయని తెలిపింది. విభజన తర్వాత ఏపీ పరిస్థితి బాగా దెబ్బతిందని వెల్లడించింది. 2023-24లో తెలంగాణలో తలసరి ఆదాయం 193.6 శాతం మేర పెరగ్గా.. ఏపీలో 131.6 శాతానికి పడిపోయిందని తెలిపింది. తలసరి ఆదాయం విషయంలో ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. తెలంగాణలో సగటు వ్యక్తి జాతీయ సగటు కంటే 94 శాతం అధిక ఆదాయం ఆర్జిస్తుండగా.. కర్ణాటకలో 81 శాతం, తమిళనాడులో 71 శాతం ఆర్జిస్తున్నారని వివరించింది. తలసరి ఆదాయం రీత్యా ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా సంపన్న రాష్ట్రాలుగా గుర్తింపు పొందగా, బిహార్, ఝార్ఖండ్, యూపీ, మణిపూర్, అసోం పేద రాష్ట్రాలుగా ఉన్నట్లు నివేదిలో తెలిపింది. పశ్చిమ రాష్ట్రాల్లో మహారాష్ట్ర, గుజరాత్ మంచి పనితీరు కనబర్చాయని, గోవా తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉందని చెప్పింది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఢిల్లీ, హరియాణా మంచి పనితీరు కనబర్చగా, పంజాబ్ తలసరి ఆదాయం తగ్గుతూ వస్తోందని తెలిపింది. తూర్పు రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ పరిస్థితి అధ్వానంగా ఉందని, 2023-24లో దాని వాటా జాతీయ జీడీపీలో కేవలం 5.6 శాతమని పేర్కొంది. తలసరి ఆదాయం విషయంలో ఒడిసా ఎంతో మెరుగుపడిందని, 2023-24లో 88.5 శాతానికి చేరుకుందని తెలిపింది. మధ్యప్రదేశ్ తలసరి ఆదాయం 2010-11లో 60.1 శాతం ఉండగా.. 2023-24లో 77.4 శాతానికి పెరిగిందని వివరించింది. అసోం తలసరి ఆదాయం క్రమంగా పెరుగుతూ 73.7 శాతానికి చేరుకోగా, సిక్కిం తలసరి ఆదాయం గత రెండు దశాబ్దాల్లో చెప్పుకోదగ్గ రీతిలో పెరిగిందని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రశంసించింది.

రైతులూ.. వ్యాపారాలు చేయండి!

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తామని, పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. బుధవారం రాష్ట్ర 'ఎంఎస్ఎంఈ విధానాన్ని' విడుదల చేసిన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆర్థిక, పారిశ్రామిక సంస్కరణలను అమలు చేశారని చెప్పారు. వాటివల్లే నేడు భారతదేశం ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. పీవీ ఎమ్మెల్యేగా గెలిచిన మంథని నుంచే ప్రస్తుతం పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు కూడా గెలిచారని.. ఈయన పారిశ్రామిక సంస్కరణలు కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాయని మంత్రిని ప్రశంసించారు. నేడు ప్రపంచం చైనా ప్లస్1గా భారతదేశాన్ని అందులో తెలంగాణనూ చూస్తోందని సీఎం చెప్పారు.



ఎంఎస్ఎంఈ పాలసీ విడుదల సభలో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్ దూరదృష్టితో హైదరాబాద్ అభివృద్ధి

చంద్రబాబు తెచ్చిన ఐటీ విప్లవాన్ని వైఎస్సార్ వేగంగా ముందుకు తీసుకెళ్లారని సీఎం రేవంత్ చెప్పారు. అలాగే ఇందిరాగాంధీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఐడీపీఎల్ కారణంగా నేడు పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన బీహెచ్ఈఎల్, ఐటీ కంపెనీలతో నగరం వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. కొండాపూర్, మాదాపూర్ గ్రామాలు నేడు ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఉన్నాయంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలే కారణమని చెప్పారు. శిల్పారామం, హైటెక్ సిటీ ఉన్నాయంటే కాంగ్రెస్ ప్రభుత్వాల ఘనతేనని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పట్టాలు సాధిస్తున్నారు తప్ప.. ఉపాధి అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారని సీఎం అన్నారు. దీనికి పరిష్కారంగానే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 65 ఐటీఐలు ఉన్నాయని.. వాటిలో ఇప్పటికీ 45 ఏళ్ల కిందటి సిలబస్‌నే బోధిస్తున్నారని చెప్పారు. సిలబస్‌తోపాటు విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకే టాటా సంస్థతో కలిసి రూ.2400 కోట్లతో ఐటీఐలను ఉన్నతీకరిస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని తమ ప్రభుత్వం నమ్ముతుందని రేవంత్ చెప్పారు. అందుకే రైతులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఇటీవలే రూ.2 లక్షల రుణ మాఫీ పథకం కోసం రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాలో వేశామని.. అయినా రైతుల కష్టాలు తీరడం లేదని వ్యాఖ్యానించారు. "గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన నేను నిశితంగా గమనించి రైతులకు ఓ మాట చెబుతున్నా. కుటుంబంలోని సభ్యులంతా వ్యవసాయంపైనే ఆధారపడొద్దు. ఇద్దరో ముగ్గురో వ్యవసాయంలో ఉండండి. మిగిలిన వారు బయటికి వచ్చి వ్యాపారాలు, ఉద్యోగాల్లో రాణించాలి. అప్పుడే రైతుల కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయి. కృష్ణా, గుంటూరు, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లోని రైతులు వారి పిల్లలను ఐటీ రంగంలో చదివించకపోయి ఉంటే వారి కుటుంబాల్లో నేడు ఆర్థిక ఎదుగుదల రాకపోయేది. ఇతర దేశాల్లో స్థిరపడిన ఎన్నారైల పెట్టుబడులతోనే రాష్ట్రంలో భూముల విలువలు పెరిగాయి" అని సీఎం రేవంత్ చెప్పారు. గతంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒక ఎకరం కొనే ధరలో తెలంగాణలో పది ఎకరాలు కొనేవాళ్లని.. నేడు తెలంగాణలో ఒక ఎకరం ధరలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వంద ఎకరాలు కొనే పరిస్థితి ఉందని అన్నారు.

మహిళలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు..

ఔటర్ రింగురోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఆర్ఆర్ఆర్‌ను అభివృద్ధి చేస్తున్నామని సీఎం చెప్పారు. అమెరికాలో హడ్సన్, లండన్‌లో థేమ్స్ నదుల్లా హైదరాబాద్‌లో మూసీని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటకులు ఇక్కడికి వచ్చి మూసీ నదిని చూసేలా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి తమ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. 63 లక్షల మహిళా సంఘాలను కోటికి పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలను వడ్డీ లేకుండా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రేవంత్ చెప్పారు.

నన్ను బలవంతంగా తీసుకొచ్చారు: భట్టి

'ఇక్కడికి రావడానికి ముందు ముఖ్యమంత్రి నన్ను ఇంటికి పిలిపించారు. అక్కడ ఆయన, మంత్రి శ్రీధర్ బాబు.. నన్ను గంటసేపు కూర్చోబెట్టి.. ఎంఎస్ఎంఈల బకాయిలకు సంబంధించి రూ.2 వేల కోట్లు ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేశారు. ఆ మేరకు సభలో చెప్పాలంటూ నన్ను బలవంతగా ఇక్కడి తీసుకొచ్చారు' అని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పడంతో సభలో నవ్వులు విరిశాయి. మనం ప్రకటించిన హామీలకు ఎంతైనా ఇస్తా.. గత ప్రభుత్వం వదిలి వెళ్లిన బకాయిలను ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినా సీఎం వినలేదని చెప్పారు. ముఖ్యమంత్రి విధానపరమైన నిర్ణయం తీసుకున్నందున రూ.2 వేల కోట్ల బకాయిలు విడతలవారీగా చెల్లిస్తామని భట్టి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఎంతో కష్టపడుతున్నారని ప్రశంసించారు.

గత విధానాలన్నీ కాగితాలకే పరిమితం: శ్రీధర్ బాబు

నూతన ఎంఎస్ఎంఈ విధానం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయమని దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామంటూ గొప్పలు చెప్పారని.. అనేక విధానాలు ప్రకటించినా, అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. తమ విధానాలు కాగితాలకే పరిమితం కావని.. క్షేత్రస్థాయిలోనూ అమలవుతాయని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు
'టిల్మన్' ఆసక్తి

» సీఎంతో ఆ సంస్థ చైర్మన్ అహూజా భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టిల్మన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ చైర్మన్, సీఈవో సంజీవ్ అహూజా సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నట్టు అహూజా తెలిపారని సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా సీఎంను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ జీ రామేశ్వరరావు సచివాలయంలో కలిశారు. కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వానం అందించారు.

రిజిస్ట్రేషన్లు తగ్గినా..
ఆదాయం పెరిగింది!

» గతేడాదితో పోల్చితే 7% తగ్గిన రిజిస్ట్రేషన్లు

» ఆదాయం మాత్రం 6.93% పెరుగుదల..

గతేడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 5 నెలల్లో (ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు) రిజిస్ట్రేషన్లు తగ్గగా.. ఆదాయం మాత్రం పెరిగింది. గతేడాదిలో ఈ ఐదు నెలల పాటు 7.88 లక్షల డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా.. రూ.5,685 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి 7.33 లక్షల రిజిస్ట్రేషన్లు అవగా.. రూ.6,080 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తంగా ఈసారి రిజిస్ట్రేషన్లలో 7.07 శాతం తగ్గుదల నమోదవగా.. ఆదాయం మాత్రం 6.93 శాతం పెరిగింది. ఏదేమైనప్పటికీ ఈ ఏడాది ఆయా నెలల్లో రిజిస్ట్రేషన్ల శాఖ పెట్టుకున్న లక్ష్యాలతో పోల్చితే ఒక్క జూలై మినహా మిగిలిన 4 నెలల్లో దాన్ని చేరుకోలేదు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ జూలైలో రిజిస్ట్రేషన్లు 19.19 శాతం పెరగ్గా.. ఆదాయంలోనూ 112.96 శాతం వృద్ధి కనిపించింది. అదే ఈ ఏడాది ఆగస్టు వచ్చేసరికి గతంతో పోలిస్తే 21.74 శాతం రిజిస్ట్రేషన్లు తగ్గాయి. జూలైలో పెరిగిన రిజిస్ట్రేషన్లు ఆగస్టులో పడిపోవడంపై అధికారుల్లోనూ చర్చ జరుగుతోంది. ఆదాయం ఎక్కువగా వచ్చే రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యల కారణంగా ప్రజలు ఆస్తుల కొనుగోలులో ఆచితూచి వ్యవహరిస్తుండటంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడిందని తెలుస్తోంది.

పీఎఫ్‌సీ, ఆర్ఈసీ
రుణాల వడ్డీ తగ్గించండి!

» రెండు కార్పొరేషన్ల రుణాలు రూ.31,795 కోట్లు

» వీటిని పునర్వ్యవస్థీకరించాలంటూ కేంద్రానికి రేవంత్ సర్కారు వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి ప్రాజెక్టులు, పలు పథకాల కోసం తీసుకున్న నిర్దిష్ట రుణాలను పునర్వ్యవస్థీకరించుకోవడం(రీస్ట్రక్చరింగ్)పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోంది. తెలంగాణలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రుణాలు తీసుకుంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి ఇలాంటి రుణాలను సేకరించింది. ఈ రెండు కార్పొరేషన్ల నుంచి తీసుకున్న రుణాలు ప్రస్తుతం రూ.31,795 కోట్ల వరకు ఉన్నాయి. అప్పట్లో 10.75 నుంచి 11.25 శాతం వరకు వడ్డీకి ఈ అప్పులు తీసుకుంది. ఇంతటి భారీ వడ్డీలను చెల్లించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి తరుణంలో పీఎఫ్‌సీ, ఆర్ఈసీ రుణాలను రీస్ట్రక్చర్ చేసేలా చూడాలంటూ కేంద్రాన్ని కోరుతోంది. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన 16వ ఆర్థిక సంఘాన్ని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఈ రుణాల గురించి ప్రస్తావించారు. వీటిని పునర్వ్యవస్థీకరించడానికి రెండు కార్పొరేషన్లను ఒప్పించేలా కేంద్రానికి సూచించాలని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియాను కోరారు. ఆగస్టులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భట్టి సమావేశమైనప్పుడు కూడా ఇదే డిమాండ్‌ను ముందుంచారు. రుణ చెల్లింపుల కాలాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ రుణాలను ప్రభుత్వం కిస్తీల వారీగా చెల్లించాల్సి వస్తోంది. ఒక్కో రుణానికి 25-48 వరకు కిస్తీలు ఉన్నాయి. వీటన్నింటినీ కలిపి ఒకేసారి చెల్లించేలా దీర్ఘకాలిక రుణాలుగా మార్చాలని ప్రభుత్వం కోరుతోంది. వడ్డీ శాతాలను సాధ్యమైనంత వరకు తగ్గించేలా ఆ కార్పొరేషన్లను ఒప్పించాలని కేంద్రాన్ని అడుగుతోంది.

పునర్వ్యవస్థీకరణ కష్టమే..!

నిజానికి ఆర్బీఐ ద్వారా తీసుకునే మార్కెట్ రుణాలను పునర్వ్యవస్థీకరించుకోవడం అంత సులభం కాదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ రుణాల విషయంలో అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రం ఉంటుందని, పైగా ఈ-వేలం ద్వారా అప్పులు తీసుకుంటుండడంతో వీటిని రీస్ట్రక్చర్ చేయడం సాధ్యం కాదని అంటున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పీఎఫ్‌సీ, ఆర్ఈసీ రుణాలపై దృష్టి సారించింది. ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులతో వీటిని ప్రస్తావించాలని సీఎం, డిప్యూటీ సీఎం భావిస్తున్నారు.

చిన్న పరిశ్రమలకు అండ

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం.. 6 గ్యారంటీలతో ఆదుకుంటామన్న ప్రభుత్వం

» నూతన ఎంఎస్ఎంఈ విధానం ఆవిష్కరణ
» 10 పారిశ్రామిక పార్కుల ఏర్పాటు
» 5% మహిళలు, 15% ఎస్సీ, ఎస్టీలకు
» ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.కోటి, ఇతరులకు రూ.30 లక్షల పెట్టుబడి రాయితీ
» స్కిల్ వర్సిటీలో ఎంఎస్ఎంఈ కోర్సులు
» 30 ఏళ్ల లీజుకు భూమి కేటాయింపు
» ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ముడిసరుకు సరఫరా
» 24 గంటల వ్యాపారానికి అనుమతులు



హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే రంగమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) మరింతగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి రాయితీ కల్పించడం నుంచి ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అవసరమైన సహకారం అందించేదాకా ఈ ప్రోత్సాహం ఉండనుంది. ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసిన ప్రభుత్వం.. బుధవారం ప్రకటించిన నూతన ఎంఎస్ఎంఈ విధానంలో వీటికి పరిష్కారాలు చూపిస్తూ అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలను వెల్లడించింది. ఆరు గ్యారంటీల రూపంలో వీటిని ప్రకటించింది. వీటిలో.. ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడం, మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించడం, పరిశ్రలకు అవసరమయ్యే స్థలాలను 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడం, పరిశ్రమలకు ముడిసరుకును ప్రభుత్వమే సరఫరా చేయడం లాంటి నిర్ణయాలు ఉన్నాయి. హైటెక్‌సిటీ శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం ఎంఎస్ఎంఈ పాలసీని మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త విధానాన్ని రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు స్వాగతించారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రం పారిశ్రామిక విప్లవం దిశగా మరింత వేగంగా పయనిస్తుందని వివిధ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

విడతల వారీగా పెండింగ్ బకాయిలు..

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 26.05 లక్షలు ఉన్నాయి. వీటిలో 32.67 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే రెండో అతిపెద్ద రంగం ఇదే. అయితే ప్రతి ఏటా వృద్ధి నమోదు కావాల్సిన ఈ రంగం.. గత కొన్నేళ్లుగా నష్టాల్లో కొనసాగుతోంది. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన పెట్టుబడుల నుంచి ఉత్పత్తి విక్రయాల వరకు.. అడుగడుగునా సవాళ్లే ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కొవిడ్ తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. నష్టాలు భరించలేక రాష్ట్రంలో వేలాది సంఖ్యలో చిన్నతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. అనేక పరిశ్రమలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వం అందించే సబ్సిడీలు ఎంతో కొంత ఆసరాగా ఉంటాయని భావిస్తే.. అదీ లేకుండా పోయింది. గత ఐదారేళ్లుగా ప్రభుత్వం అందించాల్సిన దాదాపు రూ.3 వేల కోట్ల రాయితీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా ప్రభుత్వం నుంచీ సహకారం లేకపోవడంతో నిరాశ, నిస్తేజంలో ఉన్న పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఎంఎస్ఎంఈ విధానం నూతన ఉత్సాహాన్ని అందించింది. ఇప్పటికే పెండింగులో ఉన్న రూ.3 వేల కోట్ల రాయితీలను విడతల వారీగా విడుదల చేస్తామని ప్రకటించడంతోపాటు అనేక కొత్త ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది.

భూమి కేటాయింపు.. పెట్టుబడుల్లో రాయితీ..

పరిశ్రమల స్థాపనకు ఎదురవుతున్న భూమి సమస్యను పరిష్కరించేందుకుగాను త్వరలో ఓఆర్ఆర్-ట్రిపుల్ఆర్ మధ్య అభివృద్ధి చేయనున్న 10 కొత్త పారిశ్రామిక పార్కుల్లో ఐదింటిని ఎంఎస్ఎంఈలకు కేటాయించనున్నారు. వీటిలో ఒకటి మహిళల యాజమాన్యంలోని ఎంఎస్ఎంఈలకు, మరొకటి వినూత్న స్టార్టప్‌లకు కేటాయిస్తారు. ఇందులో భూమిని 30 ఏళ్లకు లీజుకు అందిస్తారు. ఈ పారిశ్రామిక పార్కుల్లో 5శాతం మహిళలకు, 15శాతం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తారు. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ వ్యవస్థాపకులకు 50 శాతం భూమిని రాయితీగా ఇస్తారు. అంతేకాకుండా అన్ని సౌకర్యాలతో ప్రభుత్వమే ప్రైవేటు భాగస్వామ్యంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలు నిర్మిస్తుంది. పరిశ్రమలకు పెట్టుబడికి మూలధనం కోసం ఇబ్బంది పడకుండా.. ఎస్సీ, ఎస్టీ వర్గాల వ్యవస్థాపకులకు తయారీ యూనిట్లకు 50 శాతం రాయితీ ఇస్తారు. ఇతర అన్ని ఎంఎస్ఎంఈలకు 25శాతం సబ్సిడీ ఇస్తారు. ఇక ఉత్పత్తుల విక్రయాల ఆధారంగా భవిష్యత్తులో రుణం పొందేందుకు పైలట్ ప్రోగ్రాం కూడా చేపడతారు.

ముడి పదార్థాల లభ్యత.. సుంకం తిరిగి చెల్లింపు

పరిశ్రమల నిర్వహణకు ముడి పదార్థాల సమస్య రాకుండా ప్రభుత్వమే ముడిపదార్థాలను అందుబాటులో ఉంచుతుంది. ముడిసరుకు దిగుమతిపై విధించిన సుంకాన్ని తిరిగి చెల్లిస్తుంది. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో 10 ఎంఎస్ఎంఈ క్లస్టర్లను, వాటి చుట్టూ కొత్త పారిశ్రామిక సౌకర్య కేంద్రాలు (కామన్ ఫెసిలిటీ సెంటర్) ఏర్పాటు చేస్తుంది. ఎంఎస్ఎంఈల్లో నాణ్యమైన కార్మిక వనరుల కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెడతారు. ఎంఎస్ఎంఈల కోసం కార్మిక చట్టాలకు సంబంధించిన నిబంధనల్ని సరళీకృతం చేస్తారు. వీటితోపాటు కొత్త సాంకేతికత, యంత్రాలు అందించేందుకు రూ. 100 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) రిజిస్ట్రేషన్‌ను ప్రోత్సహించడం కోసం వందశాతం రిజిస్ట్రేషన్ ఖర్చును రీయింబర్స్‌మెంట్‌గా ఇస్తారు.

వ్యాపార విస్తరణ.. 24 గంటల సేవలకు ప్రత్యేక విభాగం

భారీ పరిశ్రమలకు కావాల్సిన భాగాలు, ఉత్పత్తులను ఎంఎస్ఎంఈలు అందించేలా ప్రోత్సహిస్తారు. ఎంఎస్ఎంఈలకు 24 గంటలపాటు నిరంతర సేవలు, మద్దతు అందించేందుకు పరిశ్రమల శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. దీని పర్యవేక్షణకు పరిశ్రమల శాఖ మంత్రి నేతృత్వంలో రాష్ట్ర ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని నియమిస్తారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు, ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు 24 గంటల పాటు వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతిస్తుంది. కొన్ని పరిమితులతో ఏడాదంతా నిరంతరంగా వ్యాపారం నిర్వహించేందుకు అనుమతిస్తుంది. దీనికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988లో సవరణలు చేస్తుంది.

లెబనాన్‌లో మళ్లీ పేలుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మృతిచెందగా.. 300 మంది తీవ్రంగా గాయపడ్డారు. లెబనాన్ కాలమానం ప్రకారం.. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఏకకాలంలో బీరుట్ సహా.. దక్షిణ లెబనాన్ వరకు పేలుళ్లు సంభవించాయి. దక్షిణ లెబనాన్‌లోని దహియా, మౌంట్ లెబనాన్, సిడాన్, మార్జ్ ఆయున్, అల్-అజియా, అల్-సర్బాండ్, బెకా లోయలోని బాల్‌బెక్‌లో వీటి తీవ్రత ఎక్కువగా ఉందని లెబనాన్, ఇరాన్ మీడియా సంస్థలు వెల్లడించాయి. కొన్నిచోట్ల.. వాకీటాకీలు నడుముకు పెట్టుకుని, ద్విచక్రవాహనాలపై వెళ్తున్నవారు.. పేలుళ్ల ధాటికి చూస్తుండగానే అగ్నికి ఆహుతయ్యారని.. మరికొందరి మృతదేహాలు గుర్తించడానికి కూడా వీల్లేని విధంగా కాలిపోయాయని లెబనాన్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.



బుధవారం లెబనాన్ ప్రయోగించిన రాకెట్లను గాల్లోనే ధ్వంసం చేస్తున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ

ట్రాకింగ్‌కు దొరకొద్దనే..

ఇజ్రాయెల్ నిఘావర్గాలు మొబైల్ ఫోన్ సెల్‌టవర్ సిగ్నల్ ట్రాకింగ్, ట్యాపింగ్‌లతో పలువురు హిజ్బుల్లా నేతలను మట్టుబెట్టారు. దీంతో హిజ్బుల్లా సెల్‌ఫోన్లను కాకుండా.. పేజర్లు, వాకీటాకీలపై ఆధారపడింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత.. పేజర్ల వినియోగాన్ని మరింతగా పెంచాయి. ఈ ఏడాది ఆరంభంలో తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో అనే కంపెనీ నుంచి 5వేల వరకు పేజర్లను ఆర్డర్ చేశాయి. వాటిని ఇటీవలే హిజ్బుల్లా తమ ఫైటర్లకు అందజేసింది. కొత్తగా వాకీటాకీలను కొనుగోలు చేసింది. ఎఫ్‌ఎం సిగ్నల్ ట్యాంపరింగ్ పరికరాలతో కార్లలో, ఇళ్లలో వాడే ఎఫ్‌ఎం పరికరాల్లోకి చొరబడి, తమ సందేశాలను పౌరులకు చేరవేస్తోందనే వాదనలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ప్రత్యామ్నాయాలే హిజ్బుల్లా పాలిట మృత్యువుగా మారుతున్నాయి. పేజర్లు, వాకీటాకీలు పేలి.. మరణాలు సంభవించాయి.

పేజర్లలో పేలుడు చిప్

మంగళవారం జరిగిన దాడిలో 3 వేల వరకు పేజర్లు పేలిపోయినట్లు హిజ్బుల్లా వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. మిగతా వాటిని పరిశీలిస్తే.. అన్నింటిలో లిథియం అయాన్ బ్యాటరీలతోపాటు.. పేజర్ సర్క్యూట్‌తో సంబంధం లేని ఓ మైక్రోచిప్ కనిపించిందని, అందులో పీఈటీఎన్ పేలుడు పదార్థం ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నాయి. దీన్ని బట్టి ఈ దాడిని దీర్ఘకాలిక వ్యూహాత్మక కుట్ర అని ఆరోపిస్తున్నాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌పై నింద మోపుతూ.. ఆ దేశంపై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించాయి. మరోవైపు ఈ ఆల్ఫా-న్యూమరిక్ పేజర్లను తయారు చేసిన తైవాన్ కంపెనీ గోల్డ్ అపోలో మాత్రం తమకేపాపం తెలియదని ప్రకటన చేసింది. బీఏసీ అనే హంగరీ దేశ కంపెనీ ఏఆర్ 924 మోడల్ పేజర్లను తయారు చేస్తుందని, తాము బ్రాండింగ్ మాత్రమే ఇస్తామని పేర్కొంది. అయితే.. హంగరిలోని బీఏసీ చిరునామాలో నిర్మాణంలో ఉన్న ఓ ఇల్లు మాత్రమే ఉందని, అది షెల్ కంపెనీ అయ్యి ఉంటుందని రాయిటర్స్ తెలిపింది. హిజ్బుల్లా వర్గాలు, లెబనాన్ సర్కారు మాత్రం.. పేజర్ల తయారీ సమయంలోనే అనుమానాస్పద మైక్రోచిప్‌ను పెట్టి ఉంటారని, లేదంటే.. తైవాన్ నుంచి వాటి రవాణా సమయంలో పీఈటీఎన్ పేలుడు పదార్థాన్ని అమర్చి ఉంటారని చెబుతున్నాయి. పీఈటీఎన్ పేలుడు పదార్థాన్ని విరివిగా వినియోగించే చరిత్ర ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు ఉందని గుర్తుచేస్తున్నాయి. కాగా.. మంగళవారం నాటి పేలుళ్ల ఘటనల్లో మృతుల సంఖ్య 12కు చేరుకుందని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫెరాస్ అల్ అబిద్ వెల్లడించారు.



గోల్డ్ అపోలో కంపెనీ పేజర్

తీవ్రత ఎక్కువే..!

పీఈటీఎన్ పేలుడు పదార్థం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని బాంబు నిపుణులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.45 సమయంలో(లెబనాన్ కాలమానం ప్రకారం) మూకుమ్మడిగా పేలుళ్లు జరిగాయి. అంతకు 10 సెకన్ల ముందు అన్ని పేజర్లకు ఒకేసారి సందేశాలు వచ్చాయి. వాటిని చదువుదామని పేజర్లను ముఖానికి దగ్గరగా తీసుకున్న వారికి తీవ్ర గాయాలైనట్లు లెబనాన్ వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంతోనే.. లెబనాన్‌లో ఇరాన్ రాయబారి ముజ్తబా అమానీ ఒక కంటిని పోగొట్టుకున్నారని, రెండో కన్ను తీవ్రంగా దెబ్బతిన్నదని పేర్కొన్నాయి. తొలుత అంతా మాల్‌వేర్ ప్రభావంతో ఏకకాలంలో పేలుళ్లు జరిగినట్లు భావించినా.. పేజర్లలో ఉండే కొద్దిపాటి మెమొరీకి మాల్‌వేర్ స్టోరేజీ సామర్థ్యం ఉండదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పేజర్ల తయారీ సమయంలో.. లేదా రవాణా సమయంలోనే పేలుడు పదార్థంతో పాటు.. టైమర్‌లో ప్రోగ్రామింగ్ చేసి ఉంటారని వివరిస్తున్నారు.



హిజ్బుల్లాకు భారీ నష్టం..!

12 మంది మృతుల్లో ఇద్దరు చిన్నారులను మినహాయిస్తే.. మిగతా వారంతా హిజ్బుల్లా నాయకులే..! వారి ఫొటోలను హిజ్బుల్లా బుధవారం ఉదయం తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో విడుదల చేసింది. బుధవారం నాటి మరణాల్లోనూ నలుగురైదుగురు హిజ్బుల్లా నేతలున్నాయి. మిగతా వారిలో సానుభూతిపరులున్నారు. రెండు ఘటనల్లో.. 3,300 మందికి పైగా క్షతగాత్రుల్లోనూ హిజ్బుల్లా ఫైటర్లు, సానుభూతిపరులు, నాయకులు ఉన్నారు. పేజర్ బాంబుల వల్ల చాలా మందికి కళ్లు, తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని బట్టి హిజ్బుల్లా ఇప్పట్లో కోలుకునే సూచనలు కనిపించడం లేదు.

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత!

పేజర్ బాంబుల ఘటనతో పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంటోంది. ప్రతీకారం తీర్చుకుంటామని హిజ్బుల్లా ఇప్పటికే ప్రకటించగా.. ఇరాన్ కూడా అలాంటి శపథమే చేసింది. తమ రాయబారిపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. ప్రతిస్పందనకు సిద్ధపడుతామని హెచ్చరించింది. ఈజిప్టు అధ్యక్షుడు ఫతాహ్ ఎల్‌సిసీ కూడా బుధవారం కైరోలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్‌తో చర్చలు జరిపిన సందర్భంలో 'ఆపరేషన్ తెనెటీగలు'పై మాట్లాడారు. తాము లెబనాన్‌కు అండగా ఉంటామని పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ హిజ్బుల్లాతో యుద్ధాన్ని తీవ్రతరం చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

కొత్త మోడల్ వాకీటాకీలే

కొత్తగా తెప్పించిన పేజర్లు మంగళవారం పేలిపోయినట్లుగానే.. ఐదారు నెలల క్రితం హిజ్బుల్లా వర్గాలు తెప్పించిన ఐకామ్ కంపెనీకి చెందిన వీ82ఎస్ మోడల్ వాకీటాకీలు బుధవారం విస్ఫోటం చెందాయని అల్-జజీరా కథనాలను ప్రసారం చేసింది. బీరుట్‌లో.. ఒక్క దహియా ప్రాంతంలోనే 15-20 పేలుళ్లు సంభవించి, పలు అపార్ట్‌మెంట్లు, ఇళ్లు దెబ్బతిన్నట్లు పేర్కొంది. దహియాలో.. హిజ్బుల్లా ఎంపీ అలీఅమర్ కుమారుడి అంత్యక్రియల్లోనూ పేలుళ్లు సంభవించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



రష్యా అణ్వాయుధ కేంద్రం దాడికి ముందు, దాడి తర్వాత ఎగిసిన దట్టమైన పొగ (మాక్సర్ ఉపగ్రహ చిత్రాలు)

భూమి కంపించేలా దాడి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించాయి. అయితే.. రష్యా మాత్రం ఈ ఘటనపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉక్రెయిన్ సరిహద్దులకు 470 కిలోమీటర్లు.. మాస్కోకు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్వెర్ ప్రావిన్స్‌లోని తురుపెట్ గ్రామంలో రష్యా భారీ ఆయుధ డిపో కొనసాగుతోంది. ఈ విషయాన్ని రష్యా 2018లోనే ప్రకటించింది. అప్పటి రష్యా రక్షణశాఖ సహాయ మంత్రి దిమిత్రి బుల్గాకోవ్(ప్రస్తుతం అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్నారు) ఈ కేంద్రం వైమానిక దాడులు.. బాలిస్టిక్ క్షిపణి దాడుల నుంచి తట్టుకుంటుందని ప్రకటించారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ మొదలైన తొలినాళ్లలో మాస్కో నుంచి పలు ఆయుధాలను ఇక్కడికి తరలించినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉక్రెయిన్ తన సరిహద్దుల్లోని ఐదు వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ ఆయుధాగారాన్ని లక్ష్యంగా చేసుకుని, 52 గైడెడ్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. అయితే.. ఏ తరహా డ్రోన్లను ప్రయోగించారనే దానిపై ఉక్రెయిన్ సైనికవర్గాలు వివరాలను వెల్లడించలేదు. రష్యా కూడా 46 క్షిపణులను గాల్లోనే పేల్చేసినట్లు ఆ దేశ అధికారిక వార్తాసంస్థ ఆర్‌ఐఏ పేర్కొంది. అయితే.. మూడు గైడెడ్ క్షిపణులు లక్ష్యాన్ని తాకినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఫలితంగా ఆయుధాగారం అగ్నికి ఆహుతైంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర భూకంపం వచ్చిందా? అన్నట్లుగా భూమి కంపించినట్లు రాయిటర్స్ పేర్కొంది. ఈ ప్రావిన్స్‌లో 11 వేల జనాభా ఉంటుందని, అయితే.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేసింది. రష్యా నెటిజన్లు మాత్రం.. పేలుడు ధాటికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లోని ఇళ్లు కూలిపోవడం.. పైకప్పులు ఎగిరిపోవడం వంటి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. "శక్తిమంతమైన పేలుడు సంభవించింది. ఆయుధాగారం నుంచి ఇంకా మంటలు వస్తున్నాయి. రష్యా ప్రభుత్వం క్షిపణులను దాచేందుకు మరెక్కడా భూగర్భంలో చోటు దొరకలేదా?" అంటూ ఓ నెటిజన్ బుధవారం మధ్యాహ్నం లైవ్ దృశ్యాలను షేర్ చేశారు. దూరంగా భారీ అగ్నిగోళం కనిపించిందని మరికొందరు నెటిజన్లు వీడియోలను పోస్ట్ చేశారు. ఆయుధ డిపోతోపాటు.. ఆర్టిలరీ సిబ్బంది క్వార్టర్స్ కూడా అగ్నికి ఆహుతైనట్లు ఉక్రెయిన్ సైనికవర్గాలు తెలిపాయి. "200 నుంచి 240 టన్నుల మేర శక్తిమంతమైన పేలుళ్లు జరిగాయని భావిస్తున్నాం. బుధవారం మధ్యాహ్నానికి కూడా మంటలు చెలరేగుతూనే ఉన్నాయి" అని వివరించాయి. రష్యా ఇటీవల ఉత్తరకొరియా నుంచి తెప్పించిన క్షిపణులను కూడా ఈ కేంద్రంలోనే నిల్వ చేసినట్లు తమకు సమాచారం ఉందని పేర్కొన్నాయి.

రేడియేషన్‌పై ఆందోళన?

నాసా వర్గాలు బుధవారం విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఉక్రెయిన్ మీడియా పేర్కొంది. ఇజ్రాయెల్ మీడియా వైనెట్ కూడా దీనిపై కథనాలను ప్రసారం చేసింది. ఉపగ్రహ చిత్రాలను బట్టి.. పేలుడు జరిగిన ప్రాంతం చుట్టూ 14 చదరపు కిలోమీటర్ల మేర రేడియేషన్‌ను గుర్తించినట్లు పేర్కొంది. అయితే.. నాసా అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రం ఈ వివరాలు అందుబాటులో లేవని పలు వార్తాసంస్థలు తెలిపాయి.

రాహుల్ ప్రాణాలకు ముప్పు

- ప్రధాని మోదీ, షాకు తెలిసే కుట్ర
- బీజేపీ నేతల బెదిరింపులే నిదర్శనం
- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ/చెన్నై/బెంగళూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రాణాలకు ముప్పు ఉందని ఆ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. ఆయనను అంతమొందించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని, వారం రోజులుగా బీజేపీ నాయకుల బెదిరింపులే అందుకు నిదర్శనమన్నారు. బుధవారం కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ అభిషేక్ సింఘ్వీ ఢిల్లీలో, కర్ణాటక సీఎం సిద్దరామయ్య బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు తెలిసే రాహుల్‌పై కుట్ర జరుగుతోందని వేణుగోపాల్ ఆరోపించారు. రాహుల్‌కున్న ప్రజాదరణను బీజేపీ సహించలేకపోతోందన్నారు. మోదీ ప్రభుత్వం రాహుల్‌పై ద్వేషాన్ని, హింసను ప్రేరేపిస్తోందని సింఘ్వీ మండిపడ్డారు. ఇందిరాగాంధీకి పట్టిన గతే రాహుల్‌కు పడుతుందని బీజేపీ బెదిరిస్తోందని సిద్దరామయ్య అన్నారు. రాహుల్‌ను బెదిరించిన అందరిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఐదేళ్లపాటు పాలన కొనసాగించలేరని స్పష్టమవుతోందని, నితీశ్ కుమార్, చంద్రబాబు ఎక్కువకాలం కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉండరనిపిస్తోందన్నారు. రాహుల్‌కు తగిన భద్రత కల్పించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



వైద్యులను అభినందిస్తున్న నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప

నిమ్స్ వైద్యులకు ఐసీఎంఆర్ గుర్తింపు

- కొవిడ్ కష్ట కాలంలో సేవలకు ప్రశంసా పత్రాల అందజేత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికించిన కరోనా కష్టకాలంలో మూడేళ్లపాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించిన నిమ్స్ వైద్యులకు ఐసీఎంఆర్ గుర్తింపు దక్కింది. ఈ మేరకు నిమ్స్ వైద్యుల సేవల్ని కొనియాడుతూ ప్రశంసా పత్రాలను అందజేసింది. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నవల్ చంద, వైఎస్ఎన్ రాజు, సుబ్బలక్ష్మి, హుస్సేన్, మైక్రో బయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉమబాల, తేజ, పద్మజా, ఎంవీఎల్ఎన్ రామ్మోహన్ ఉన్నారు. ఐసీఎంఆర్ సహకారంతో గాంధీ, ఈఎస్ఐ, ఎంజీఎం ఆస్పత్రులను సమన్వయం చేసుకుంటూ కొవిడ్ సేవలను వేగంగా అందించేందుకు నిమ్స్ వైద్యులు ఎప్పటికప్పుడు నివేదికలను అందించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వైద్యులను నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, సీనియర్ వైద్యులు బుధవారం అభినందించారు.

భద్రాచలం దేవస్థానం ప్రధాన అర్చకుడిపై వేటు

- అర్చకుడైన ఆయన కుమారుడినీ సస్పెండ్ చేసిన ఈవో

భద్రాచలం,సెప్టెంబరు 18: కోడలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులుపై సస్పెన్షన్ వేటు పడింది. అదే దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్న సీతారామానుజాచార్యులు కుమారుడు పొడిచేటి సీతారామం కూడా సస్పెండ్ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి బుధవారం జారీ చేశారు. తన మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, రూ.10 లక్షలు తీసుకురావాలని అత్త, ఇతర కుటుంబసభ్యులు తనని వేధిస్తున్నారని సీతారామానుజాచార్యులు కోడలు ఏపీలోని తాడేపల్లిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగస్టు 14న కేసు నమోదైంది. ఈ కేసు విషయాన్ని సీతారామానుజాచార్యులు దేవస్థానం దృష్టికి తీసుకెళ్లలేదు. రెండ్రోజుల క్రితం కేసు విషయం బయటికి రాగా.. సీతారామానుజాచార్యులు, సీతారామంకు ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. ఇప్పుడు దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇరువురిని సస్పెండ్ చేశారు.

తొలి నుంచి వివాదాస్పదుడే..

భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకుడిగా ఉన్న పొడిచేటి సీతారామానుజాచార్యులకు తొలి నుంచి వివాదాస్పదుడనే పేరుంది. గతంలో పలువురు వైదిక సిబ్బంది పదోన్నతుల అంశంలో ఆయన వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. దేవాలయ అంతరాలయంలో పూజలు నిర్వహించే అవకాశం కేవలం అనువంశిక అర్చకులకే ఉంటుంది. తన దత్తపుత్రుడు సీతారామానికి ఆ అవకాశం దక్కేందుకు ఆయన చేసిన ప్రయత్నాలపై ఇతర అర్చకులు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఇక, తొమ్మిదేళ్ల క్రితం అమ్మవారి ఆభరణాలు మాయమై ప్రత్యక్షమైన ఘటనలో సీతారామానుజాచార్యులు శాఖాపరమైన చర్యలు ఎదుర్కొన్నారు. ఇక, గతంలో మాఢ వీధుల అభివృద్ధి కోసం దేవస్థానానికి స్థలం ఇచ్చేందుకు నిరాకరిస్తూ సీతారామానుజాచార్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన ఖగోళయాత్రలో పాల్గొని దేవదాయశాఖ, దేవస్థానంమార్గదర్శకాలను ఉల్లంఘించి విమర్శల పాలయ్యారు.

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధిని కాంగ్రెస్ తనఖాతాలో వేసుకుంటోంది: హరీశ్



హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనలో ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి, కేసీఆర్ సాధించిన విజయాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాల్లో వేసుకుంటూ గొప్పలు చెప్పుకుంటోందని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎంఎస్ఎంఈలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. చాలా రాష్ట్రాల్లో ఎంఎస్‌ఎంఈలు మూతబడినా.. తెలంగాణలో అనుసరించిన ఐపాస్ విధానం ఈ రంగాన్ని దృఢంగా నిలిపిందని అన్నారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 30శాతం ఉద్యోగావకాశాలు లభించాయని, ఎంఎస్‌ఎంఈ రంగంలో స్థిరమైనవృద్ధి నమోదుచేసి.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని తమ ఘనతగా చెప్పుకొంటోందని విమర్శించారు.

వంద రోజుల పాలనలో చరిత్రాత్మక నిర్ణయాలు

ఓర్వలేకే మోదీపై రాహుల్ విమర్శలు: లక్ష్మణ్



హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడో సారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మోదీ.. వంద రోజుల పాలనలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. ప్రజల్లో మోదీ పట్ల పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోందని ఎద్దేవా చేశారు. ప్రధానిని తక్కువ చేసి చూపేందుకే రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వికసిత్ భారత్‌కు ఈ వంద రోజుల పాలనే రోడ్ మ్యాప్ అని పేర్కొన్నారు. ఈ ప్రగతి నివేదికను ప్రజల ముందు పెడుతున్నామని, అందులో వాస్తవాలు లేవని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

జమిలితో సమయం ఆదా: ఏలేటి



జమిలి ఎన్నికలతో దేశం అభివృద్ధి చెందడమే కాకుండా... డబ్బు, సమయం ఆదా అవుతాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎన్నికలు జరగడం వల్ల ఆర్థిక నష్టంతో పాటు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టాక ప్రతిపక్ష నాయకులందరికీ మాట్లాడే అవకాశం దొరుకుతుందని, అభ్యంతరాలుంటే అప్పుడు చెప్పాలని సూచించారు.

15 రోజుల్లోగా కూల్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతులు పొందకుండా ఎకరం విస్తీర్ణంలో పార్టీ కార్యాలయం నిర్మించి.. ఆ తర్వాత భవన క్రమబద్ధీకరణ పథకం (బీఆర్‌ఎస్) కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు పెట్టుకోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి అతి తక్కువ ధరకు భూములు కేటాయిస్తూ జీవో జారీచేసింది. నల్లగొండ జిల్లాకు సంబంధించి నల్లగొండలోని సర్వే నంబర్ 1506లో కేటాయించిన ఎకరం భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా భవనం నిర్మించారు. దీన్ని క్రమబద్ధీకరించాలని దరఖాస్తు పెట్టుకోగా.. మునిసిపల్ కమిషనర్ తిరస్కరించారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు జారీచేశారు. కమిషనర్ నిర్ణయాన్ని, నోటీసులను సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ టి.వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. సంబంధిత అధికారుల అనుమతి పొందకుండా నిర్మించి, తర్వాత క్రమబద్ధీకరణకు దరఖాస్తు పెట్టుకోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలు రూపొందించి.. తర్వాత వాటిని ఉల్లంఘిస్తామంటే కుదరదని తెలిపింది. సాధారణ పౌరులకైనా, బీఆర్‌ఎస్ పార్టీకి అయినా చట్టం ఒక్కటేనని స్పష్టంచేసింది. కనీసం జరిమానా నుంచైనా వినహాయింపు ఇవ్వాలన్న విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. బీఆర్‌ఎస్ పార్టీ దేశంలోనే అత్యంత ఆర్థిక సంపత్తి కలిగిన పార్టీ అని.. ఈ ఖర్చులు చెల్లించడం పెద్ద లెక్క కాదని వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తాం

హైకోర్టు తీర్పుపై తాము సుప్రీంకోర్టులో అప్పీలు చేస్తామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఏ పార్టీ కార్యాలయాలకూ అనుమతులు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాగా, ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ భవనాన్ని కూల్చివేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇప్పుడు హైకోర్టు కూడా ఆదేశించడంతో భవనం కూల్చివేతపై మునిసిపాలిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కోర్టు తీర్పు అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. హైకోర్టు తీర్పుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

109 మంది ఇంజనీర్లు, 15 మంది వైద్యులు

ఎస్‌వీపీ ఎన్‌పీఏలో 188 మంది యువ ఐపీఎస్‌లకు శిక్షణ పూర్తి.. వారిలో ఇంజనీరింగ్ పట్టభద్రులే అధికం

- 76వ ఆర్ఆర్ బ్యాచ్ ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ రేపు
- తెలంగాణ, ఏపీకి చెరో నలుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌వీపీ ఎన్‌పీఏ)లో 188 మంది యువ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 76వ ఆర్ఆర్(రెగ్యులర్ రిక్రూట్) ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వీరి పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం జరగనుంది. అయితే, ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఇంజనీరింగ్ పట్టభద్రులు అత్యధికంగా ఉండగా, ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు కూడా ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 188 మంది ట్రైనీ ఐపీఎస్‌ల్లో ఇంజనీరింగ్ చదివిన వారు 109 మంది, ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు 15 మంది ఉండడం విశేషం. అలాగే, లా (న్యాయశాస్త్రం) పట్టా పొందిన వారు నలుగురు ఉండగా, ఆర్ట్స్ విభాగంలో డిగ్రీ పొందిన వారు 28 మంది, సైన్స్ విభాగాల్లో డిగ్రీ చేసిన వారు 22 మంది, కామర్స్ విభాగం వారు ఎనిమిది మంది, ఇతర డిగ్రీలు చేసిన వారు ఇద్దరు ఉన్నారు. ఇక, 188 మంది ట్రైనీ ఐపీఎస్‌ల్లో యువత అధికంగా ఉన్నారు. 25 ఏళ్ల లోపు వారు 15 మంది ఉండగా, 25-28 ఏళ్ల లోపు వారు 102 మంది ఉన్నారు. మొత్తం 54 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండగా వారిలో 38 మంది అవివాహితలు. అలాగే, 134 మంది పురుషుల్లో 116 మంది అవివాహితులు ఉన్నారు. కాగా, 76వ ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూట్) ఐపీఎస్ బ్యాచ్‌లో 188 మంది భారతీయులు, 19 మంది విదేశీయులు కలిపి మొత్తం 207 మంది ఫేస్-1 బేసిక్ కోర్సులో శిక్షణ పూర్తి చేశారని అకాడమీ డైరెక్టర్ డైరెక్టర్ అమిత్ గార్గ్ తెలిపారు. 19 మంది విదేశీయుల్లో నేపాల్, భూటాన్, మారిషస్, మాల్దీవులకు చెందిన వారు ఉన్నారన్నారు. గత ఐదేళ్లతో పోలిస్తే ఈ బ్యాచ్‌లో మహిళల సంఖ్య పెరిగిందని చెప్పారు. విధి నిర్వహణలో ఎదురయ్యే అన్ని రకాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రొబెషనరీ ఐపీఎస్‌లకు శిక్షణ అందించామని తెలిపారు. అభ్యర్థులందరికీ శిక్షణ కాలంలో కొత్త నేర చట్టాలపై పూర్తి అవగాహన కల్పించామని, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక తరగతులు నిర్వహించామని అన్నారు. శుక్రవారం ఉదయం జరిగే పాసింగ్ అవుట్ పరేడ్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని గార్గ్ పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు చెరో నలుగురు...

కేంద్ర ప్రభుత్వం 76వ ఆర్ఆర్ బ్యాచ్ నుంచి తెలంగాణకు నలుగురు, ఏపీకి నలుగురు ఐపీఎస్‌లను కేటాయించింది. మన్నన్ భట్, రుత్విక్ సాయి కొట్టే, సాయికిరణ్ పత్తిపాక, యాదవ్ వసుంధర ఫౌరెబిను తెలంగాణకు కేటాయించారు. ఇక, ఏపీకి కేటాయించిన వారిలో దీక్ష, మనీషా వెంగలరెడ్డి, సుష్మిత, బొడ్డు హేమంత్ ఉన్నారు.

సొంత రాష్ట్రంలో పోస్టింగ్‌తో హ్యాపీ

వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామంలో వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబం మాది. ఎంబీఏ చేసి కార్పొరేట్ సెక్టార్‌లో పనిచేశా. స్నేహితులు కొందరు సివిల్స్‌కు సిద్ధమవుతుండడం చూసి నాకు ఆసక్తి కలిగింది. ఉద్యోగం మానేసి సివిల్స్‌పై దృష్టి పెట్టా. మూడో ప్రయత్నంలో ఐపీఎస్ అయ్యా. నన్ను సొంత రాష్ట్రానికి కేటాయించడం సంతోషంగా ఉంది.

- సాయి కిరణ్ పత్తిపాక

శిక్షణలో ఎంతో నేర్చుకున్నా

మాది వరంగల్. నాన్న సోషల్ వెల్ఫేర్ విభాగం ఉద్యోగి. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీలో శిక్షణ తీసుకున్నా. సొంత రాష్ట్రానికి అలాట్ అయినందుకు ఆనందంగా ఉంది. శిక్షణలో ఎంతో నేర్చుకున్నా. బాధితులకు న్యాయం చేసేలా పని చేస్తా.

- రుత్విక్ సాయి కొట్టే

పరిస్థితులే సివిల్స్ వైపు నడిపించాయి

వ్యవసాయ కుటుంబం మాది. నా కుటుంబ నేపథ్యం, గ్రామీణ పరిస్థితులు నన్ను సివిల్స్ వైపు ప్రభావితం చేశాయి. ఇంటర్, డిగ్రీ నుంచి సివిల్స్ సాధించేందుకు అవసరమైన శిక్షణ తీసుకున్నా. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా అకాడమీలో ఇచ్చిన శిక్షణ.. విధులు సక్రమంగా నిర్వహించగలమనే నమ్మకాన్ని ఇచ్చింది. సొంత రాష్ట్రానికి అలాట్ కావడం సంతోషంగా ఉంది.

- మనీషా వెంగలరెడ్డి(ఏపీ కేడర్)

మా నాన్న వల్లే సివిల్స్ వైపు అడుగులు

మాది విశాఖపట్నం. నాన్న స్టీల్ ప్లాంట్ ఉద్యోగి. అమ్మ ఉపాధ్యాయురాలు. చిన్నప్పటి నుంచి మా నాన్న సివిల్ సర్వీసెస్ గొప్పతనం గురించి చెప్ప డం వల్లే ఈ రంగాన్ని ఎంచుకున్నా. ఐఐటీ ముంబైలో చదువుతున్నప్పుడే సివిల్స్ లక్ష్యంగా మార్చుకుని సన్నద్ధం అయ్యా. మూడో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించా. సొంత రాష్ట్రానికి కేటాయించడం సంతోషంగా ఉంది.

- హేమంత్ బొడ్డు (ఏపీ క్యాడర్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 19 సెప్టెంబరు 2024

ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.



సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారికోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000(పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).


తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరితేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

ఎన్ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీ హెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



కోర్సు, సీట్లు

- యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.
- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్‌లో

ప్రొఫెషనల్ సర్టిఫికెట్

రిమైండర్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం)- 'ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్(పీసీపీ-టీటీఎం)'ను అందిస్తోంది. టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ వ్యవధి 45 రోజులు. నవంబరు 4 నుంచి డిసెంబరు 18 వరకు ట్రెయినింగ్ సెషన్స్ ఉంటాయి. ఫ్రెషర్స్, టీ ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ సహా టీ మాన్యుఫాక్చరింగ్, టీ ప్రొడక్షన్, టీ ట్రేడింగ్/బ్లెండింగ్, టీ రిటైలింగ్ విభాగాల్లో అనుభవం ఉన్నవారికి టెక్నికల్, ఫంక్షనల్, మార్కెటింగ్ అవసరాలకు తగ్గట్టుగా టీ టేస్టింగ్ సెషన్స్ నిర్వహిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో టీ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నిక్‌లకు సంబంధించిన అంశాలు వివరించడంతోపాటు టీ టేస్టింగ్ స్కిల్స్ నేర్పిస్తారు. దేశ విదేశాల్లో తయారుచేసే టీ రకాలను టేస్ట్ చేసే మెథడాలజీని వివరిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా అకడమిక్, టెక్నికల్, ప్రాక్టికల్ మాడ్యూల్స్ ఉంటాయి. చివరలో అసెస్‌మెంట్ వర్క్ ఉంటుంది.

- అకడమిక్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్ ఫర్ రైట్ మార్కెటింగ్, టీ టేస్టింగ్-ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ అంశాలు; టెక్నికల్ మాడ్యూల్‌లో ఫ్లెవర్ ప్రొఫైలింగ్ ఆఫ్ టీ గ్రేడింగ్, లాంగ్వేజ్ ఆఫ్ టీ టేస్టింగ్, కప్ టేస్టింగ్ టెక్నిక్స్, ఎలక్ట్రానిక్ నోస్ అండ్ ఎలక్ట్రానిక్ టంగ్, ఎవల్యూషన్ అండ్ స్కోరింగ్, టేస్టింగ్ ఫర్ ప్రొక్యూర్‌మెంట్స్ అండ్ టీ బ్లెండ్స్, ప్యాలెట్ మెమరీ-టీ టేస్టింగ్/ బ్లెండింగ్ అంశాలు ఉంటాయి. ప్రాక్టికల్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్, సెన్సరీ స్కిల్స్‌కు సంబంధించిన శిక్షణతోపాటు ఫీల్డ్ స్టడీ, టీ ఎస్టేట్/ ఫ్యాక్టరీ విజిట్స్, మార్కెటింగ్ అంశాలు ఉంటాయి. అసెస్‌మెంట్‌లో ప్రాజెక్ట్ ప్రజంటేషన్, ప్రాక్టికల్ టెస్టులు, రిటెన్ టెస్టులు, కేస్ అనాలిసిస్, ఎక్స్‌పర్ట్ కమిటీ ఎవల్యూషన్ అండ్ సర్టిఫికేషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం తప్పనిసరి. టీ సంబంధిత ప్రొడక్షన్, మార్కెటింగ్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఇంటర్వ్యూ, టీ టేస్టింగ్‌కు సంబంధించిన సైకోమెట్రిక్ టెస్ట్, బ్లైండ్ సెన్సరీ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.80,000+జీఎస్‌టీ(విదేశీయులకు 1100 యూఎస్ డాలర్లు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500; విదేశీయులకు 15 యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 18
- **చిరునామా:** ఎండీపీ యూనిట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, జ్ఞాన భారతి క్యాంపస్, బెంగళూరు-560056
- **వెబ్‌సైట్:** www.iipmb.edu.in

జాబ్ కార్నర్



కెనరాబ్యాంకులో

ఖాళీలు 3000

బెంగళూరులోని కెనరా బ్యాంకు, హ్యూమన్ రిసోర్సెస్ విభాగం, ప్రధాన కార్యాలయం దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటీస్‌షిప్ శిక్షణలో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 4 లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ పూర్తి వివరాలు సెప్టెంబరు 21న వెల్లడికానున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయసు: సెప్టెంబరు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: సెప్టెంబరు 21

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: canarabank.com/

నార్త్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 1679

ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) నార్త్ సెంట్రల్ రైల్వే ఈసీఆర్ పరిధిలోని డివిజన్/ వర్క్‌షాపుల్లో 1,679 యాక్ట్ అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, మెకానిక్, వైర్‌మన్, బ్లాక్ స్మిత్, ప్లంబర్, డ్రాఫ్ట్‌మన్, స్టెనోగ్రాఫర్, టర్నర్, సీఓపీఏ తదితరాలు.

వయసు: అక్టోబరు 15 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: అక్టోబరు 15

వెబ్‌సైట్: www.rrcpryj.org/

హెచ్ఎస్ఎఫ్‌సీలో టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు

ఖాళీలు 103

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)కు చెందిన బెంగళూరులోని హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్ సెంటర్(హెచ్ఎస్ఎఫ్‌సీ) తాత్కాలిక ప్రాతిపదికన 103 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఖాళీలు

- మెడికల్ ఆఫీసర్(ఎస్‌డీ/ఎస్‌సీ)- 3
- సైంటిస్ట్/ ఇంజనీర్-ఎస్‌సీ- 10
- టెక్నికల్ అసిస్టెంట్ - 28
- సైంటిఫిక్ అసిస్టెంట్ - 1
- టెక్నీషియన్-బి - 43
- డ్రాఫ్ట్‌మన్- 13
- అసిస్టెంట్(రాజ్ భాష)- 5

అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ, బీఈ/ బీటెక్(సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్/ ఎండీ, ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: అసిస్టెంట్ పోస్టులకు 28 సంవత్సరాలు, మిగతా పోస్టులకు 18 నుంచి 35 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 9

వెబ్‌సైట్: www.hsfc.gov.in/

అప్రెంటీస్‌లు

ఉత్తరప్రదేశ్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎన్‌పీసీఐఎల్‌లో ఖాళీలు

ఖాళీలు 70

- ట్రేడ్ అప్రెంటిస్ - 50
- డిప్లొమా అప్రెంటిస్ - 10
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ - 10

విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

జీతం: నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,700 - రూ.8,050; డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,000; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టుకు రూ.9,000.

వయసు: దరఖాస్తు చివరితేదీ నాటికి ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుకు 18-24 సంవత్సరాలు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18-25, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18-26 సంవత్సరాలు ఉండాలి. (ఎస్సీ/ ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ట్రైనింగ్ ప్రదేశం: నరోరా అటామిక్ పవర్ స్టేషన్, నరోరా, బులంద్‌షహర్, ఉత్తరప్రదేశ్.

శారీరక ప్రమాణాలు: ఎత్తు 137 సెం.మీ.; బరువు 25.4 కిగ్రా, ఛాతి 3.8 సెం.మీ. ఉండాలి.

ఎంపిక: మార్కుల పర్సంటేజ్, షార్ట్ లిస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 3

వెబ్‌సైట్: npcilcareers.co.in/

ఈసీజీసీ లిమిటెడ్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఖాళీలు 40

ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థ ఈసీజీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో 40 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు అక్టోబరు 13 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు: ప్రొబేషనరీ ఆఫీసర్: 40 పోస్టులు(ఎస్సీ-6, ఎస్టీ-4, ఓబీసీ-11, ఈడబ్ల్యూఎస్-3, అన్‌రిజర్వుడు-16)

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమానమైన అర్హత కలిగి ఉండాలి.

వయసు: 2024 సెప్టెంబరు 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.53,600 - రూ.1,02,090

ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్), డిస్క్రిప్టివ్ పేపర్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.175. ఇతరులకు రూ.900

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ/ దరఖాస్తు సవరణ తేదీ: అక్టోబరు 13 వరకు.

దరఖాస్తు రుసుము చెల్లింపు తేదీలు: అక్టోబరు 13 వరకు

ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ(నాన్-క్రీమీలేయర్) అభ్యర్థులకు ప్రీ-ఎగ్జామినేషన్ ట్రైనింగ్ ప్రారంభం: అక్టోబరు 28 నుంచి

ఆన్‌లైన్ రాతపరీక్షల కాల్‌లెటర్స్ డౌన్‌లోడ్ ప్రారంభం: నవంబరు 5 నుంచి

ఆన్‌లైన్ రాతపరీక్ష తేదీ: నవంబరు 16

రాతపరీక్ష ఫలితాల ప్రకటన తేదీలు: డిసెంబరు 16 నుంచి 31 మధ్య

వెబ్‌సైట్: www.ecgc.in/

లిటిల్స్

సౌమ్యమైన మాట

గోపాలపురంలో రాజారాం అనే కూరగాయల వ్యాపారి ఉండేవాడు. అతని కొట్టులో సత్యం అనే యువకుడు కొత్తగా పనిలో చేరాడు. ఆ యువకుడు మంచి నిజాయితీపరుడు, కష్టపడి పనిచేసే స్వభావం ఉన్నవాడు కానీ, అతనికి కోపం ఎక్కువ, ఓపిక తక్కువ. కొట్టు దగ్గరకు వచ్చిన కొనుగోలుదారులు ఎవరైనా బేరమాడితే, 'వెళ్లండి వెళ్లండి ఇలా అయితే మీరేం కొంటారు'అంటూ పరుషంగా మాట్లాడేవాడు సత్యం మాటలకు కొందరు నొచ్చుకుని, రాజారాంకు ఫిర్యాదు కూడా చేసేవారు. రాజారాం ఒకటి రెండు సార్లు చెప్పి చూసాడు కానీ సత్యంలో మార్పు ఏమీ కనపడలేదు. ఒక రోజు ఆ ఊరి ప్రభుత్వ అధికారి ఇంటివారితో కూడా సత్యం కటువుగా మాట్లాడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సత్యంను పనిలోనుంచి తొలగించాల్సి వచ్చింది రాజారాంకి. పని కోల్పోయిన కొన్ని రోజులకు సత్యం తనను క్షమించి మరలా పనిలోకి తీసుకోవలసిందిగా యజమానిని అడగడానికి కొట్టు దగ్గరికి వెళ్లి మాటలాడేందుకు ప్రయత్నించగా రాజారాం అదేమీ వినిపించుకోకుండా 'ఏయ్ ఎన్నిసార్లు చెప్పాలి? నువ్వేమి పని చేయగలవు? వెళ్లు'అని కసిరి



కొట్టాడు.ఎంతో బాధ పడిన సత్యం కళ్ల నిండా నీళ్లతో తిరిగి వెళ్లబోతూ, యజమానితో ఇలా అన్నాడు. 'అయ్యా.. మీరు నాకు మరలా పని ఇవ్వకున్నా కనీసం నేను చెప్పేది ఒకసారి వినండి దయచేసి' అన్నాడు. రాజారాం వెంటనే అతన్ని వెనక్కి పిలిచి, ' ఇపుడు అర్థం అవుతుందా మనతో ఒకరు కటువుగా మాట్లాడితే ఎలా అనిపిస్తుందో?

అచ్చు ఇలాగే మనం ధర తగ్గించినా లేకున్నా కనీసం కొనుగోలుదారులు బేరం ఆడుతున్నపుడు వారి మాట వినాలి కదా.నువ్వు ఎన్నిసార్లు వాళ్లను ఇలాగే విదిలించి ఉంటావు? వారంతా కూడా ఇలాగే బాధపడి ఉంటారు అని ఇప్పుడైనా తెలిసిందా?అన్నాడు. దానికి సత్యం 'సౌమ్యంగా మాట్లాడటంఎంత మంచిదో ఇపుడు నాకు బాగా అర్థమైంది అండి మరెపుడూ ఎవరితో పరుషంగా మాట్లాడను అని మీకు మాట ఇస్తున్నాను' అన్నాడు.దానికి 'నేను ఇపుడు నిన్ను నమ్మగలను రేపటినుండే మరలా పనిలో చేరు' అని రాజారాం అనడంతో, సంతోషపడి ఇంటికి వెళ్లిపోయాడు సత్యం.

10 తేడాలను కనిపెట్టండి





దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 413

1		7		5				8
					2		7	
			3			5	9	
3	8					6		
			8		4			
		4					8	5
	5	1			3			
	2		5					
9				2		8		1

సుడోకు - 412 సమాధానం

3	2	9	8	4	7	1	6	5
6	1	8	5	2	3	4	9	7
4	5	7	9	6	1	2	3	8
8	4	5	1	3	6	7	2	9
9	7	6	2	5	4	8	1	3
1	3	2	7	8	9	6	5	4
7	6	1	3	9	8	5	4	2
5	9	4	6	7	2	3	8	1
2	8	3	4	1	5	9	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.